
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం
బుధవారం 24, జనవరి 2024



టీడీపీలో కొలిక్కి వస్తున్న కసరత్తు
తొలి జాబితాలో ఏడుగురు అభ్యర్థులకు అవకాశం
జనసేనకు దర్శి ఖరారు
ఆచితూచి అడుగులేస్తున్న అధిష్ఠానం

ఖరారైనట్లే..!

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)
టీడీపీ అధిష్ఠానం అభ్యర్థుల జాబితాపై కసరత్తును ముమ్మరం చేసింది. మంగళ, బుధవారాల్లో తొలి జాబితాపై స్పష్టతకు వచ్చే అవకాశం ఉంది. ఆ మేరకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. తదనుగుణంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి కొన్ని అంశాలపై తాజా సమాచారాన్ని కూడా మంగళవారం ఆయన సేకరించుకున్నారు. అందిన సమాచారం మేరకు.. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మిత్రపక్షమైన జనసేనకు దర్శి నియోజకవర్గాన్ని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన చోట్ల ఏడు స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకున్నారు. సిటింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న అద్దంకి, పర్చూరు, కొండపి నుంచి తిరిగి రవికుమార్, సాంబశివరావు, స్వామికి అవకాశం ఇవ్వబోతున్నారు. మాజీ ఎమ్మెల్యేల్లో ఒంగోలు నుంచి దామచర్ల జనార్దన్, కనిగిరి నుంచి ఉగ్రనరసింహారెడ్డి, సంతనూతలపాడు నుంచి విజయ్‌కుమార్, అలాగే వైపాలెం నుంచి ఎరిక్షన్‌బాబు పేర్లను ఖరారు చేసినట్లు తెలిసింది. రానున్న నాలుగైదు రోజుల్లో వచ్చే తొలి జాబితాల్లో ఈ ఏడు స్థానాల్లో అభ్యర్థుల పేర్లను ప్రకటించే అవకాశం ఉంది.

టీడీపీ
అధినేత చంద్రబాబునాయుడు రానున్న సాధారణ ఎన్నికల్లో గెలుపు గుర్రాలను సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపిక దాదాపు కొలిక్కివచ్చింది. అద్దంకి, పర్చూరు, కొండపిలో సిటింగ్ ఎమ్మెల్యేలు రవికుమార్, సాంబశివరావు, స్వామితోపాటు ఒంగోలులో దామచర్ల, కనిగిరిలో ఉగ్రకు దాదాపు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లే. పొత్తులో భాగంగా జనసేనకు దర్శి అసెంబ్లీ నియోజకవర్గాన్ని కేటాయించినట్లు తెలిసింది. అందులో భాగంగా అక్కడ అభ్యర్థి ఎంపికపై తీవ్ర కసరత్తు జరుగుతోంది.



రెండో జాబితాలో లోక్‌సభ అభ్యర్థులు

దర్శి జనసేనకు కేటాయించినందున గిద్దలూరు నుంచి మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. గిద్దలూరు, మార్కాపురం, కందుకూరు, చీరాల అభ్యర్థులను రెండో జాబితాలో వెల్లడించాలన్న ఆలోచనలో ఉన్నారు. ఒంగోలు, బాపట్ల ఎంపీ అభ్యర్థులపై స్పష్టత రావాల్సి ఉంది. ఒంగోలు ఎంపీ మాగుంట టీడీపీలోకి వస్తే ఆయన కుమారుడు రాఘవరెడ్డికి ఎంపీ టికెట్ కోరుకునే అవకాశం ఉంది. అదే సమయంలో ఒంగోలు ఎంపీగా యాదవ సామాజికవర్గం అభ్యర్థికి అవకాశం ఇవ్వాలన్న ఆలోచనతో టీడీపీ కసరత్తు చేస్తోంది. టీడీపీ ఒంగోలు అధ్యక్షుడు నూకసాని బాలాజీతో పాటు కడప జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడి పేరును టీడీపీ పరిశీలిస్తోంది. బాపట్ల లోక్‌సభ నుంచి ఆరుగురు టీడీపీ టికెట్ ఆశిస్తూ పోటీపడుతున్నారు. దళితుల్లో ఏ వర్గం వారికి అవకాశం ఇవ్వాలన్న అంశంపై అధినాయకత్వం ఒక నిర్ణయానికి రాలేదని తెలుస్తోంది. రెండో జాబితాలో ఒంగోలు, బాపట్ల లోక్‌సభ అభ్యర్థుల పేర్లు వెల్లడి కానున్నాయి.

దర్శి కోసం ప్రముఖుల ప్రయత్నాలు

పొత్తులో భాగంగా దర్శి నుంచి జనసేనకు కేటాయించడంతో అభ్యర్థి ఎంపికపై ఆ పార్టీ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఆ నియోజకవర్గంలో పనిచేస్తున్న గరికపాటి వెంకట్‌తోపాటు తాజా రాజకీయ పరిణామాల్లో మరికొన్ని పేర్లు పరిశీలనలోకి వచ్చినట్లు తెలిసింది. ఆ రెండు పార్టీల్లో ఏ పార్టీ నుంచైనా పోటీ చేయాలనే ఆలోచనతో గతంలోనే మౌమిత ఫౌండేషన్ చైర్మన్ బాదం మాధవరెడ్డి టీడీపీ అధినేతను కలిసి ఉన్నారు. తాజాగా అద్దంకి వైసీపీ మాజీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య కూడా ఆ వైపు దృష్టిసారించారు. ఆయన తండ్రి గరటయ్యతో రెండు పార్టీల్లో ఉన్న నేతలు టచ్‌లో ఉన్నట్లు సమాచారం. టీడీపీ అయితేనే పోటీచేసే ఆలోచనలో హర్షిణి రవికుమార్ ఉన్నందున ఆయన పేరు వెనక్కిపోయింది. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు సంబంధించిన కొందరు ఆ రెండు పార్టీల నేతలతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతానికి కృష్ణచైతన్య, వెంకట్, మాధవరెడ్డి పేర్లే పరిశీలనలో ప్రముఖంగా ఉన్నట్లు సమాచారం. ఇంకోవైపు వైసీపీలో ఉన్న ఓ మాజీ మంత్రి వైపు నుంచి కొందరు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. తొలి జాబితాలోనే దర్శి జనసేన అభ్యర్థిని ప్రకటించే ఉద్దేశంతో ఉన్నందున బుధ, గురువారాల్లో ఈ ఎంపికపై ఒక నిర్ణయం జరగవచ్చని భావిస్తున్నారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక తోడ్పాటు

మంత్రి సురేష్



చెక్కును అందిస్తున్న మంత్రి సురేష్, జడ్పీచైర్‌పర్సన్, కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రాష్ట్రప్రభుత్వం ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. సీఎం మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండలో ఆసరా నాల్గవ విడత నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఆసరా నాల్గో విడతలో జిల్లాలో 36,769 స్వయ సహాయక సంఘాల్లోని 3,59,566మంది మహిళలకు రూ.280.10 కోట్లు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్, మంత్రి లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మేయర్ సుజాత, లింగంగుంట్ల రవిబాబు, మహబూబ్, విజయకుమార్ పాల్గొన్నారు.

ఇవే నా చివరి ఎన్నికలు

మాగుంట సీటు విషయంలో చర్చలు

వచ్చే నెల 10 లోపు పేదలకు పట్టాలు : మాజీ మంత్రి బాలినేని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని, పక్కన ప్రణీత్‌రెడ్డి, జంకె వెంకటరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గం నుంచే పోటీచేస్తున్నానని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ ఎన్నికలే తనకు చివరివన్నారు. ఈసారి తన కుమారుడు పోటీ చేస్తారని పేర్కొన్నారు. నగరంలోని పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి మంగళవారం సాయంత్రం ఒంగోలు వచ్చిన బాలినేనికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. కర్నూలురోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ రాత్రి 8.45కు చర్చి సెంటర్‌కు చేరుకుంది. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ పేదలందరికీ పట్టాలు ఇచ్చాక ఒంగోలు నుంచి పోటీచేస్తానని లేకపోతే చేయబోనని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. నగర పాలక సంస్థ పరిధిలో వెంగముక్కలపాలెం, ఎన్.అగ్రహారం ప్రాంతాల్లో రైతుల నుంచి భూసేకరణ చేస్తున్నట్లు చెప్పారు. అందుకోసం గతంలో రూ.30కోట్లు ఇవ్వగా ప్రస్తుతం రూ.180 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వచ్చే నెల 10వ తేదీలోపు 25వేల మంది పేదలకు సీఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. గతంలో ఒంగోలు నుంచి ఎంపీగా మాగుంట, ఎమ్మెల్యేగా నేను పోటీచేస్తానని చెప్పినట్లు తెలిపారు. మాగుంట సీటు విషయంలో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డితోపాటు పార్టీ నేతలు పాల్గొన్నారు.

భూములిచ్చిన వారికి చుక్కలు

ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో
ఈసీలు, ఇతర పత్రాల పేరుతో అధికారుల వేధింపులు
రెవెన్యూ సిబ్బంది ఓవరాక్షన్
ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు
పట్టణ ప్రజలకు స్థలాలు ఇచ్చే వ్యవహారంలో మతలబు



ఒంగోలు(విద్య), జనవరి 23 : ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో ఇళ్లు లేని పేదలకు స్థల పట్టాలు పంపిణీ చేసేందుకు భూములిచ్చిన రైతులకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది చుక్కలు చూపిస్తున్నారు. తాజాగా ఆ భూములకు సంబంధించి ఈసీలు, ఉమ్మడి కుటుంబాల్లో భూముల పంపిణీకి సంబంధించిన అఫిడవిట్లు తీసుకురావాలని ఇబ్బందిపెడుతున్నారు. భర్తలు మరణించిన వితంతువులను సైతం తమకు ఆ ఆస్తి ఏలా వచ్చిందో ఆధారాలు చూపాలంటూ వెనక్కు పంపుతున్నారు. కార్యాలయ సిబ్బంది అతి వ్యవహారంతో కొత్త వివాదాలు వచ్చేటట్లు ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరం చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు చెందిన కొందరు రైతుల భూములను ఇప్పటికే అధికారులు ఇళ్లస్థలాల కోసం ఎంపిక చేసి తీసుకున్నారు. వారికి పరిహారం చెల్లించేందుకు జాబితాలో వారి పేర్లు లేకపోవడంతో పరిహారం అందుతుందో, లేదోనన్న ఆందోళనకు బాధితులు గురవుతున్నారు. కొందరు రైతుల ఫైళ్లు గల్లంతయ్యాయని తెలుస్తోంది. మొత్తం మీద భూముల రికార్డుల పునఃపరిశీలన అంతా గందరగోళంగా మారింది. ఒంగోలు నగరంలోని ఇళ్లలేని పేదలకు పట్టాలు మంజూరుచేసేందుకు ఎన్.అగ్రహారం, మల్లేశ్వరపురం గ్రామాల్లో మొత్తం 209.49ఎకరాలను సేకరించారు. ఈ భూములకు పరిహారంగా రైతులకు రూ.210కోట్లు చెల్లించాల్సి ఉంది. గతేడాది మేలో రూ.30 కోట్లు చెల్లించారు. మిగిలిన రూ.180కోట్లు ప్రస్తుతం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కృషితో విడుదలయ్యాయి. ఈ నిధులను రైతుల ఖాతాలకు జమచేసేందుకు భూముల ఫైళ్ల పునఃపరిశీలన చేపట్టారు. ఎవరైనా భూములు అమ్ముకోవడం లేదా తాకట్టు పెట్టారా అన్న విషయం పరిశీలించారు. దీనికి ఎన్. అగ్రహారం, మల్లేశ్వరపురం గ్రామాలకు సంబంధించి రెండు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేశారు. మల్లేశ్వరానికి కేటాయించిన బృందం ప్రతి ఫైల్‌లో అడుగడుగునా అభ్యంతరాలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏమైనా ఫిర్యాదులు వచ్చినా, ఎవరైనా అభ్యంతరాలు తెలిపినా వారు రైతులకు ఆ భూములపై హక్కు ఎలా వచ్చిందో ప్రశ్నించవచ్చు. ఏ అభ్యంతరం లేకపోయినా ఈ బృందం అనుమానాలతో కొత్త వివాదాలు వస్తాయన్న ఆందోళన రైతులు వ్యక్తం చేస్తున్నారు. కాగా భూముల ఫైళ్ల పరిశీలనపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరు అనుమానాస్పదంగా ఉందంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు పరిహారం వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.



కనిగిరిలో రక్తదానం చేస్తున్న ఉగ్రనరసింహారెడ్డి

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

పలు ప్రాంతాల్లో కేక్ కటింగ్‌లు
ఇతర సేవా కార్యక్రమాలు
ఉత్సాహంగా పాల్గొన్న టీడీపీ శ్రేణులు
పలువురు ముఖ్యనేతలు హాజరు

ఒంగోలు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పలు పట్టణాలు, మండల కేంద్రాలలో ఆ పార్టీశ్రేణులు ఈ సందర్భంగా భారీగా కేక్ కటింగ్‌లు ఏర్పాటు చేశారు. అలాగే రక్తదాన శిబిరాలు, అన్నదానం ఇతర పలు సేవా క్యాక్రమాలు నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో ఇంచుమించు ముఖ్యనేతలు అంతా పాల్గొన్నారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. కొండపి నియోజకవర్గంలోని కొండపి, టంగుటూరు, పొన్నలూరు, సింగరాయకొండ మండల కేంద్రాల్లో భారీగా కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించగా ఎమ్మెల్యే డాక్టర్ స్వామి, యువ నేత దామచర్ల సత్యలు పాల్గొన్నారు. చీమకుర్తిలోని బధిరుల పాఠశాలలో జరిగిన లోకేష్ జన్మదిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నేతృత్వంలో కేక్ కటింగ్‌తో పాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. పెద్దారవీడులో జరిగిన వేడుకలలో అక్కడి ఇన్‌చార్జ్ ఎరిక్షన్ బాబుతోపాటు టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు. పొదిలి మండలం కాటూరివారిపాలెంలో రక్తదాన శిబిరం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పాల్గొన్నారు. దర్శిలో జరిగిన వేడుకలలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ఇతర నేతలు పాల్గొన్నారు. పామూరు, మద్దిపాడు, బీపేట, వై.పాలెం, పుల్లలచెరువు, దోర్నాల, దొనకొండ, ముండ్లమూరులతోపాటు పలు ఇతర మండలకేంద్రాల లోను లోకేష్ జన్మదిన వేడుకలను స్థానిక టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు.



ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న జనార్దన్, పక్కన టీడీపీ నేతలు

అక్రమార్కులపై వేటుపడేనా?

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిలో ఆందోళన

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23: వైద్య ఆరోగ్యశాఖలో 2020లో జరిగిన పోస్టుల భర్తీలో అవకతవకలకు పాల్పడిన అక్రమార్కులపై వేటుపడేనా? అన్న సందేహం వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యశాఖలో ఇష్టారీతిన నియామకాలు చేపట్టారనే ఆరోపణలు ఉన్నాయి. 2020లో కరోనాను సాకుగా చూపి నకిలీ సర్టిఫికెట్ల ద్వారా నియామకాలు చేపట్టారని ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ దినేష్‌కుమార్ సమగ్ర విచారణకు ఆదేశించారు. జడ్పీ సీఈవో జాలిరెడ్డి నేతృత్వంలో ముగ్గురు అధికారుల బృందం 50రోజుల పాటు విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ప్రధానంగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల్లోనే అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అప్పట్లో పనిచేసిన అధికారులు, సిబ్బంది కలిసి ఇష్టారీతిన పోస్టుల భర్తీ చేపట్టడంతోనే ఈ పరిస్థితి వచ్చినట్లు తెలిసింది. నోటిఫికేషన్ జారీ నుంచి అభ్యర్థుల నియామక పత్రాలు ఇచ్చేవరకు జరిగిన ప్రక్రియలో అనేక అవకతవకలు జరిగినట్లు విచారణాధికారులు గుర్తించినట్లు తెలిసింది. అయితే ఈ విచారణ నివేదిక అనంతరం అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులపై వేటుపడుతుందా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు నకిలీ సర్టిపికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిని ఇప్పుడు తొలగిస్తారా? లేక అదేవిధంగా కొనసాగిస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

అలుగులు ఆక్రమణ

పొదిలి మండలంలో వందల కోట్ల విలువైన చెరువు భూములు కబ్జా
అంతా వైసీపీ నేతల కనుసన్నల్లోనే
మామూళ్ల మత్తులో అధికారులు



ఆక్రమిత స్థలంలో నిర్మిస్తున్న చర్చి

పొదిలి, జనవరి 23 : మండలంలో వందల కోట్ల రూపాయల విలువైన చెరువు భూములు అన్యాక్రాంతమవుతూనే ఉన్నాయి. చివరకు కీలకమైన అలుగులు సైతం కబ్జాదారుల కోరల్లో చిక్కుకున్నాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అక్రమార్కులు మరింతగా బరితెగిస్తున్నారు. అధికార పార్టీ నేతల అండతో రెచ్చిపోతున్నారు. పొదిలి పెద్దచెరువు, చిన్నచెరువు, తీగదుర్తిపాడు, తల్లమల్ల, రామాపురం గ్రామాల్లో ఐదు పెద్ద చెరువులు ఉన్నాయి. వాటితోపాటు మిగిలిన గ్రామాల్లో మరో 18 చిన్నచెరువులు ఉన్నాయి. వీటన్నిటి లోపలి భాగం సామర్థ్యం సుమారు 983.48 ఎకరాలు. అందులో సగంపైనే అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోగా 400 ఎకరాలు మాత్రమే మిగిలి ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం ఆ చెరువుల పరిస్థితి దీనంగా మారింది. ఆ ఆక్రమిత భూముల్లో సుమారు 280 ఎకరాలకు కబ్జాదారులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం గమనార్హం. ఇంత జరుగుతున్నా అడిగే అధికారే లేరు. మామూళ్లకు కక్కుర్తి పడి చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత చెరువులు, అలుగులు, వాగులు, వంకలు ఇలా దొరికింది దొరికినట్లుగా ఆక్రమించి, నిర్మాణాలు చేస్తున్నారు.

పొదిలిలో చిన్నచెరువు, పెద్దచెరువులకూ గండం

పొదిలి పట్టణంలో ఉన్న రెండు ప్రధానమైన చిన్న, పెద్ద చెరువులతో పాటు, తోళ్ల మడుగువాగు, అలుగులు, సప్లయ్ చానల్స్ తోపాటు రెండు చెరువులనూ అనుసంధానం చేసే ప్రధాన కాలువపై ఏకంగా కాంప్లెక్స్‌ను నిర్మించారు. చిన్నచెరువు విస్తీర్ణం 101.75 ఎకరాలు కాగా ఇప్పుడు చెరువు ఆనవాళ్లు కూడా లేవు. అందులో కబ్జా చేసి కొందరు శాశ్వత నిర్మాణాలు చేపట్టగా, మరికొందరు పంట పొలాలుగా మార్చారు. పెద్దచెరువు 701.36 ఎకరాల్లో 200 ఎకరాలకుపైగా ఆక్రమించి సాగు భూమిగా మార్చేశారు. మరో 100 ఎకరాలకుపైగా గృహ నిర్మాణాలు జరిగాయి.

ఫిర్యాదులపై విచారణ శూన్యం

ఆక్రమణలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు విచారణ చేపట్టడం లేదు. ఈ విషయమై ఉన్నతాధికారులు సీరియస్‌గా హెచ్చరించినా స్థానిక అధికారులు నాలుగురోజులు హడావుడి చేసి ఆ తర్వాత చేతులు దులిపేసుకుంటున్నారు. అందినకాడికి ముడుపులు దండుకొని తూతూమంత్రంగా నివేదికలు పంపుతున్నారని సమాచారం. చెరువులను ఏడాదికి రెండు సార్లు సర్వే చేయిస్తున్నామని చెబుతున్న అధికారులు దాని లెక్క ఎంతనేది మాత్రం తేల్చడం లేదు.

ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు ఒకరిపై ఒకరు..

ఆక్రమణలపై చర్యలకు ఇరిగేషన్ అధికారులను అడిగితే రెవెన్యూ.. రెవెన్యూ వారిని అడిగితే ఇరిగేషన్ అధికారులపై చెప్పుకుంటూ కాలంగడుపుతున్నారు. ఈ పరిణామాలు అక్రమార్కులకు వరంగా మారింది. వందలకోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా కనీసం చర్యలు తీసుకోకపోవడంలో అధికారుల చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థమవుతోంది. ఇప్పటికైనా ఆక్రమణకు గురైన చెరువులు, భూములను గుర్తించి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇరిగేషన్ అధికారులకు ఎప్పుడు ఫోన్ చేసినా అందుబాటులో ఉండడం లేదు.



మట్టిని తరలించేందుకు వచ్చిన ట్రాక్టర్లు

అడ్డూఅదుపు లేకుండా మట్టి తవ్వకాలు

వైసీపీ నేతల అండతో కొందరు అక్రమార్కులు పెద్దచెరువులో అడ్డూఅదుపు లేకుండా మట్టిని తవ్వుతున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా మట్టిని అమ్ముకుంటున్నారు. కొత్త వెంచర్లలో చదును కోసం అవసరమైన మట్టి కోసం పెద్దచెరువును అడ్డాగా మార్చారు. ఇదే అధికారులకు ఆదాయ వనరైంది. ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లను తరలిస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. మట్టి తవ్వకానికి ఎలాంటి అనుమతులు లేవు. ఎవరైనా అడిగితే అధికారులే తమకు అనుమతులు ఇచ్చారని వెంచర్ యజమానులు బహిరంగంగానే చెప్తున్నారు. ఇటీవల చెరువుమధ్యలో దర్శి నుంచి వచ్చిన మతబోధకుడు ఏకంగా ప్రార్థన మందిరాన్ని ఏర్పాటు చేశారు.



పెద్దచెరువు, చిన్న చెరువు అనుసంధానంగా ఉన్న వాగును పూడ్చి నిర్మించిన కాంప్లెక్స్


మద్దిపాడులో కేక్ కట్ చేస్తున్న జయంత్‌బాబు


ఎనికపాడులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న హరిబాబు


జరుగుమల్లిలో కేక్ కట్‌చేస్తున్న పార్టీ నాయకులు

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

● హాజరైన దామచర్ల, ఎమ్మెల్యే స్వామి, బీఎన్

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 23 : ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: టీడీపీ జాతీయ ప్రదానకార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం మద్దిపాడులో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో అడకా స్వాములు, జనసేన మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం, నాయకులు మందపల్లి శ్రీనివాసులు, సుద్దపల్లి అనిల్, రెబ్బవరపు ప్రభాకర్, జాన్సన్, మండవ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: నారా లోకేష్ జన్మదిన వేడుకలు మండలంలోని పలుగ్రామాల్లో ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి ఎనికపాడు, పి.తక్కెళ్లపాడు గ్రామాల్లో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు టి.శ్రీను, ఆర్.సురేష్, సీహెచ్.శ్రీను, పి.సాంబశివరావు, వెంకట్రావు, గోపి, ఎన్.శ్రీను, లక్ష్మీనారాయణ, మాధవ తదితరులు పాల్గొన్నారు.


ఒంగోలులో దామచర్ల జనార్దన్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు


కొండపిలో కేక్ కట్‌చేస్తున్న సత్య, ఎమ్మెల్యే స్వామి


చీమకుర్తిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న విజయ్‌కుమార్ తదితరులు

చీమకుర్తిలో..

చీమకుర్తి : టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి లోకేష్ పుట్టినరోజు వేడుకలు చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ మానసిక వికాసకేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ ఈ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి అన్నదానాన్ని జరిపారు. దివ్యాంగుల కోసం పార్టీ పట్టణ అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు విరాళంగా అందచేసిన రూ.10వేలను విజయ్‌కుమార్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిపాటి రాఘవరావు, మద్దినేని హరిబాబు, అరికట్ల సుమతి, రావిపాటి రాంబాబు, కాట్రగడ్డ రమణయ్య, ఉన్నం సుబ్బారావు, సూరంపల్లి హనుమంతరావు, గంగుల శివపార్వతి, సుజాత, రమాదేవి, మోమిన్, జనసేన నాయకులు నాగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నేతలు స్థానిక కందుకూరు రోడ్డు కూడలి ఎన్టీఆర్ సర్కిల్ ఎదుట మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నాయకులు షేక్ సంధాని భాష, కూనపరెడ్డి సుబ్బారావు, గాంధీ చౌదరి, రామారావు, చంటి, మించల బ్రహ్మయ్య, చిగురుపాటి గిరి, గుడె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు, జనవరి 23 : టంగుటూరు పోలేరమ్మ గుడి వేదికగా మంగళవారం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ ఆధ్వర్యాన జరిగిన ఈ వేడుకకు ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య హాజరయ్యారు. ఈసందర్భంగా పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.

రానుంది టీడీపీ ప్రభుత్వమే : సత్య

మరో 70 రోజుల్లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుతీరనుందని, అక్కడ చంద్రబాబు ముఖ్యమంత్రిగా, ఇక్కడ డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఎమ్మెల్యేకానున్నారని, ఈ తక్కువ సమయంలో ప్రతి టీడీపీ ప్రజాప్రతినిధి, నాయకుడు, కార్యకర్త నిర్విరామంగా పార్టీ ఉన్నతికి పాటుపడాలని దామచర్ల సత్య చెప్పారు. అధికారం వస్తుంది కదా అని అశ్రద్ధ వహించవద్దని, ప్రభుత్వం ఏర్పడే వరకు గట్టి కృషి చేయాలని నొక్కి చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్, కార్యదర్శి రవీంద్ర, పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను, సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, తెలుగు రైతు నేత బెజవాడ వెంకటేశ్వర్లు, మండల యువనేత అబ్బూరి అభిషేక్, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బ్రహ్మానందం, టీడీపీ నాయకులు దయానందం, వంశీ, అనిల్, సుధాకర్ పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: టీడీపీ నేత లోకేష్ జన్మదిన సందర్భంగా కొండపిలోని దివంగత ఎన్టీఆర్, దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య, ఎమ్మెల్యే స్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమందనాయుడు, నాయకులు బత్తుల నారాయణస్వామి, చాగంరెడ్డి నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి పెదకండ్లగుంట మాజీ సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు, యూత్ నాయకులు షేక్ ఖాఈషా, నేతి రవికుమార్ పాల్గొన్నారు.

జరుగుమల్లిలో...

జరుగుమల్లిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, పోటు పెదబాబు, మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు కేక్‌కట్ చేశారు.

పొన్నలూరులో...

పొన్నలూరులోని బస్టాండ్ సెంటర్‌లోని దివంగత ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాల సెంటర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే స్వామి, నేత దామచర్ల సత్య కేక్ కట్‌చేశారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఆక్వా రైతులకు అవగాహన సదస్సు

ఒంగోలునగరం, జనవరి 23: కొత్తగా అమల్లోకి రానున్న ఇన్సూరెన్సు పథకంపై అవగాహన కలిగించేందుకు ఈ నెల 24వ తేదీన సదస్సును నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు జిల్లాలకు చెందిన ఆక్వా రైతులకు ఈ సదస్సు ఒంగోలులోని రంగారాయుడు చెరువు వద్ద ఉన్న డీఎల్‌డీఏ సమావేశం హాలులో జరుగుతుందన్నారు. చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్ వాటర్ సంస్థ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నదని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే సదస్సులో నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన ఆక్వా రైతులు పాల్గొంటారన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆక్వా అభివృద్ధి అథారిటీ వైస్ చైర్మన్ వడ్డె రఘురామ్, మత్స్యశాఖ ఏడీ అంజలి హాజరవుతారని పేర్కొన్నారు.

అనంతవరంలో రైతులతో ముఖాముఖి

కాగా జిల్లా ఆక్వా రైతుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు టంగుటూరు మండలం అనంతవరం గ్రామంలో రొయ్యల రైతులతో ఆంధ్రప్రదేశ్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంటు అథారిటీ వైస్ చైర్మన్ రఘురామ్ ముఖాముఖీ జరుగుతుందని సంఘ జిల్లా జిల్లా అధ్యక్షుడు దుగ్గినేని గోపీనాథ్ మంగళవారం తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు కూడా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఆక్వా రైతుల సమస్యలను తెలుసుకుంటారని ఆయన పేర్కొన్నారు.

బీజేపీలోకి పలువురు మహిళల చేరిక


పార్టీలో చేరిన మహిళలతో శివారెడ్డి, యోగయ్యయాదవ్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23: ఒంగోలు నగరం అన్నవరప్పాడుకు చెందిన పలువురు మహిళలు భారతీయ జనతా పార్టీలో చేరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ.యోగయ్యయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డి.లక్ష్మి, విజయరావు, లత ఆధ్వర్యంలో పార్టీలో చేరిన మహిళలకు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం యోగయ్యయాదవ్ మాట్లాడుతూ దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. గత పదేళ్ల నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్టుదలతో అయోధ్యలో రామమందిరం నిర్మించారన్నారు. దేశ ప్రజల రక్షణ, హిందూ ధర్మాన్ని కాపాడే పార్టీ ఒక్క బీజేపీ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మక రచన' గ్రంథావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆదినారాయణ

ఒంగోలు(కల్చరల్), జనవరి 23: డిగ్రీ ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్ విద్యార్థుల కోసం తయారుచేసిన సృజనాత్మక రచన గ్రంథాన్ని నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మంగళవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠ్యగ్రంథంలో విద్యార్థులకు ఉపయోగపడే వ్యక్తీకరణ నైపుణ్యాలు, అనువాద రచనలు, మాధ్యమాలకు సంబంధించిన వివరాలు, వ్యాసరచన, తెలుగు సాంకేతిక మొదలైన అంశాలు పాఠ్యాంశాలుగా పరిచయం చేయడం ఎంతో చక్కగా ఉందన్నారు. యూజీసీ నిబంధనల మేరకు డిగ్రీ రెండో సెమిస్టర్‌లో నూతనంగా తయారుచేసిన ఈ పాఠ్యగ్రంథం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. కార్యక్రమంలో నూనె అంకమ్మరావు, బి.శ్రీరామశర్మ, హరివరం మహేశ్వరాచారి, కనుమళ్ల శేషగిరిరావు పాల్గొన్నారు.

మోటుమాలలో వైద్యపరీక్షలు

కొత్తపట్నం, జనవరి 23: మోటుమాల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యనిపుణులు స్వప్న, కొత్తపట్నం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి, ఈతముక్కల డాక్టర్ శివపార్వతి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి మందులు అందజేశారు.కార్యక్రమంలో సర్పంచ్ గోపీ, సీహెచ్‌వో ఓంకారమ్, పీహెచ్ఎన్ ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలినేనికి ఘన స్వాగతం



ఒంగోలులో జరిగిన ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, హాజరైన వైసీపీ శ్రేణులు

● నగరంలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23: ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి మంగళవారం సాయంత్రం వైసీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఒంగోలులో 25వేల మంది పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి రూ. 180 కోట్లు సాధించి మొదటిసారిగా నగరానికి వచ్చిన బాలినేనికి స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావుతో పాటు కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పార్టీ నాయకులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బాలినేని, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డిలకు భారీ గజమాలను వేశారు. ఫ్లై ఓవర్ వద్ద నుంచి భారీ మోటార్ సైకిల్ ర్యాలీ ఏర్పాటు చేయగా, వాహనంపై టాపు తీసి ప్రజలకు అభివాదం చేసుకుంటూ ర్యాలీ ముందుకు సాగగా బాలినేనికి మద్దతుగా శ్రేణులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఒంగోలురూరల్, కొత్తపట్నం మండలం, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల నుంచి భారీగా తరలివచ్చారు.

గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద..

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద మంగళవారం ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వైసీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు ఆధ్వర్యంలో వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, ఎంపీటీసీ సభ్యుడు కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట్రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన భవనాలను 31లోపు ప్రారంభించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23 : పూర్తయిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను ఈనెల 31వ తేదీలోపు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తయ్యి సంబంధిత శాఖలకు అప్పగించిన వాటిని స్థానిక ఎమ్మెల్యే ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించాలన్నారు. కొత్త ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీని త్వరగా పూర్తి చేయాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసినా వారు నిర్మాణాలు ప్రారంభించకపోతే భవిష్యత్‌లో ఫ్రీ హోల్డ్ అవకాశాన్ని నష్టపోతారనే విషయాన్ని అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఉపాధి పనుల్లో ఎస్సీఎస్టీ కుటుంబాలకు వంద రోజుల పనిదినాలను తప్పని సరిగా కల్పించాలని, ఆడిట్‌లో గుర్తించిన నగదును వెంటనే రికవరి చేసేలా ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రారంభించిన అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం అంశాల వారీగా దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో అధికారులు జాలిరెడ్డి, మర్దన్‌ఆలీ, పేరయ్య, వసుంధర, శ్రీనివాసరావు, జీవీ.నారాయణరెడ్డి, గ్లోరియా, బేబీరాణి, లక్ష్మారెడ్డి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి


నివాళులర్పిస్తున్న గ్రంథాయ సిబ్బంది

ఒంగోలు(కల్చరల్), జనవరి 23: స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఒంగోలులోలని జిల్లా గ్రంథాలయంలో కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది, పాఠకులు నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారత స్వాతంత్ర ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి యువతలో ఉత్సాహాన్ని నింపారన్నారు. ఆయన జయంతిని అధికారికంగా పరాక్రమ్‌దివస్‌గా జరుపుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, సిబ్బంది కె.సంపూర్ణమ్మ, జి.శ్యాంసన్, కె.కృష్ణవేణి, ఎస్.అనిల్‌బాబు, ఎం.శివకుమారి, వై.మృదుల్‌కుమార్, స్మైలీ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక రైల్‌పేట నేతాజీ పబ్లిక్ స్కూల్‌లోను నేతాజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కరస్పాండెంట్ సీహెచ్.మల్లిఖార్జునరావు అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏవీ.సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు వీఎస్‌జీ.మాధవరావు, మురళీకృష్ణ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొని నేతాజీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనుపమ, సుధా, సౌజన్య, అంజలి, పుష్ప, దివ్య, భారతి, భాస్కర్, మోహన్ స్వామి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ఓట్ల తొలగింపు

సింగరాయకొండ, జనవరి 23 : ఎలక్షన్ కమిషన్ ప్రచురించిన తుది ఓటర్ల జాబితాలో తొలగించిన ఓట్లను నిబంధనల ప్రకారమే తీసివేశామని తహసీల్దార్ ఉషా చెప్పారు. మంగళవారం మండలంలోని కలికవాయి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఓట్ల తొలగింపుపై అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు.


జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉష

అవీ..ఇవీ..

రైలు కిందపడి యువజంట ఆత్మహత్య

ఒంగోలు(క్రైం), జనవరి 23: రైలు కింద పడి యువజంట ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన ఒంగోలు- కరవది రైల్వేస్టేషన్‌ల మధ్యలో మగళవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో జరిగింది. సుమారు 30 ఏళ్ల యువకుడు, 25 ఏళ్ల యువతి మృతి చెందారని, వారు భార్యాభర్తలై ఉండవచ్చిని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. యువకుడు నలుపు రంగు రెడిమేడ్ ప్యాంట్, మెరున్ రంగు నిండు చేతుల చొక్కా ధరించాడు. యువతి వంగపువ్వు రంగు పంజాబీ డ్రస్సు , తెల్ల చున్నీ, లేత ఎరుపు రంగు పెట్టీకోటు ధరించింది. అయితే మృతదేహాల వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. ఇరువురు సోమవారం రాత్రి నుంచి రైలుపట్టాల మీద తిరుగుతూ విజయవాడ వైపు గంగా కావేరి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ మేరకు సంఘటన స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. సమాచారం తెలిసినవారు 9440904870, 944062746, 9440887143 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఒంగోలు రైల్వే ఎస్సై శ్రీకాంత్ కోరారు.

27న ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలు నగరం, జనవరి 23: ఒంగోలులోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి టి.భరద్వాజ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జియో టెలికమ్ సంస్థలోని ఉద్యోగ ఖాళీల భర్తీకి ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సేల్స్ ఆఫీసర్, జియో ఫైబర్ ఇంజనీర్, ఫైబర్ అసోసియేట్, జియె పాయింట్ మేనేజర్, జియో పాయింట్ అసిస్టెంట్ మేనేజర్, ఫీల్డు ఇంజనీర్ తదితర ఖాళీల భర్తీకి ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్, డిగ్రీ, గ్రాడ్యుయేషన్, ఐటీఐ, డిప్లమా పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా జరుగుతుందని, ఎంపికైన వారికి ఏడాది రూ.1.8 లక్షల నుంచి రూ.4లక్షల వరకు వేతనం ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి రిజిస్ట్రేషన్లపై శిక్షణ : డీపీవో

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23 : జగనన్న శాశ్వత స్థల హక్కు-పేదలందరికీ ఇళ్లు పథకం ప్లాట్స్ రిజిస్ట్రేషన్లపై పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లకు బుధవారం నుంచి రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జీవీ.నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ సహాయకులు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఎంపీడీవోలు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

ఎఫ్‌సీఐ గోడౌన్‌ను సందర్శన


అవగాహన కల్పిస్తున్న జీఎం విజయ్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23: ఒంగోలులోని భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)గోడౌన్‌ను విద్యార్థులు మంగళవారం సందర్శించారు. నగరంలోని సీఎస్‌ఆర్ అగ్రికల్చరల్ కాలేజీ, కనిగిరి బీఎస్సీ అగ్రికల్చర్ కాలేజీల్లో మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఎఫ్‌సీఐ గోడౌన్‌ను సందర్శించగా జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్ కేంద్రం ద్వారా అందిస్తున్న వివిధ ఆహార ఉత్పత్తులను వివరించారు. బియ్యం నిల్వలో వచ్చే పురుగులు, వాటి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవీంద్రమాలిక్, ఇ.రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో మహిళా ఓటర్లే అధికం

మద్దిపాడు, జనవరి 23: మద్దిపాడు మండలంలో 40,920 మందిఓటర్లు ఉన్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆశాజ్యోతి మంగళవారం తెలిపారు. 20,007 మంది పురుషులు, 20,913 మంది మహిళా ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. మండలంలో మహిళా ఓటర్ల సంఖ్య 906మంది అధికంగా ఉన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జాబితా ప్రకటించినట్టు వెల్లడించారు.

ఏఐసీటీఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(విద్య), జనవరి 23: ఇంజనీరింగ్ కళాశాలల్లో బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులను విలీనం చేస్తూ అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.గుండారెడ్డి డిమాండ్ చేశారు. అసోసియేషన్ పిలుపు మేరకు ప్రైవేటు కళాశాలల యాజామాన్యాలు మంగళవారం ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి తేవడం చారిత్రక తప్పిదమన్నారు. ఇప్పటికే డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు లేక ఇబ్బందులు పడుతుండగా ఈ మూడు కోర్సులను తొలగించడం వల్ల వాటి ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం వైస్‌చాన్స్‌లర్ అంజిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.సూర్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి జయహో బీసీ సదస్సుకు సమాయత్తం

టంగుటూరు, జనవరి 23 : మండలంలో నేడు జరుగనున్న జయహో బీసీ సదస్సుకు మండల తెలుగుదేశం పార్టీలోని బీసీ క్యాడర్ సమాయత్తమైంది. బీసీ క్యాడర్‌ను అప్రమత్తం చేసి సదస్సును విజయవంతం చేసేందుకు టీడీపీ మండల నాయకత్వం ఇప్పటికే టంగుటూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సోమవారం రాత్రి జరిగిన మండల పార్టీ బీసీలు, అనుబంధ సంఘాల కార్యకర్తల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, తెలుగురైతు నేత బెజవాడ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ పాల్గొని పార్టీ బీసీ క్యాడర్‌కు, అనుబంధ సంఘాల నాయకులకు తగు సూచనలు చేశారు. 24వ తేదీన సాయంత్రం 5గంటలకు టంగుటూరు వాణీ నగర్ వద్ద నున్న శ్రీనివాస థియేటర్ వద్ద తొలి బీసీ సదస్సు ప్రారంభంకానుంది. ఆ తర్వాత టంగుటూరులోనే నార్త్ బీసీ కాలనీలో ముస్లిం మైనార్టీ కాలనీలోనూ బీసీ సదస్సు జరుగుతుందని పార్టీ వెల్లడించింది.

ఓబన్నపాలెం మాజీ సొసైటీ అధ్యక్షుడు మృతి


వెంకటేశ్వర్లు (ఫైల్)

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి23: నాగులుప్పలపాడుకు చెందిన ఓబన్నపాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు అలియాస్ శాంత (67) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వర్లు మృతి చెందని సమాచారం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయకుమార్, మాజీ జడ్పీచైర్మన్ ఈదర హరిబాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి వెంకటేశ్వర్లు మృతదేహానిన పోస్టుమార్టం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి

ఒంగోలు(రూరల్), జనవరి 23: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా విద్యను బోధించాలని ప్రిన్సిపాల్ డి.కళ్యాణి పేర్కొన్నారు. ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో మంగళవారం అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి అధ్యాపకుడు బాధ్యతతో ఉన్నప్పుడే విద్యార్థులు భవిష్యత్తు ఉన్నతస్థితికి చేరుతుందన్నారు. ఇందుకోసం తమ కళాశాలలో స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 109 మంది ప్రభుత్వ అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమంగా అమ్ముతున్న మద్యం స్వాధీనం



పట్టుబడ్డ మద్యం బాటిళ్లతో ఎస్సై

టంగుటూరు, జనవరి 23 : జరుగుమల్లికి చెందిన మిడసల సుధాకర్ అక్రమంగా మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి స్వగ్రామంతో పాటు టంగుటూరులో కూడా జోరుగా అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అప్రమత్తమైన ఎస్సై ఖాదర్‌బాషా తన సిబ్బందితో తనిఖీ చేయగా టంగుటూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సుధాకర్‌ను గుర్తించి పట్టుకున్నారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకొని 20 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మెకు దిగిన

వైకేపీ ఉద్యోగులు

• ప్రగతిభవన్ ఎదుట ధర్నా



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

ఒంగోలు నగరం, జనవరి 23: డిమాండ్ల సాధన కోసం వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులు మంగళవారం నుంచి సమ్మెకు దిగారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై వత్తిడి పెంచేందుకు ఆందోళనకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సెర్ప్ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఉన్న వైకేపీ ఉద్యోగులు 250 మంది సమ్మెలో పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రగతిభవనం ఎదుట వైకేపీ ఉద్యోగులు మంగళవారం విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వారికి ప్రమోషన్లు కల్పించాలని, పేస్కేలు అమలు చేయాలని, ఈపీఎఫ్‌పై సీలింగ్ తీసేసి మూలవేతనంపై నూరుశాతం ఈపీఎఫ్ ఇవ్వాలనే డిమాండ్‌తో సమ్మెలోకి వెళ్లారు. ధర్నాలో సెర్ప్ ఉద్యోగుల జేఏసీ నాయకులు నరేంద్ర తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ నవరత్నాల పథకాలను అమలు చేస్తోంది సెర్ప్ ఉద్యోగులేనన్నారు. హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు వర్తింపజేస్తూ అర్హులైన ఉద్యోగులందరికీ ప్రమోషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు జరపాలని కోరారు. ధర్నాలో జేఏసీ నాయకులు ఎర్రా, క్రిష్ణ, గోపీనాథ్, నారాయణ, కత్తి కళ్యాణ్, డేవిడ్, కృపారావు, సుధాకర్. నరసింహారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

26న ఉప్పుగుండూరులో

టీడీపీ బీసీసెల్ సమావేశం



నాయకులతో మాట్లాడుతున్న స్వాములు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి23: నాగులుప్పలపాడు మండల స్థాయి టీడీపీ బీసీసెల్ సమావేశం ఈనెల 26వ తేదీన ఉప్పుగుండూరులో జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర సెక్రటరీ అడపా స్వాములు పేర్కొన్నారు. మంగళవారం ఉప్పుగుండూరు గ్రామంలో టీడీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ బీసీ సమావేశానికి మండలంలోని బీసీ, పార్టీ కార్యకర్తలు, నాయకులు తప్పక హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, నాయకులు కనగాల శ్రీనివాసరావు, తెలగతోటి జాన్సన్, కాట్రగడ్డ చంద్రబాబు, కె. సెల్వం, మద్దిసాని సుబ్బారావు, మసిముక్క భాస్కరరావు, నిండాల శ్రీనివాసరావు, బెల్లం హరిబాబు, పులి పోలురాజు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన కారు

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి

మరో ముగ్గురికి గాయాలు



క్షతగాత్రులను బయటకు తీస్తున్న పోలీసులు

సింగరాయకొండ, జనవరి 23 : జాతీయ రహదారిపై ముందు వెళుతున్న టిప్పర్‌ను వెనుకవైపు వస్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులో బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇరువురు మహిళలకు, డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో సింగరాయకొండలోని కందుకూరు ఫ్లైఓవర్ మీద జరిగింది. చీమకుర్తి నుంచి రామాయపట్నం పోర్టుకు గ్రానైట్‌లోడుతో టిప్పర్ వెళుతుండగా, తిరుపతికి చెందిన వారు నల్గొండ ఆసుపత్రిలో వారి బంధువులను పరామర్శించి తిరుగు ప్రయాణంలో వస్తున్నారు. కందుకూరు ఫ్లైఓవర్ వద్ద ముందు వెళుతున్న టిప్పర్‌ను కారు డ్రైవర్ ఢీకొట్టాడు. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న శేషావతి, వెంకటమ్మ, డ్రైవర్ మాధవలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు బీ శశిధర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్‌లింగం, కానిస్టేబుల్ షరీఫ్ క్షతగాత్రులను 108, హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శేషావతి మృతి చెందింది. ఎస్సై శ్రీరామ్ కేసు దర్యాప్తు చేస్తున్నన్నారు.

'నా ఎస్సీలంటూ నట్టేట ముంచిన జగన్'

వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిర్వీర్యం • ఎమ్మెల్యే స్వామి విమర్శ



అంబేడ్కర్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, జనవరి 23 : దళితులకు మేనమామ అని పదేపదే కపట ప్రేమను ఒలకబోస్తూ వారిని నట్టేట ముంచిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి విమర్శించారు. మండలంలోని పాకల అంబేడ్కర్ నగర్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పూర్తిగా దుర్వినియోగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పోరేషన్‌ను మూడు ముక్కలు చేసి వాటి ద్వారా ఒక్క రూపాయి కూడా దళితులకు కేటాయించలేదని చెప్పారు. బెస్ట్ అవైలబుల్స్ పాఠశాలలను రద్దు చేసి దళితులకు విద్యను దూరం చేశారన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యా పథకాన్ని నాలుగేళ్లు నిలిపివేసి ఇప్పుడు ఆ పథకానికి అంబేడ్కర్ పేరు తొలగించి అమలు చేయడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని నిలదీశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, పాకల సర్పంచు సైకం చంద్రశేఖర్, సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, చంటి, రేణుమాల పోతురాజు, అంబటి కోటేశ్వరరావు, ప్రసాదు, నర్రా రాంబాబు పాల్గొన్నారు.

సమ్మె విరమించిన అంగన్‌వాడీలు

విధుల్లో చేరిక.. • తెరుచుకున్న కేంద్రాలు • పలు చోట్ల విజయోత్సవ ర్యాలీలు



ఒంగోలులో విజయోత్సవర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఒంగోలు నగరం, జనవరి 23: గత 42 రోజులుగా సమ్మె చేపట్టిన అంగన్‌వాడీలు సోమవరం అర్థ రాత్రి సమ్మె విరమించారు. తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపట్టిన అంగన్‌వాడీలు ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొని తమ పోరాటాన్ని కొనసాగించారు. వేతనాలు పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర డిమాండ్లతో ఆందోళనకు దిగిన అంగన్‌వాడీలు విజయం సాధించే వరకు పోరాటం కొనసాగించారు. ప్రధాన డిమాండ్లు అయిన వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలపై ప్రభుత్వం స్పష్టమైన హామీని ఇవ్వకుండా బెదిరింపులకు దిగింది. ఎస్మాను ప్రయోగించటం, అక్రమ అరెస్టులు చేసింది. ఎట్టకేలకు ప్రభుత్వం దిగి వచ్చి మంత్రుల బృందం అంగన్‌వాడీ యూనియన్‌లకు నిర్దిష్టమైన హామీ ఇవ్వటంతో సోమవారం రాత్రి నుంచి సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. వేతనాలను జూలై మాసం నుంచి పెంచేందుకు లిఖితపూర్వక హామీని ప్రభుత్వం ఇచ్చింది. ఇదేవిధంగా గతం కంటే గ్రాట్యుటీని పెంపు చేయటం వంటి హామీలను నెరవేర్చటంతో అంగన్‌వాడీలు సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి అంగన్‌వాడీలు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు అండ్ హెల్పర్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, సుబ్బమ్మ, ప్రశాంతి, హేమీమా పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: న్యాయమైన డిమాండ్ల సాధనకు సుదీర్ఘకాలం పోరాడి, ప్రభుత్వ హామీతో ఆందోళనను విరమించిన అంగన్‌వాడీ కార్యకర్తలను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అభినందించారు. టంగుటూరులోని ఐసీడీఎస్ కార్యాలయం వేదికగా రెండు నెలలుగా టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల కార్యకర్తలు సమ్మె చేశారు. ప్రభుత్వ హామీతో సమ్మె విరమించిన వీరంతా మంగళవారం విజయోత్సవ ర్యాలీ, సభ నిర్వహించారు. ఎమ్మెల్యే, సత్య ఇరువురా



టంగుటూరులో మాట్లాడుతున్న నాయకులు

టంగుటూరు మండల టీడీపీ నాయకులతో కలసి ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు చేరుకొని అంగన్‌వాడీలను అభినందించారు.

కొండపిలో..

కొండపి: అంగన్‌వాడీల డిమాండ్‌లు సాధించడంలో సహచర ఉద్యోగ, కార్మిక సంఘాల మద్దతు పూర్తిగా ఇచ్చారని సీఐటీయూ జిల్లా నాయకుడు జి.వెంకటేశ్వర్లు చెప్పారు. కొండపిలోని అంగన్‌వాడీల శిబిరం వద్ద ఆయన కార్యకర్తలు, ఆయాలను ఉద్దేశించి మంగళవారం మాట్లాడారు. అంగన్‌వాడీల ఉద్యమానికి మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఐసీడీఎస్ కార్యాలయానికి తమ జాయినింగ్ లెటర్లు సీడీపీవో మాధవీలత, ఆయా సెక్టార్ల సూపర్‌వైజర్లకు అందజేశారు.

అద్దంకిలో 'రియల్' ఢమాల్!

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్న సర్వేలతో రాజధాని వైపు వ్యాపారుల పరుగులు

వైసీపీ సానుభూతిపరులైన వ్యాపారులు సైతం కొనుగోళ్లు

అద్దంకి, జనవరి 23: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందన్న సర్వేలతో అద్దంకి ప్రాంత రియల్ ఎస్టేట్ వ్యాపారు లు రాజధాని వైపు పరుగులు తీస్తున్నారు. దీంతో అద్దంకిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడకేసింది. అద్దంకి ప్రాంత రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెండు తెలుగు రాష్ట్రాలలో అన్ని ప్రాంతాలలో స్థలాల వ్యాపారం చేస్తుంటారు. స్థలాల ధరలు ఎక్కడ పెరిగే అవకాశం ఉంటే అద్దంకి ప్రాంత రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్కడ వాలిపోతుంటారు. ఈక్రమంలో వచ్చే సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాబోతుందన్న అంచనాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు విజయవాడ-గుంటూరు మధ్య, రాజధాని ప్రాంత గ్రామాలలో తిరిగి స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు లాభాల బాటలోకి వెళ్ళటంతో మరికొంత మంది కూడా వెళ్ళివస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే గుంటూరు, విజయవాడ, రాజధాని ప్రాంతాలు పూర్వవైభవం వైపు అడు గులు పడతాయన్న అంచనాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొండంత ఆశతో ఉన్నారు. వైసీపీ సానుభూతిపరులుగా ఉన్న పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం రాజధాని ప్రాంతంలో కొనుగోళ్ళు చేసేందుకు పరుగులు తీయటం అద్దంకి ప్రాంతంలో చర్చనీయాంశం గా మారింది. రాజధాని ప్రాంతంలో స్థలాల ధరలు సంక్రాంతి నాటికి మరింత ధరలు పెరిగే అవకాశం ఉందన్న అంచనాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇప్పటికే కొనుగోలు చేసి అమ్మకాలకు సిద్ధం అయ్యారు. ఎన్నికలు సమీపించే కొద్ది రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న అంచనాలతో అద్దంకి ప్రాంత రియల్ ఎస్టేట్ వ్యాపారులు సొమ్ము చేసుకునేందుకు పరుగులు తీస్తున్నారు. దీంతో అద్దంకిలో గత ఏడాదిగా అంతంత మాత్రంగా స్థలాల ధరలు ఉండగా రియల్ వ్యాపారులు మొత్తం రాజధాని వైపు పరుగులు తీస్తుండటంతో అద్దంకిలో రియల్ వ్యాపారం పూర్తిగా నిలిచిపోయింది.

మాధవరావుకు జాతీయ స్ఫూర్తిసేవా పురస్కారం



పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 23: శ్రీఅభయ కళారాధన సాంస్కృతిక సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావును లిటిల్ ఛాంప్స్ అకాడమీ, టీఎస్‌ఆర్ ఫౌండేషన్‌లు సినీనటుడు కృష్ణంరాజు పేరిట ఏర్పాటు చేసిన జాతీయ స్ఫూర్తి సేవా పురస్కారంతో ఘనంగా సత్కరించాయి. ఒంగోలులోని శర్మా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నిర్వాహకులు కె.బుచ్చేశ్వరరావు, డాక్టర్ కొలకలూరి రవిబాబుల ఆధ్వర్యంలో మెప్మా పీడీ తేళ్ల రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాధవ రావుకు పురస్కారాన్ని అందజేశారు. అదేవిధంగా డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అంతర్జాతీయ జీవన సాఫల్య పురస్కారాన్ని సైతం మాధవరావుకు ఇస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో షేక్ మహబూబ్‌బాషా, మారెళ్ల సుబ్బారావు, మండవ లావణ్య, డాక్టర్ శ్రీనివాసరావు, కోసూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైలు కిందపడి వ్యక్తి మృతి

ఉప్పుటూరు(పర్చూరు), జనవరి 23: ప్రమాదవశాత్తు రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చీరాల రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామానికి చెందిన బోయిన శివరామకృష్ణ (40) మరో వ్యక్తితో కలసి నెల్లూరు వెళ్ళేం దుకు చీరాల రైల్వేస్టేషన్ చేరుకున్నారు. ఈక్రమంలో మూత్ర విసర్జనకు వెళ్ళి ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రూ.10 లక్షల నగదు స్వాధీనం

చీరాల, టౌన్ 23: అక్రమంగా తరలిస్తున్న రూ.10 లక్షల నగదు ను చీరాల జీఆర్పీ పోలీసులు స్వా ధీనం చేసుకున్నారు. ఉన్నతాధికా రుల ఆదేశాల మేరకు రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీలో శబరి ఎక్స్‌ప్రెస్‌లో ఓ వ్యక్తి బ్యాగ్‌తో రైలు నుం చి దిగగా అనుమానంతో తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేక పోవటంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని నగదును స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్‌పీ పోలీసులు తెలి పారు నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు, పత్రాలు లేకపోవటంతో ఆదాయశాఖ అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

కాకానికి ఎమ్మెల్యే రవికుమార్ నివాళి

అద్దంకి, జనవరి 23: వ్యాపారవేత్త, టీడీపీ నాయకుడు కాకాని హనుమంతరావు (74) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంకు చెందిన ఆయన సుమారు 50 సంవత్సరాలుగా వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉ న్నారు. కుమారుడు అశోక్ టీడీపీ నేతగా, క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. సోమ వారం రాత్రి కూడా కాకానిపాలెం లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న హను మంతరావు మంగళవారం ఉదయం గుండెనొప్పి రావటంతో హుటాహుటీన ఒంగోలు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హనుమంతరావు మృతదేహం వద్ద ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. పంగులూరు మండలం కొండమంజులూరుకు చెందిన చొప్పరపు మోజేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో ఉంచగా ఎమ్మెల్యే రవికుమార్ మంగళవారం సాయంత్రం నివాళు లర్పించారు. పట్టణంలోని శ్రీనగర్‌లో ప్రముఖ మహిళాన్యాయవాది ఫణీంద్రాదేవి ఇటీవల మృతి చెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు.

డిపో అధికారులు మొండివైఖరి విడనాడాలి

అద్దంకిటౌన్, జనవరి 23: ఆర్టీసీ డిపో డీఎం, అసిస్టెంట్ డీఎంలు మొండి వైఖరి మానుకోవాలని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ పి.చిరంజీవి అన్నారు. కార్మికుల పట్ల డిపో అధికారులు నిర్లక్ష్యవైఖరికి నిరసనగా ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు మంగళవారానికి 3వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో సర్వీసులను ఇష్టం వచ్చినట్లు రద్దు చేస్తున్నారన్నారు. కనీసం కార్మికులకు మంచినీటి వసతిని కల్పించలేకపోయరన్నారు. ఆరోగ్యం బాగాలేని కార్మికులకు సెలవులు ఇవ్వకపోగా వారికి ఆబ్‌సెంట్‌లు వేసి అక్రమంగా చార్జీషీట్లు ఇస్తు న్నారన్నారు. ఈ దీక్షలలో కేజీ రావు, ఎస్‌కే ఎండీ రఫీ, ఎం. వెంకటేశ్వర్లు, కె.కొండలు, గ్యారేజీ కార్మికులు సంఘీభావం తెలిపారు.

ఆగిఉన్న కారును ఢీకొన్న బైక్

మేదరమెట్ల, జనవరి 23: మేదరమెట్ల బైపాస్‌లో ఆగి ఉన్న కారును మోటార్‌సైకిల్ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. మంగళవారం మేదరమెట్ల నుంచి గుంటూరువైపు వెళ్లే మార్గంలో పైలాన్ వద్ద ఆగి ఉన్న కారును అదేమార్గంలో వెళుతున్న బైక్ వేగంగా వచ్చి అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా పామూరు మండలం బోడవాడకు చెందిన రావి వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలయ్యా యి. క్షతగాత్రున్ని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాయస్థరాజుల శాసనం లభ్యం



ఎర్రగొండపాలెం, జనవరి 23 : మండలంలోని అయ్యంబొట్లపల్లి గ్రామంలో కాయస్థరాజుల శాసనం లభ్యమైంది. కాయస్థరాజైన గంగయ సాహిని కాలంలో ఈ శాసనం చెక్కారు. అమరలింగేశ్వరస్వామి ఆలయం వద్ద చారిత్రక పరిశోధకులు తురిమెళ్ల శ్రీనివాసప్రసాద్ శాసనాన్ని గుర్తించారు. ఆర్కియాలజీ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపించారు. దీనిలో శాలివాహనశకం 1184వ సంవత్సరం అని నమోదైంది. అంటే సామాన్యశకం 1262 సంవత్సరంలో చంద్రగ్రహణం సందర్భంలో సత్రయ్య అనువారు, గంగయ సాహిని పుణ్యంగా శ్రీశైలం మల్లినాథునికి గూడూరు గ్రామానికి సుంకం రద్దు చేసి బహుమతిగా ఇచ్చినట్లు ఉంది.. ఈ శాసనాన్ని లిఖించి ఇక్కడ నివశించి హల్లిసెట్టి అను వారికి అప్పగించినట్లు తెలుస్తోంది. కాయస్థరాజైన గంగయ్య సాహిని, కాకతీయ రాజైన ఘణపతి దేవుని (1199 - 1262) ఈ కాలంలో మంత్రిగా పనిచేశారు. వీరి పేరు మీద చివరి శాసనం చరిత్రకారులకు సామాన్యశకం 1257 వరకే లభ్యం అవుతుంది. ఈ శాసనం 1262 సంవత్సరంలో లభించడంతో గంగయ సాహిని సామాన్యశకం 1262 వరకు నివసించిన తర్వాత మరణించి ఉంటాడని చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ శాసనం గుర్తించడంలో ఏ సాయి సందీప్, వెంకట్‌నాయుడు, వీఆర్వో రాంబాబు, భార్గవశర్మ పాల్గొన్నారు.

తెలుగుదేశంతోనే ఎస్టీల అభ్యున్నతి

• ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
• 40 కుటుంబాలు పార్టీలో చేరిక



ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన పర్చూరు ఎస్టీకాలనీవాసులు

పర్చూరు, జనవరి 23: తెలుగుదేశం పార్టీతోనే ఎస్టీల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఎస్టీల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో పర్చూరు ఇందిరాకాలనీకి చెందిన 40 ఎస్టీ కుంటుంబాలు ఏలూరి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలుకప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఎస్టీలు పార్టీకి వెన్నుముఖగా ఉన్నారన్నారు. ఎస్టీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. ఎస్టీల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌కు సంబంధించిన మేనిఫెస్టోను రూపొందిస్తుందన్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో అర్హులైన ఎస్టీలందరికీ పక్కా ఇళ్ళు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడతానన్నారు. ఎస్టీల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రానున్న తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తుందని భరోసా వ్యక్తం చేశారు.

వలంటీర్లు చేరిక..

ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో పర్చూ రుకు చెందిన ముగ్గురు వలంటీర్లు దామచర్ల నాగరాజు, మూకిరి కోటేశ్వరరావు, కంభంరాజు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మరో 35 కుంటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. దామచర్ల లింగేశ్వరరావు, రావూరి నాగరాజు, రావూరి రామాంజనేయులు, ఏకశిరి కలగయ్య, రావూరి ఏడుకొండలు, పాలపర్తి కోటేశ్వరరావులతోపాటు పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, మామిడిపాక హరిప్రసాద్, టి. మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన పొగాకును పండించాలి

• బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



వేలం కేంద్రం వద్ద రైతులతో చైర్మన్ యశ్వంత్‌కుమార్

పొదిలి, జనవరి 23 : పొగాకు రైతులు నాణ్యమైన పంటను పండించాలని పొగాకుబోర్డ్ చైర్మన్ యశ్వంత్‌కుమార్ అన్నారు. మంగళవారం పదవి చేపట్టిన తరువాత మొదటిసారి ఆయన పొదిలి వచ్చారు. బోర్డు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. పొగాకు దిగుబడులు, ఖర్చుల విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటించి మేలైన మొక్కలు ఎంచుకోవాలన్నారు. మొక్క నాటిన నాటి నుంచి పొగాకు బోర్డుకు వచ్చే వరకు పసిపిల్లల మాదిరి పైరుకు సాకాలన్నారు. నాట్లదశలో మంచి మొక్కలను ఎంచుకోవడం ద్వారా మంచి నాణ్యమైన పైరుతో పాటు ధర కూడా దక్కుతుందన్నారు. బోర్డు రైతుల విషయంలో పక్కాప్రణాళితో ఉంటుందన్నారు. ఎలాంటి అపోహలకు తావులేకుండా నిత్యం రైతులకోసం పనిచేస్తుందన్నారు. ఈ ఏడాది బ్యారన్‌కు 35 క్వింటాళ్ల పొగాకుకు అనుమతి ఇచ్చారని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అయితే అదనంగా వచ్చిన పొగాకును గతంలో 10 శాతం వరకు అపరాదం లేకుండా కొనుగోలు చేసేవారని రైతులు పేర్కొన్నారు. దాన్ని 25 శాతానికి పెంచాలని కోరారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ బోర్డు పరిధిలో అందరూ మాట్లాడుకొని నిర్ణయం తీసుకుందామన్నారు. ప్రస్తుతం కర్ణాటకలో మంచిధరలు ఉన్నాయని, అదే ధర మనం అందిపుచ్చుకోవాలంటే పొగాకు నాణ్యత ఉండాలన్నారు. వ్యాపారులకు నమ్మకం కలిగే విధంగా బోర్డుకు సహకరించాలన్నారు. ఈ ఏడాది మనకు మంచి ధరలు పలికే అవకాశం ఉందన్నారు. అనంతరం తుఫాను కారణంగా పాక్షికంగా దెబ్బతిన్న పైర్ల కోసం రైతులకు బోర్డు ఆధ్వర్యంలో రూ. 10వేలు వడ్డీలేని రుణాన్ని ఆయన అందజేశారు. అనంతరం రైతులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి గిరిరాజకుమార్, గుంటూరు రైతుసంక్షేమ నిధి మేనేజర్ మారన్న, గ్రేడింగ్ అధికారి కిరణ్, సూపర్‌వైజర్ రవిబాబు, రైతుసంఘ నాయకులు బీరం కృష్ణారెడ్డి, ఆవులూరి కోటేశ్వరరావు, నారాయణ, నారాయణరెడ్డి బోర్డు పరిధిలోని రైతులు పాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ పత్రాలు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

టీడీపీతోనే పేదల సంక్షేమం

● పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ● గ్రామాల్లో కనసాగిన జయహో బీసీ సభలు

ఎర్రగొండపాలెం, జనవరి 23 : టీడీపీతోనే పేదల సంక్షేమం అమలవుతుందని, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని వై.కొత్తపల్లి గ్రామంలో మంగళవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా, తాగునీటి సమస్య, రోడ్ల సమస్య ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీకి ఓటు వేసి పార్టీ గెలుపునకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, కంచర్ల సత్యనారాయణగౌడ్, వేగినాటి శ్రీను, కొత్త బాస్కర్, స్థానిక టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలను ఆదుకొనే బాధ్యత టీడీపీదే..

కంభం, జనవరి 23 : రాష్ట్రంలోని బీసీలను అన్ని విధాలుగా ఆదుకునే బాధ్యత టీడీపీదేనని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. కంభం పట్టణంలోని బేస్త కళ్యాణ మండపంలో మంగళవారం 'జయహో బీసీ' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన అశోక్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు అన్ని వేళలా అండగా నిలిచిన పార్టీ టీడీపీనే అన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు నాయుడు బీసీల సంక్షేమానికి కృషి చేశారన్నారు. బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి వారిపై దాడులు చేయించడమే పనిగా పెట్టుకున్నా రన్నారు. అన్నారు. బీసీలపై మరోసారి కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తోట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఆరేపల్లి మల్లికార్జున, పట్టణ అధ్యక్షులు ఓబులరెడ్డి, మాధవ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, పార్లమెంటు నిర్వాహక కార్యదర్శి కేతం శ్రీనివాసులు, బీసీ సెల్ మండల అధ్యక్షులు బందలపాటి వెంకటరమణ, పార్లమెంటు బీసీ సాధికారిక అధ్యక్షులు, మండల బెస్తసంఘం అధ్యక్షులు బందలపాటి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మద్దుకూరి కోటయ్య, రామక్రిష్ణయాదవ్, ఇళ్ల సోమయ్య, చిక్కుడు రోశయ్య, గౌస్, పాండు, గోన చెన్నకేశవులు, తోట శ్రీను, శిరివెళ్ళ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : రాష్ట్రంలో బీసీలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు వద్ద మంగళవారం జయహో బీసీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఈ సందర్భంగా నాయకులు ఏర్పాటు చేసిన నారా లోకేష్ జన్మదిన వేడుకలలో పాల్గొని కేక్ కట్ చేసి పంచుకున్నారు. ఈ సందర్భంగా నూకసాని బాలాజీ బీసీలను వైసీపీ మోసం చేసిందన్నారు. కేవలం కార్పోరేషన్లను సృష్టించి ఎటువంటి నిధులు కేటాయించకుండా వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చిందన్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ టీడీపీ సమయంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పెద్దారవీడు మండల టీడీపీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాస్ రెడ్డి, దేవరాజుగట్టు సర్పంచ్ మెట్టు లక్ష్మీదేవి, పెద్దారవీడు టీడీపీ నాయకులు గొట్టం శ్రీనివాస్ రెడ్డి, యాదవ సంఘం నాయకులు గుమ్మ గంగరాజు, రజక సంఘం నాయకులు కనిగిరి రమణ, నియోజకవర్గంలోని బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న టీడీపీ నేత నూకసాని బాలాజీ

కంభం, : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సాయంత్రం కంభం పట్టణంలోని బేస్త కళ్యాణ మండపంలో 'జయహో బీసీ' కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొనగా నారా లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అభిమానులు జయహో నారా లోకేష్ అంటూ కేకలు వేశారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



టీడీపీలో చేరిన నాయకులు

కంభం, జనవరి 23 : కంభం పట్టణంలోని బేస్త కల్యాణ మండపంలో టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో కంభం పట్టణానికి చెందిన వై.ఎస్.జగన్ అభిమాన సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు సయ్యద్ అన్వర్‌భాషా ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన షేక్ షెక్షావలి, మీనిగ కాశయ్య, నాయబ్‌రసూల్, షేక్ బాబు, వెలుగు బాలకృష్ణ, షేక్ మస్తాన్‌వలి, షేక్ రసూల్, సయ్యద్ సుభాని, రామపంతుల్, ఇండ్ల శ్రీను, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓబన్నపాలెం మాజీ సొసైటీ అధ్యక్షుడు మృతి

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి23: నాగులుప్పలపాడుకు చెందిన ఓబన్నపాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు అలియాస్ శాంత (67) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వర్లు మృతి చెందని సమాచారం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయకుమార్, మాజీ జడ్పీచైర్మన్ ఈదర హరిబాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి వెంకటేశ్వర్లు మృతదేహానిన పోస్టుమార్టం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



వెంకటేశ్వర్లు (ఫైల్)

31 లోపు భవనాలు ప్రారంభించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23 : పూర్తయిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను ఈనెల 31వ తేదీలోపు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తయ్యి సంబంధిత శాఖలకు అప్పగించిన వాటిని స్థానిక ఎమ్మెల్యే ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించాల న్నారు. కొత్త ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీని త్వరగా పూర్తి చేయాలన్నారు. జగనన్న ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్ళ కు సంబంధించి లబ్ధిదారులకు పట్టాలు మంజూ రు చేసినా వారు నిర్మాణాలు ప్రారంభించకపోతే భవిష్యత్‌లో ఫ్రీ హోల్డ్ అవకాశాన్ని నష్టపోతారనే విషయాన్ని అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఉపాధి పనుల్లో ఎస్సీఎస్టీ కుటుంబా లకు వంద రోజుల పనిదినాలను తప్పని సరిగా కల్పించాలని, ఆడిట్‌లో గుర్తించిన నగదును వెం టనే రికవరి చేసేలా ఎంపీడీవోలు చర్యలు తీసు కోవాలన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రారంభి ంచిన అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు జా లిరెడ్డి, మర్దన్‌ఆలీ, పేరయ్య, వసుంధర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి అక్రమార్కులపై వేటు?

● ఐదుగురు సిబ్బంది సస్పెండ్

● కుందంపల్లిలో మొక్కలు నాటకుండానే అక్రమాలు

పుల్లలచెరువు, జనవరి 23 : ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన ఐదుగురు సిబ్బందిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఏపీవో, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్, సీనియరు మేట్‌లను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. మార్కాపురం ఏపీడీ నిర్మలాదేవి కుందంపల్లిలో జరిగిన మొక్కల అక్రమాలపై విచారించారు. అనంతరం పీడీకి నివేదక ఇవ్వడంతో వారిని సస్పెండ్ చేసినట్లు సమాచారం. కుందంపల్లిలో మొక్కల అక్రమాలపై సర్పంచి శ్రీనివాసరావు జిల్లా స్పందనకు ఫిర్యాదు చేయడంతోనే ఈ విచారణ జరిగింది. కుందంపల్లిలో మొత్తం 52 మంది రైతులు మొక్కలు నాటినట్లు రికార్డులు చూపించగా, అందులో 20 ఐడీలకు పైగా మొక్కలు నాటకుండానే బిల్లులు చేసి అక్రమాలకు పాల్పడి లక్షల రూపాయలు కాజేశారని ఏపీడీ నివేదిక ఇచ్చినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

కనిపించని మరుగుదొడ్లు

● ఇబ్బందులు పడుతున్న అర్జీదారులు

● పట్టించుకోని అధికారులు

కంభం, జనవరి 23 : ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలకు మరుగుదొడ్ల సమస్య వేదిస్తోంది. ఒకేచోట అన్ని శాఖల భవనాలు ఉన్నాయని సంతోషించాలో, కనీసం ఆయా శాఖల ఆవరణలో మరుగుదొడ్ల సౌకర్యం లేనందుకు విచారించాలో ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. ఉపాధి హామీ, స్వచ్ఛభారత్ పథకాల పేరుతో గతంలో ఊరూరా మరుగుదొడ్లను నిర్మించారు. అయితే ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రం వాటి ఊసే లేదు. గిద్దలూరు నియోజకకవర్గంలోని కంభం, బేస్తవారపేట, అర్థవీడు, రాచర్ల, కొమరోలు మండలాల్లో ప్రభుత్వ భవనాలన్నీ ఒకేచోట నిర్మించారు. సోమవారం నుంచి శనివారం వరకు వివిధ పనులపై ఆయా కార్యాలయాలకు ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు వస్తుంటారు. కానీ ఏ కార్యాలయంలో మరుగుదొడ్లు నిర్మించకపోవడంతో అత్యవసర పరిస్థితిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలమూత్ర విసర్జన కోసం కిలోమీటర్ల కొద్ది ఆరుబయటకు పరుగులు తీస్తున్నారు. అవకాశం లేనిపక్షంలో ఇంటికి వెళ్లేంత వరకు ఉగ్గపట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక మహిళల పరిస్థితి దారుణంగా ఉంది. కార్యాలయాల సముదాయంలో 13 ప్రభుత్వ భవనాలు ఒకే చోట ఉన్నాయి. ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు కిలోమీటరు పరిధిలో రైల్వేస్టేషన్ సమీపంలోని చిల్లచెట్ల చాటుకు వెళ్లాల్సి వస్తోంది. ఇక మహిళలైతే ఎటు పోవాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రానికి సోమవారం రోజు వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఎంపీడీవో, తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు మరుగుదొడ్లు ఉండగా అవి కేవలం అధికారులకు మాత్రమేనని తాళాలు వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాల పరిధిలో మరుగుదొడ్లను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



కంభం తహసీల్దార్ కార్యాలయం

ఐక్య పోరాటాలతోనే కార్మికుల విజయం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 23: అంగన్‌వాడీల ఐక్య పోరాటాల ద్వారానే ప్రభుత్వం దిగి వచ్చిందని, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు రూబెన్, అందె నాసరయ్య అన్నారు. అంగన్‌వాడీల సమ్మెను ముందుండి నడిపిన సీఐటీయూ, ఏఐటీయూసీ, సంఘీభావం తెలిపిన ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల సంఘాల నాయకులకు స్థానిక సీపీఐ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల పోరాటం ఫలితంగా ప్రభుత్వం అనివార్యంగా దిగి వచ్చిందన్నారు. 42 రోజుల వీరోచిత సుదీర్ఘ పోరాటం చేశామన్నారు. ప్రభుత్వం ఎన్నో విధాలుగా బెదిరింపులకు పాల్పడిందన్నారు. అవన్నీ కార్మికుల పోరాటాల ముందు బలాదూర్ అయ్యాయన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు బాలనాగయ్య, కొండయ్య, కాశీం, అంగన్‌వాడీ నాయకురాళ్లు వెంకటరత్నం, రమాదేవి, లక్ష్మీదేవి, రేణుక, ప్రభావతి, అన్నమ్మ, రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు రూబేను

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

సమ్మె అనంతరం మంగళవారం అంగన్‌వాడీలు విధులలో చేరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో నుంచి ఉత్తర్వులు అందుకున్నారు.

పొదిలి : పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని మరోసారి రుజువైందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించినా, అనేకరకాల భ్రమలు కల్పించినా ఎక్కడ తలొగ్గకుండా అంగన్‌వాడీలు పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పొగాకు రైతులు నాణ్యమైన పైరును పండించాలి

బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

పొదిలి, జనవరి 23 : పొగాకు రైతులు నాణ్యమైన పంటను పండించాలని పొగాకుబోర్డ్ చైర్మన్ యశ్వంత్ కుమార్ అన్నారు. మంగళవారం పదవి చేపట్టిన తరువాత మొదటిసారి ఆయన పొదిలి వచ్చారు. బోర్డు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. పొగాకు దిగుబడులు, ఖర్చుల విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటించి మేలైన మొక్కలు ఎంచుకోవాల న్నారు. మొక్క నాటిన నాటి నుంచి పొగాకు బోర్డుకు వచ్చే వరకు పసిపిల్లల మాదిరి పైరుకు సాకాలన్నారు. నాట్లదశలో మంచి మొక్కలను ఎంచుకోవడం ద్వారా మంచి నాణ్యమైన పైరుతో పాటు ధర కూడా దక్కుతుందన్నారు.బోర్డు రైతుల విషయంలో పక్కాప్రణాళికతో ఉంటుందన్నారు. ఎలాంటి అపోహలకు తావులేకుండా నిత్యం రైతులకోసం పనిచేస్తుందన్నారు. ఈ ఏడాది బ్యారన్‌కు 35 క్వింటాళ్ల పొగాకుకు అనుమతి ఇచ్చారని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అయితే అదనంగా వచ్చిన పొగాకును గతంలో 10 శాతం వరకు అపరాదం లేకుండా కొనుగోలు చేసేవారని రైతులు పేర్కొన్నారు. దాన్ని 25 శాతానికి పెంచాలని కోరారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ బోర్డు పరిధిలో అందరూ మాట్లాడుకొని నిర్ణయం తీసుకుందామన్నారు. ప్రస్తు తం కర్నాటకలో మంచిధరలు ఉన్నాయని, అదే ధర మనం అందిపుచ్చుకోవాలంటే పొగాకు నాణ్యత ఉండాలన్నారు. వ్యాపారులకు నమ్మకం కలిగే విధంగా బోర్డుకు సహకరించాలన్నారు. ఈ ఏడాది మనకు మంచి ధరలు పలికే అవకాశం ఉందన్నారు. అనంతరం తుఫాను కారణంగా పాక్షికంగా దెబ్బతిన్న పైర్ల కోసం రైతులకు బోర్డు ఆధ్వర్యంలో రూ. 10వేలు వడ్డీలేని రుణాన్ని ఆయన అందజేశారు. అనంతరం రైతులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి గిరిరాజకుమార్, గుంటూరు రైతుసంక్షేమ నిధి మేనేజర్ మారన్న, గ్రేడింగ్ అధికారి కిరణ్, సూపర్‌వైజర్ రవిబాబు, రైతుసంఘ నాయకులు బీరం కృష్ణారెడ్డి, ఆవులూరి కోటేశ్వరరావు, నారాయణ, నారాయణరెడ్డి బోర్డు పరిధిలోని రైతులు పాల్గొన్నారు.



వేలం కేంద్రం వద్ద రైతులతో చైర్మన్

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

గిద్దలూరు టౌన్, జనవరి 23 : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని స్థానిక స్ప్రింగ్ బోర్డు పాఠశాలలో బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ.నారాయణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భవనాశి వెంకట రామాంజనేయు లు, బీజేపీ పట్టణ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, జిల్లా మేధోకమిటీ సభ్యుడు రెడ్డిమల్లారెడ్డి పాల్గొని సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భం గా డాక్టర్ జేవీ. నారాయణ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య పోరాటం కోసం 'ఆజాది హింద్ ఫౌజ్ సంస్థ'ను స్థాపించి పోరాటం చేసిన యోధుడు అని కొనియాడారు. చంద్రబోస్ ఆశయాలకు యువత పాటుపడాలన్నారు.



నేతాజి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

ఆంగ్లేయులను గడగడలాడించిన నేతాజీ

మార్కాపురం వన్‌టౌన్ : రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి అన్నా రు. స్థానిక పాఠశాలలో నేతాజీ జయంతిని మంగళవారం నిర్వహించారు. సంతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నేతాజీ 126వ జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.వి. కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏవో ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మాజీ సైనిక సంఘం కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామకృష్ణ, శేషసాయి, సుబ్బయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ జన్మదినం

గిద్దలూరు టౌన్, జనవరి 23 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను గిద్దలూరులోని ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షాన్షావలి, మండలపార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మార్తాల సుబ్బారెడ్డి, రజనీబాబు, కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్‌యాదవ్, టీడీపీ నాయకులు బిల్లా రమేష్, ఎస్సీసెల్ అధ్యక్షులు గుర్రం దానియేలు, మైనారిటీ అధ్యక్షులు షేక్ అహమ్మద్‌భాషా, టీడీపీ నాయకులు కిశోర్, షేక్ పెద్దమస్తాన్, కొండయ్యయాదవ్, బోదనబోయిన గోపాల క్రిష్ణయాదవ్, దుత్తా బాలీశ్వరయ్య పాల్గొన్నారు.

పుల్లలచెరువు, జనవరి 23: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు మండల కేంద్రం పుల్లలచెరువులో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పయ్యావుల ప్రసాద్, కె కుమార్, గజ్జెల్లి బాస్కర్, వేముల క్రిష్ణయ్య, మేడికొండ లక్షినారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేస్తవారపేట : టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యలదర్శి నారాలోకేష్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యాక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి,పూనూరు భూపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు దూదెకుల సైదులు, క్లస్టర్ ఇన్‌చార్జీ మూప్పూరి రాము,బోయిళ్ల రోషన్‌బాబు,బీసు అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : టీడీపీ జాతీయు ఉపాధ్యక్షుడు నారా లోకేష్ జన్మదినం సందర్భంగా పొదిలిలో రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందులనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం కార్యక్రమానికి యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కనుక ప్రతి ఒక్కరు రక్తదానం చేసి మరొకరికి ప్రానదాతులు కావాలని ఆయన కోరారు. ముందుగా భారీ కేక్‌ను కట్‌చేసి అభిమానులకు కార్యకర్తలకు పంచిపెటి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మొత్తం 207 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేసి రెడ్‌క్రాస్ సొసైటీకి అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, మంత్రి కాటూరి నారాయణస్వామి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



దోర్నాలలో కేకు కట్ చేస్తున్న నాయకులు



గిద్దలూరులో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పెద్దదోర్నాల : స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మ దిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల నాయకులు కేకును కత్తిరించి శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, కె శ్రీనివాసులు, నాగెళ్ల సత్యనారాయణ, ఎలకపాటి చంచయ్య, షేక్ ఇస్మాయిల్, షేక్ భాష, బట్టు సుధాకర్ రెడ్డి, ఆర్ సుబ్బరత్నం, క్రిష్ణ, పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పర్యటనలతో రాష్ట్రంలో టీడీపీ కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగిందని జడ్పీమాజీ ఉపాధ్యక్షులు డాక్టరు మన్నె రవీంద్ర అన్నారు. మంగళవారం ఆయన నివాసం వద్ద నారా లోకేష్ బర్తడే కేక్ కట్ చేసి కార్యకర్తలకు నాయకులకు డాక్టరు రవీంద్ర పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు, మాజీ మండల టీడీపీ అధ్యక్షులు పూట్ల సీతారామయ్య, వడ్లమూడి లింగయ్య, షేక్ జిలాని, వెన్నా వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు నాగరాజు వెంకటేశ్వర్లు, ఎం మల్లికార్జున నాచారి, మేకల బాదరయ్య, మాకం జీవయ్య, పి రమణారెడ్డికార్యకర్తలు పాల్గొన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో 10 కిలోల కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో పుల్లలచెరువు మండల టీడీపీ అధ్యక్షులు పయ్యావుల ప్రసాదు, టీడీపీ మండల నాయకులు కంచర్ల సత్యనారాయణగౌడ్, తోట మహేష్, పాలడుగు వెంకటకోటయ్య, చిట్యాల వెంగళరెడ్డి పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రేపటి నుంచి షటిల్ పోటీలు

త్రిపురాంతకం, జనవరి 23: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 25న మండల కేంద్రంలోని బీటీఆర్ చౌదరి ఇండోర్ షటిల్ కోర్టులో ప్రకాశం, పల్నాడు జిల్లాల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు రాజుపాలెం యూత్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ పోటీలలో ప్రకాశం, పల్నాడు జిల్లాల షటిల్ క్రీడాకారులు(పురుషులు) పాల్గొనవచ్చన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.8 వేలు, తృతీయ బహుమతి రూ.6 వేలు, నాలుగో బహుమతి రూ.4 వేలు, ట్రోఫీలు అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి తమ జట్ల వివరాలను ఈ నెల 24 సాయంత్రంలోపు 9441009757, 8555941840 నెంబర్లకు తెలియజేయవచ్చన్నారు.

కాయస్థరాజుల శాసనం లభ్యం

ఎర్రగొండపాలెం, జనవరి 23 : మండలంలోని అయ్యంబొట్లపల్లి గ్రామంలో కాయస్థరాజుల శాసనం లభ్యమైంది. కాయస్థరాజైన గంగయ సాహిని కాలంలో ఈ శాసనం చెక్కారు. అమరలింగేశ్వరస్వామి ఆలయం వద్ద చారిత్రక పరిశోధకులు తురిమెళ్ల శ్రీనివాసప్రసాద్ శాసనాన్ని గుర్తించారు. ఆర్కియాలజి డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపించారు. దీనిలో శాలివాహన శకం 1184వ సంవత్సరం అని నమోదైంది. అంటే సామాన్యశకం 1262 సంవత్సరంలో చంద్రగ్రహణం సందర్భంలో సత్రయ్య అనువారు, గంగయ సాహిని పుణ్యంగా శ్రీశైలం మల్లినాధునికి గూడూరు గ్రామానికి సుంకం రద్దు చేసి బహుమతిగా ఇచ్చినట్లు ఉంది.. ఈ శాసనాన్ని లిఖించి ఇక్కడ నివశించి హల్లిసెట్టి అను వారికి అప్పగించినట్లు ఈ శాసనం ద్వారా తెలుస్తోంది. కాయస్థరాజైన గంగయ్య సాహిని, కాకతీయ రాజైన ఘణపతి దేవుని (1199 - 1262) ఈ కాలంలో మంత్రిగా పనిచేశారు. వీరి పేరు మీద చివరి శాసనం చరిత్రకారులకు సామాన్యశకం 1257 వరకే లభ్యం అవుతుంది. ఈ శాసనం 1262 సంవత్సరంలో లభించడంతో గంగయ సాహిని సామాన్యశకం 1262 వరకు నివసించిన తర్వాత మరణించి ఉంటాడని చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ శాసనం గుర్తించడంలో ఏ సాయి సందీప్, వెంకట్‌నాయుడు, వీఆర్వో రాంబాబు, భార్గవశర్మ పాల్గొన్నారు.



లభ్యమైన శాసనం

చిన్నదోర్నాలలో వైద్యశిబిరం

పెద్ద దోర్నాల, జనవరి 23: మండలంలోని చిన్నదోర్నాలలో ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో వైద్యాధికారులు చలపతిరావునాయక్, ప్రసన్నాంజలి, లక్ష్మీ నారాయణ, రోగులను పరీక్షించి మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాసర్‌రెడ్డి, వైద్య సిబ్బంది మంత్రునాయక్, సూర్యకుమారి, భరత్‌భూషణ్, ఆరోగ్యమిత్ర చంద్రశేఖర్, ఏఎన్ఎం పద్మావతి పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణపై అవగాహన

పొదిలి, జనవరి 23 : కందిలో ప్రస్తుతం కాయ తొలుచు, మారుకమచ్చ పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని, ఏవో షేక్ జైన్‌లుబ్దీన్ తెలిపారు. మంగళవారం మాదిరెడ్డిపాలెం, కంబాలపాడు గ్రామాల్లో రైతులతో కలిసి కంది పైరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కందిలో లార్వాలు ఆకు, పూత, కాయలను గుచ్ఛగా మార్చి లోపలగూడు కట్టుకొని పెరుగుతాయన్నారు. పువ్వు, కాయలోకి పురుగులు వెళ్లి కాయను డొల్ల చేస్తాయన్నారు. ఈ పురుగు ఎక్కువకాలం గుడులోగాని, కాయలోగాని పెరగడం వలన అదుపు చేయడం కష్టంగా ఉంటుందన్నారు. దీని నివారణ కోసం ఎకరాకు 10చొప్పున లింగాకర్షక బుట్టలను అడుగు ఎత్తులో ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా పక్షులకు నిలబడటానికి వీలుగా కర్రలను ఏర్పాటు చేయడం మంచిదన్నారు. పంట వేసిన 30 రోజుల తరువాత నుండి వేపకషాయాన్ని 5ఎంఎల్ లీటర్ నీటినిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పురుగు నివారణకు మందులను సూచించారు.



రైతులకు సూచనలిస్తున్న ఏవో

శనగలో తుప్పు తెగులు నివారణకు చర్యలు

గిద్దలూరు టౌన్, జనవరి 23 : ప్రస్తుతం శనగ పైరులో తుప్పు తెగులు కనిపిస్తోందని, వాటి నివారణకు రైతు లు తగుచర్యలు తీసుకో వాలని ఏవో వై.విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలం లోని కొంగళవీడు గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, గ్రామవ్యవసాయ సహాయకులు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏవో

పాస్టర సంఘం ఎన్నిక ఏకగ్రీవం

ఎర్రగొండపాలెం, జనవరి 23 : నియోజకవర్గ ట్రైబల్‌పాస్టర్ల అధ్యక్షుడిగా పల్లె విలియంబాబును మంగళవారం ఐదు మండలాల పాస్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎర్రగొండపాలెం మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, చేదూరి లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా వి.కాశయ్య, ఉపాధ్యక్షులు కె చిన్నబాబు, కార్యదర్శిగా వైదన ప్రభాకర్ కూడిన కమిటీ ఎన్నికైంది.

నేటి నుంచి రిజిస్ట్రేషన్లపై శిక్షణ : డీపీవో

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23 : జగనన్న శాశ్వత స్థల హక్కు-పేదలందరికీ ఇళ్ళు పథకం ప్లాట్స్ రిజస్ట్రేషన్లపై పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లకు బుధవారం నుంచి రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జీవీ.నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ సహాయకులు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఎంపీడీవోలు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

పుట్టగొడుగుల్లా అక్రమ వెంచర్లు

- కన్వర్షన్ లేకుండానే ప్లాట్లు
- వైసీపీ అండతో యథేచ్ఛగా అమ్మకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

దర్శి, జనవరి 23 : దర్శి ప్రాంతంలో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలస్తున్నాయి. కన్వర్షన్ కూడా లేకుండానే కొంతమంది లేఅవుట్లు వేసి ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. అధికార వైసీపీ అండతోనే కనీస నిబంధనలు పాటించకుండా లేఅవుట్లు వేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. దర్శి పట్టణంలోనే కాక ఈ సంస్కృతి గ్రామాలకు కూడా సోకింది. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో అనుమతులు లేకుండా అనేక లేఅవుట్లను వేసి విక్రయించారు. తాజాగా మండలంలోని రాజంపల్లిలో కొంతమంది అక్రమార్కులు ఇదే పంథాను అనుసరిస్తున్నారు. రాజంపల్లి సర్వేనెంబర్ 248/1 సర్వే నెంబర్‌లో ఒక వ్యాపారి భూమిని కొనుగోలు చేసి ప్లాట్లు వేశారు. లేఅవుట్ వేసుకునేందుకు కనీసం కన్వర్షన్ కూడా చేయించలేదు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు తప్పనిసరిగా కన్వర్షన్ చేయాలన్న నిబంధన పట్టించుకున్న వారే లేరు. అదేవిధంగా అన్నవరం రెవెన్యూలో 18/2, 18/3 సర్వే నెంబర్లలోని వ్యవసాయ భూమిని కూడా అలాగే లేఅవుట్లు వేశారు. తాజాగా రాజంపల్లిలో మరో నాలుగు ఎకరాల భూమిలో లేఅవుట్లు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం కన్వర్షన్ లేకుండా వేసిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయవద్దని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. అయినా కొంతమంది అక్రమార్కులు నిబంధనలు పట్టించుకోకుండా మాయమాటలు చెప్పి ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొనుగోలు దారులు ఆ తర్వాత ఇళ్లు కట్టుకునేందుకు అనుమతులు పొందేందుకు నానా అవస్థలు పడుతున్నారు. దర్శి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా అనాథరైజ్డ్ లేఅవుట్లు విచ్చలవిడిగా వేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రాజంపల్లిలో అనుమతి లేకుండా వేసిన లేఅవుట్

జాతీయ స్థాయి పోటీలకు దొనకొండ విద్యార్థి

దొనకొండ, జనవరి 23 : దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జీ కోటేశ్వరరావు క్రీడల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ కే నరసింహారావు తెలిపారు. రాష్ట్ర స్థాయి జూనియర్స్ నెట్‌బాల్ ఎంపికకు ఆంధ్రప్రదేశ్ నెట్‌బాల్ అసోసియేషన్ ఈనెల 7న ఒంగోలు ఏబీఎం జూనియర్ కాలేజీ మైదానంలో నిర్వహించిన నెట్‌బాల్ పోటీల్లో కోటేశ్వరరావు క్రీడా ప్రతిభతో నైపుణ్యం ప్రదర్శించడంతో జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి మధ్యప్రదేశ్ లో జరిగే జాతీయ పోటీల్లో కోటేశ్వరరావు పాల్గొంటారన్నారు. మారుమూల ప్రాంతమైన దొనకొండ జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థి పాల్గొనడం ఆనందంగా ఉందని, విద్యార్థులను తీర్చిదిద్దుతున్న పీడీ నరసింహారావును ఎంఈవోలు సాంబశివరావు, అమీర్, హెచ్ఎం రామాంజనేయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయ సిబ్బంది


సుబ్బరామరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాఘవరెడ్డి

కనిగిరి స్వగ్రామం లాంటిది..!

మాగుంట రాఘవరెడ్డి

కనిగిరి, జనవరి 23: కనిగిరి అంటే తమకు స్వగ్రామం లాంటిదని ఎంపీ మాగుంట తనయుడు మాగుంట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాగుంట రాఘవరెడ్డి అన్నారు. స్థానిక కొత్తూరు జంక్షన్ వద్ద ఉన్న మాగుంట సుబ్బరామరెడ్డి విగ్రహానికి ఆయన మంగళవారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కనిగిరి మీదుగా కంభం వైపు వెళ్తున్న ఆయన్ని మార్గమధ్యంలో మాగుంట కుటుంబ సన్నిహితులు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అదచేశారు. ఈ సందర్భంగా కనిగిరి ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై మున్సిపల్ చైర్మన్ గఫార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని శ్రీసాయిబాబా దేవస్థానంలో ఆయన ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆలయ కమిటీ దేవకి సుబ్రహ్మణ్యం రాఘవరెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట ఎంఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, కౌన్సిలర్ తమ్మినేని సుజాత, దాసరిమురళీయాదవ్, చమిడిశెట్టి శ్రీనావాసులునాయుడు, పసుపులేటి అరుణోదర్, మాగుంట యూత్ పాల్గొన్నారు.

కోడికత్తి కేసులో జగన్ సాక్ష్యం చెప్పాలి

దర్శి జనవరి 23 : కోడి కత్తి కేసులో జగన్‌రెడ్డి సాక్ష్యం చెప్పాలని దళిత ప్రజాసంఘాల నాయకులు జి ప్రేమ్‌కుమార్, ఆర్ మోషే డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాల నాయకులు ఏ వెంకటేశ్వరరావు, కామూరి నాగమణి పాల్గొన్నారు.


ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరిన లింగారెడ్డిపల్లి కొత్తపల్లి వాసులు

పార్టీ విజయానికి పాటుపడాలి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర
- కదులుతున్న వైసీపీ పునాదులు

కనిగిరి, జనవరి 23 : తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. డాక్టర్ ఉగ్ర క్యాంపు నివాసంలో మంగళవారం రాత్రి కనిగిరి మండలంలోని లింగారెడ్డిపల్లి కొత్తపల్లి గ్రామానికి చెందిన 15కుటుంబాలు కమతం వెంకటేశ్వర్లు, అమ్మిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నాగేంద్ర ఆధ్వర్యంలో వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. డాక్టర్ ఉగ్ర వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి తాను చేపట్టబోయే 5 అభివృద్ధి ప్రణాళికలను ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలన రావడం ఎంత ముఖ్యమో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వైసీపీ పాలనతో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సామాన్యుడు జగన్‌రెడ్డి పాలనలో జీవించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. జగన్‌ను ఇంటికి సాగనంపాలన్నారు. పేద, మధ్యతరగతి వారి జీవనాన్ని వైసీపీ పాలకులు దుర్భరంగా మార్చారన్నారు. పేరుకే సంక్షేమ పథకాలని వాటి వల్ల వైసీపీ నాయకుల జేబులే నిండాయన్నారు. ఓ పక్క బటన్ నొక్కుతూ మరో పక్క ధరలు, చార్జీలను పెంచేశారని ఉగ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రజలు విజ్ఞతతో టీడీపీకి ఓటు వేసి చంద్రబాబును సీఎంగా చేసి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చుకోవాలని కోరారు. తనను గెలిపిస్తే కనిగిరి అభివృద్ధితో పాటు వలసన నివారించి ఉపాధి అవకాశాలు తీసుకువస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారపరెడ్డి (యడవల్లి), శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి పాల్గొనగా, పార్టీలో చేరిన వారిలో భైరెడ్డి వెంకటేశ్వర్లు, పల్లా శ్రీనివాసులు, సంగటి వెంకటసుబ్బయ్య, పల్లా రామ్మోహన్, కొండా మాలకొండయ్య, కుప్పనగిరి లక్ష్మీరెడ్డి, చింతం మాలకొండయ్య, ఎరుకలయ్య, శెట్టిపల్లి కొండయ్య, నందిరెడ్డి మాలకొండయ్య. సుబ్బారాయుడు, ఉండేలా శివారెడ్డి, పాపా కొండారెడ్డి, కుప్పనగిరి మాలకొండయ్యలకు చెందిన 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు.

వైసీపీని వీడిన పీసీపల్లి మండల దళితులు

- టీడీపీలో చేరిన లక్ష్మక్కపల్లి, తలకొండపాడు వాసులు
- కండువాలు కప్పి ఆహ్వానించిన డాక్టర్ ఉగ్ర


తలకొండపాడు వాసులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఉగ్ర

వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పీసీపల్లి మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు, తలకొండపాడు గ్రామంలోని దళితకాలనీకి చెందిన మరో 20 కుటుంబాలు మంగళవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఉగ్ర వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత విషయాలు మరచిపోయి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించడంతో పాటు పాతవారికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. నూతనంగా చేరిన వారు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు.


బోసు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కస్తూరిరెడ్డి

నేతాజీకి నివాళి

కనిగిరి, జనవరి 23: బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడ గడలాడించిన ధీశాలి నేతాజి సుభాష్ చంద్రబోస్ అని జడ్పీటీసీ సభ్యుడు మడతల కస్తూరిరెడ్డి అన్నారు. జడ్పీటీసీ కార్యాలయంలో మంగళవారం బోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం బోస్ తన ప్రాణాలనే పణంగా పెట్టారన్నారు. ఆయన సేవలు భావితరాలు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, గుడిపాడు సర్పంచ్ డీ నాగేంద్రరెడ్డి, వైసీపీ నాయకులు మూలె మాలకొండారెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పామూరు : బ్రిటీష్ వారిని గడగడలాడించిన ధీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పాఠశాలల్లో మంగళవారం ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మీనరసాపురం, కంభాలదిన్నె, బొట్లగూడూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో న్యాయవాది కొల్లూరి మల్లికార్జున నాయుడు ఆర్థిక సహకారంతో గత ఏడాది నేతాజీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. లక్ష్మీనరసాపురం పాఠశాలలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మిఠాయిలు పంచిపెట్టారు. విద్యలో రాణిస్తున్న సీహెచ్ లావణ్యలేఖ, వేటూరి మహీంద్ర, సింధుకు మల్లికార్జున నాయుడు రూ.1116ను అందచేసారు. అనంతరం దాతను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సయ్యద్ ఈసాక్, ఉపాధ్యాయులు పీవీ కృష్ణమోహన్, మచ్చా ఖాజాహుసేన్, సయ్యద్ ఖాదర్‌వలి, అడుసుమల్లి గాయత్రి, జ్యోతి, శోభాకుమారి పాల్గొన్నారు. కేజీబీవీ పాఠశాలలో నేతాజీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, ప్రిన్సిపాల్ కటకం సజన, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పోరాటం ఆదర్శం

కనిగిరి, జనవరి 23 : పోరాటాలకే అంగన్‌వాడీల పోరాటం ఆదర్శంగా నిలిచిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పీసీకేశవరావు అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సమ్మె ప్రాంగణంలో సభ జరిగింది. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ పోరాటాల ఫలితంగానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు మరోసారి రుజువు చేశారన్నారు. ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరించేందుకు హామీ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు రాజ్యలక్ష్మీ, రామసుబ్బు, ఐద్వా సంఘ మహిళలు ప్రసన్న, శాంతకుమారి, రాజేశ్వరి, సీత, మనోరంజిత, కార్యకర్తలు, హెల్పర్లు, డీవైఎఫ్ఐ నాయకుడు నరేంద్ర పాల్గొన్నారు.

అనుమతులు పొందాకే కట్టడాలు చేపట్టాలి

తాళ్లూరు, జనవరి 23 : గ్రామాల్లో కట్టడాలు చేపట్టే ప్రజలు ముందుగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి తప్పని సరిగా అనుమతులు పొందాలని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ జేపీవో అంకయ్య తెలిపారు. తాళ్లూరు గ్రామంలో నూతన నిర్మాణం చేపడుతున్న పలు కట్టడాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కట్టడాలు చేపడుతున్న వారి వద్ద అనుమతులు ఉన్నదీలేనిది పరిశీలించారు. అన్ని గ్రామాలు ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలోకి చేరాయన్నారు. అనుమతి లేకుండా ఇష్టానుసారం కట్టరాదన్నారు. ప్రజలు కట్టడాల విషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. కట్టడాలు చేపట్టేటప్పుడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. వాటిని పరిశీలించి అనుమతులు ఇచ్చిన తరువాతే కట్టడాలు ప్రారంభించాలని సూచించారు. అందుకు విరుద్ధంగా కట్టడాలు చేపడితే పెనాల్టీలు చెల్లించాల్సి వస్తుందన్నారు. ప్రజలు సహకరించి అనుమతులు పొందాకే నిర్మాణాలు చేపట్టాలని జేపీవో అంకయ్య సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జే లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

మోపాడులో చేపల అక్రమ వేటకు అడ్డుకట్ట

పామూరు, జనవరి 23 : మండలంలోని మోపాడు రిజర్వాయర్‌లో అనుమతి లేకుండా అక్రమంగా కొనసాగుతున్న చేపల వేటను వెంటనే ఆపాలని కనిగిరి మత్స్యశాఖ ఇన్‌చార్జి షేక్ మహ్మద్ సుభాని ఆదేశించారు. నుచ్చుపొద జాలర్ల సహకార సంఘానికి తెలియకుండా అక్రమంగా రిజర్వాయర్‌లో చేపలు పట్టడం నేరమని, లీజు ఉత్తర్వులు, ఫిషింగ్ పర్మిట్ లేకుండా చేపలను వేటాడడం చట్టరీత్యా నేరమని తెలిపారు. లీజు ఉత్తర్వులు మంజూరయ్యే వరకూ చేపలను పట్టవద్దని సుభాని ఆదేశించారు. నిబంధనను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

జ్వరాలపై ఆరోగ్య శాఖ ఇంటింటి సర్వే

ముండ్లమూరు, జనవరి 23 : మండలంలోని పసుపుగల్లులో డెంగ్యూ, విష జ్వరాలతో ప్రజలు మంచం పట్టడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మంగళవారం ఇంటింటి సర్వే చేపట్టారు. వీధులను పరిశీలించి పారిశుధ్య పనులు చేయించారు. దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టారు. ఎబేట్, బ్లీచింగ్ చల్లించి, ఫాగింగ్ చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి జ్వర బాధితుల సర్వే నిర్వహించారు. దర్శి యూనిట్ మలేరియా అధికారి బసవారెడ్డి ఆధ్వర్యంలో మలేరియా పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌వో కన్యాకుమారి, ఏఎన్ఎం విజయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


దొనకొండలో కేక్ కట్ చేస్తున్న శివకోటేశ్వరరావు, అన్నదానం చేస్తున్న శ్రేణులు, పామూరులో పండ్లు పంపిణీ చేస్తున్న పోకా

అట్టహాసంగా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

కనిగిరి, జనవరి 23 : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్, జననీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ శ్రేణులతోపాటు యువత పెద్ద సంఖ్యలో తరలి వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ డాక్టర్ ఉగ్ర ప్రత్యేకంగా అభినందించడంతోపాటు ఎన్టీఆర్ ట్రస్ట్ జారీ చేసిన సర్టిఫికెట్లను, గొడుగులను పంపిణీ చేశారు. అనంతరం ఉగ్ర, జనసేన పార్టీ జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి వరికూటి నాగరాజు, శ్రేణులతో కలసి భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ఉగ్ర మాట్లాడుతూ సేవాగుణంలోనూ టీడీపీ శ్రేణులు, కనిగిరి ప్రాంత యువత ఆదర్శంగా నిలుస్తారన్నారు. రక్తదానానికి పిలుపునిచ్చిన వెంటనే లోకేష్‌పై ఉన్న అభిమానంతో 191 మంది పార్టీశ్రేణులు, యువత, అభిమానులు తరలి వచ్చి రక్తదానం చేయడం గొప్పవిషయ మన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి ఉగ్రతోపాటు, జనసేన పార్టీ నాయకులు నాగరాజు, ఇరు పార్టీల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పామూరు : లోకేష్ పుట్టినరోజు వేడుకలను పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు ఉప్పలపాటి హరిబాబుతో కలిసి భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం వాహనాల్లో ఉగ్ర ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, వైప్రసాద్‌రెడ్డి, షేక్ ఖాజారహంతుల్లా, షేక్ గౌస్‌బాషా, ఇర్రి కోటిరెడ్డి, పందిటి హరీష్, ఎస్.సాంబయ్య, పులి హజరత్, దేవరపు మాల్యాద్రి, ముబీనామౌలాలి, పత్తు మస్తాన్, చిన హజరత్, రహంతుల్లా, పోకా వినోద్, తెలుగు మహిళలు ఎం రమాదేవి, ఏ రమణమ్మ, షేక్ నూర్‌బీ పాల్గొన్నారు. కంభాలదిన్నె గ్రామంలో జరిగిన వేడుకల్లో మండల తెలుగు రైతు అధ్యక్షుడు మన్నం రమణయ్య, ఏలూరి నరసింహారావు, సుబ్బమ్మ పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పోకా నాయుడుబాబు ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అశ్విని హాస్పిటల్‌లో పలువురు రోగులకు పండ్లు, కాయలు, మిఠాయిలను డాక్టర్ గద్దె ఏడుకొండలతో కలిసి అందచేశారు. సుబ్బక్కపల్లి స్వగ్రామంలో శ్రీ కోదండరామస్వామి ఆలయంలో లోకేష్ ఆరోగ్యంగా ఉండాలని పూజలు చేయించారు. పామూరులోని ఆర్టీసీ బస్టాండ్ పాయింట్‌లో నిరాశ్రయులుగా ఉన్న వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

దర్శి : నారా లోకేష్ జన్మదిన వేడుకలను తెలుగు యువత ఆధ్వర్యం లో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్లో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు కేకు కట్‌చేసి అభిమానులకు పంచారు. ఎన్టీఆర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం సాయిబాబా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తెలుగు యువత పుల్లలచెరువు చిన్న, ఉపాధ్యక్షుడు కల్లూరి సుబ్బు, వీరనాగిరెడ్డి, అధికార ప్రతినిధి గుర్రం బాలకృష్ణ, శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టే వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, క్లస్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు, శోభారాణి, సందు రామయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో గరికపాటి గోపి కేక్ కట్ చేసి పంచిపెట్టారు.


కనిగిరిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర


దర్శిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

దొనకొండ : దొనకొండలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఎన్నడూలేని విధంగా అట్టహాసంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు నేతృత్వంలో నాయకులు మోడి వెంకటేశ్వర్లు, కొత్తం రఘునాథరెడ్డి, వల్లపునేని వెంకటస్వామి, శృంగారపు నాగసుబ్బారెడ్డి, వడ్లమూడి చెన్నయ్య పత్తి వెంకటేశ్వర్లు, మన్నెం గాలయ్య, యరగొర్ల బసవయ్య పెమ్మసాని లక్ష్మీనారాయణ, కొమ్మతోటి సుబ్బారావు, యగ్గోని యల్లారెడ్డి, నిమ్మకాయల సుబ్బారెడ్డి, బండ్లా వెంకట నారాయణ, దుగ్గెంపూడి చెంచయ్య, కమ్మా నారాయణ, బొందల రాజు, బీఏ సైరస్ మరికొందరు నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేకు కట్ చేసి ప్రజలకు పంచి అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

టీడీపీ కార్యాలయంలో యువ నాయకులు వీరపనేని వెంకన్నచౌదరి, సీనియర్ నాయకులు దుగ్గెంపూడి కాశయ్య, పులిమి రమణాయాదవ్, షేక్ ముసామియా ఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కామేపల్లి చెంచయ్య, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, తోటా కోటేశ్వరరావు, వేగినాటి అల్లూరయ్య, వల్లపునేని ఆదినారాయణ, ఫణిదపు అనంతరాములు, వైకే చౌదరి, షేక్ సుభానీ, ఫణిదపు వీరాంజనేయులు, సింగమనేని హనుమంతరావు, మోడి అంజనేయులు, పురుషోత్తం సత్యా మరికొందరు నాయకులు, కార్యకర్తలు భారీ కేకు కట్‌చేసి ప్రజలకు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు.

కురిచేడు : నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ, కురిచేడు టౌన్ పార్టీల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మండల పార్టీ అధ్యక్షుడు నెమిలయ్య అధ్యక్షతన డాక్టర్ సునీల్ వైద్యశాల ఆవరణలో, టౌన్ పార్టీ అధ్యక్షుడు గంధం గురునాథం ఆధ్వర్యం లో వినుకొండ రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద కేకులు కోసి పంచిపెట్టారు. వైసీపీ పాలనను అంతంచేసి రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా అందరూ కష్టపడి పనిచేయాల ని పిలుపునిచ్చారు.

ముండ్లమూరు : లోకేశ్ పుట్టినరోజు వేడుకలను టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి పంచారు. టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కూరపాటి నారాయణ స్వామి, సుబ్బారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వరగాని పౌలు, కొండలరావు, జిల్లెలమూడి చౌదరి, రంగ నాయకులు, పేరారెడ్డి, వెంకటసుబ్బయ్య, శివ, బాలయ్య, బుచ్చిబాబు పాల్గొన్నారు. అలాగే దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఆదేశాల మేరకు ఆయన సోదరుడు గోపీ, టీడీపీ మండల నాయకులు ముండ్లమూరు, మారెళ్లలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తోట రామారావు, టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాళ్లూరు : నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలను టీడీపీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరంవద్ద టీడీపీ శ్రేణులు భారీ కేక్ కట్ చేసి స్వీట్లు, పులిహార పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి జి.వేణుబాబు, టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శులు శాగం కొండారెడ్డి, మానంరమేష్‌బాబు, వల్లభనేని సుబ్బయ్య, షేక్ కాలేషావలి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కూటాల ప్రసాద్, టీడీపీ నాయకులు మీరామొహిద్దీన్, శివనాగిరెడ్డి, చెన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, కైపు రామకోటిరెడ్డి, ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, పిన్నిక రమేష్‌బాబు, షేక్‌కాశీంసైడ్, జిలక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, నాదెండ్లశ్రీను, షేక్ అన్వర్‌బాషా, సత్యం, బొద్దుహనుమారెడ్డి, బూచిరాజు, పోతురాజు, అంకమ్మ, సూరిబాబు, ఎబ్రాయిమ్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడులో లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

లక్కవరంలో మద్యం బాటిళ్ల పట్టివేత

తాళ్లూరు, జనవరి 27 : లక్కవరం గ్రామంలో అనుమతి లేకుండా విక్రయించేందుకు నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను తాళ్లూరు ఎస్సై వైవీ రమణయ్య తమ సిబ్బందితో మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. లక్కవరం గ్రామానికి చెందిన కూకట్ల వెంకటేశ్వర్లు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్సై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అక్రమంగా నిల్వ ఉంచిన గోలెన్ స్టైప్స్ 10 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని దర్శి కోర్టుకు హాజరు పరుచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం విక్రయదారుడు వెంకటేశ్వర్లు వైసీపీ ట్రేడ్‌యూనియన్ జిల్లా సెక్రటరీ తండ్రి కావడంతో రాజకీయ ఆరోపణలకు ప్రాధాన్యత ఏర్పడింది. వైసీపీ ట్రేడ్ యూనియన్ నేత, ఎమ్మెల్యే మద్దిశెట్టి వర్గీయుడిగా ఉండి బూచేపల్లికి దూరంగా ఉన్నందునే ఇలా కేసు నమోదు చేయిస్తున్నారని వైసీపీ ట్రేడ్ యూనియన్ సెక్రటరీ కూకట్ల బ్రహ్మం ఆరోపించారు. బూచేపల్లి వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన 20 రోజుల్లోనే గ్రామంలోని బూచేపల్లి వర్గీయులు రెండు పర్యాయాలు తమ ఇంటిపైనే దాడులు చేయించి కేసులు నమోదు చేయించి ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
3
బుధవారం 24 జనవరి 2024



1100 కేజీల అభిమానం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మంగళగిరిలో 1100 కేజీల కేకును కట్ చేసి పంపిణీ చేశారు.





పొమ్మనకుండా.. పొగ

- రాజకీయ బదిలీపై లావు కినుక
- పార్టీకి, పదవికి శ్రీకృష్ణదేవరాయులు రాజీనామా
- సీటుపై అనిశ్చితి.. క్యాడర్‌లో గందరగోళంతోనే నిర్ణయం
- శ్రీకృష్ణదేవరాయులకు మద్దతుగా పలువురు రాజీనామాలు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 23: అవినీతి.. అరాచకాలు చేస్తోన్న వారిని వెనుకేసుకొస్తూ వారు కోరుకున్న సీట్లు ఇచ్చేందుకు భరోసా ఇస్తున్న వైసీపీ అధినేత సీఎం జగన్ వ్యూహాత్మకంగానే నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులకు పొగ పెట్టారు. నియోజకవర్గం మారేందుకు ఇష్టపడని లావు నర సరావుపేట నుంచి అయితేనే పోటీ చేస్తానని లేకుంటే లేదని సీఎం జగన్‌కు చెప్పి వచ్చిన విషయం తెలిసిందే. 2019లో గుం టూరు అడిగితే నరసరావుపేట వెళ్లమన్నారు.. ఇప్పుడు నరసరావుపేట నుంచి గుంటూరుకు రమ్మంటున్నారు.. ఏం తప్పు చేశాను.. ఎందుకు సీటు మారాలి అని ప్రశ్నించి కొన్ని రోజులుగా పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలో పార్టీకి, తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు శ్రీకృష్ణదేవరాయులు ప్రకటిం చారు. గుంటూరులో మంగళవారం మీడియా సమావేశం ఏర్పా టు చేసి ఆయన రాజీనామా విషయాన్ని ప్రకటించారు. టికెట్ విషయంలో క్లారిటీ లేకపోవడం, క్యాడర్‌లో గందరగోళంతోనే తాను రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ గం దరగోళం వల్ల అటు నాయకులకు, పార్టీకి, ఇటు తనకి ఉప యోగం లేదని, వీటన్నిటికీ తెరదించుతున్నట్లు స్పష్టం చేశారు. ఇన్నాళ్లు తన వెంట నడిచిన నాయకులకు, తన సీటు కోసం చొరవ చూపిన ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పల్నాడు అభివృద్ధి కోసం పరితపించాను : లావు

పల్నాడు ప్రజలు ఎంతో ఆదరాభిమానాలతో ఆశీర్వదించి ఎంపీ గా తనను లక్ష 55వేల ఓట్ల మెజారిటీతో అపూర్వ విజయాన్ని అందించారని కృష్ణదేవరాయులు విలేకర్ల సమావేశంలో తెలిపారు. అందరు ఎంపీల మాదిరిగా కాకుండా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తాను కృషి చేశానన్నారు. పల్నాడుని అభివృద్ధికి కేరాఫ్‌గా మార్చాలని పరితపించానని వివరించారు. ఏడు దశాబ్దాల కల వరికెపూడిసెల ప్రాజెక్టుకు అటవీ అనుమతులను సాధించి.. నిర్మాణంలో పురోగతిని సాధిం చామన్నారు. పల్నాడువాసులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతో పాటు వైద్య విద్య అందేలా మెడికల్ కాలేజీని మంజూరు చేయించినట్లు తెలిపారు. మాచర్ల, రొంపిచర్లలో కేంద్రియ విద్యాలయాలు మంజూరు చేయించినట్లు చెప్పారు. దాదాపు రూ.3000 కోట్లతో జాతీయ రహదారులు సాధించానని, 30 నిమిషాల్లో హైవే పైకి చేరుకునేలా పల్నాడులో రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. కొన్ని రహదారులు నిర్మాణం పూర్తవుతుం డగా, మరికొన్నిటికి టెండర్లు పూర్తయ్యాయ న్నారు. పల్నాడులో రైతులకు మేలు జరిగేలా.. ఇండో - ఇజ్రాయేల్ ప్రాజెక్టు సాధించానన్నారు. జేఎన్‌టీయూ నరసరావుపేట కళా శాలకు శాశ్వత భవంతిని నిర్మించినట్లు తెలిపారు. సొంత నిధులతో పొలాలకు, డొంకలకు వెళ్లే మార్గాలను బాగుచేయించినట్లు తెలిపారు. గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు నిర్మించినట్లు తెలిపారు.

లావు వెంట పలువురు..

దాచేపల్లి, కారంపూడి, గురజాలటౌన్, ప్రత్తిపాడు, సత్తెనపల్లి: శ్రీకృష్ణదేవరాయులు రాజీనామా పార్టీ శ్రేణుల్లో కలకలం సృష్టించింది. ఆయన ఏకకాలంలో పార్టీకి, పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన వెంటనే పలువురు వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తాము కూడా ఆయన వెంటే అంటూ రాజీనామాలు ప్రకటించారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు తీసుకొచ్చిన శ్రీకృష్ణదేవరాయులు సేవలు తమ ప్రాంతానికి అవసరమని, ఆయనతో కలిసి నడిచేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని ఆయా నేతలు తెలిపారు. దాచేపల్లి మండల వైసీపీ సీనియర్ నాయకుడు కొణతం సూర్యనారాయణరెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుమామిళ్ల శ్రీనివాసరావు, వైసీపీ జిల్లా మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ మాబూ తదితరులు రాజీనామా చేశారు. గురజాల నగర పంచాయతీ 12వ వార్డు కౌన్సిలర్ మహంకాళి అనిత, ఆమె భర్త నీలంరాజులు మంగళవారం వైసీపీకి రాజీనామా చేశారు. పెదనందిపాడు మండలానికి చెందిన లావు శ్రీకృష్ణదేవరాయులు వెంట నడిచేందుకు ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పలువురు సిద్ధమయ్యారు. మంగళవారం పెదనందిపాడు మండలానికి చెందిన కొందరు నాయకులు ఎంపీని కలిశారు. పెదనందిపాడు మాజీ మండల కన్వీనర్ మదమంచి వాసు, రాజుపాలెం సర్పంచ్ కమ్మ నాగమల్లేశ్వరరావు, కాట్రపాడు సర్పంచ్ కొమ్మినేని దుర్గాప్రసాద్ ఎంపీని కలిసినవారిలో ఉన్నారు.




ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు నివాసం ఎదుట వైసీపీ ఫ్లెక్సీలు తొలగించిన ఆయన అభిమానులు

లావు ఇంటి ఎదుట ఫ్లెక్సీల తొలగింపు

గుంటూరు(ఆంధ్రజ్యోతి): వైసీపీకి రాజీనామా చేసిన లావు శ్రీకృష్ణదేవరాయులుకు ఆయన అభిమానులు జేజేలు పలుకుతున్నారు. వైసీపీలో నిజాయితీపరులకు చోటు లేకుండా పోయిందని మండిపడ్డారు. మంగళవారం రాత్రి ఎంపీ నివాసం ఉన్న రింగురోడ్డు వద్ద రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన వైసీపీ ఫ్లెక్సీలను ఆయన అభిమానులు చించి పారేశారు. కొన్నింటిని తొలగించి అవతల పడేశారు. సామాజికవర్గం సాకుతో సిట్టింగ్ స్థానాన్ని కాదని వేరే చోటికి వెళ్లమనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ వెంటే మేము.. జై టీడీపీ... జై చంద్రబాబు అంటూ నినాదాలతో హోరెత్తించారు.

తుదిలోనూ.. తప్పులే



అద్దంకి పట్టణంలోని 17 వ వార్డు ఓటర్ల జాబితాలో పాణెం ఇంటి పేరుతో కొత్తగా చేరిన ఓటర్లు

- ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతరు
- ఎన్నికల అధికారుల నిర్లక్ష్యం బహిర్గతం
- తుది ఓటర్ల జాబితాల్లోనూ తప్పుల కొనసాగింపు

తుది ఓటర్ల జాబితాల్లో ఎలాంటి తప్పులు ఉండకూడదు.. గత ఫిర్యాదులు పునరావృతం కాకూడదు.. నూరు శాతం స్వచ్ఛీకరణ జాబితాలో ప్రచురించాలి.. అని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యక్షంగా జిల్లా ఎన్నికల అధికారులతో దీనిపై సమీక్షించింది. ఇక తప్పులు లేకుండా ఓటర్ల జాబితాలు ఉంటాయని అటు రాజకీయ పార్టీలు, ఇటు ఓటర్లు ఆశించారు. అయితే వారి ఆశలను వమ్ము చేస్తూ ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏవైతే తప్పులు దొర్లాయో అవే పునరావృతమయ్యాయి. మొత్తంమీద ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఓటర్ల జాబితాలను రూపొందించినట్లు పలువురు విమర్శిస్తున్నారు. తుది ఓటర్ల జాబితాల ప్రచురణలో పాతకథే పునరావృతం అయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన ఒక్కరోజులోనే ఇన్ని తప్పులు బహిర్గతమవుగా.. రానున్న రోజుల్లో ఇంకెన్ని అక్రమాలు వెలుగుచూస్తాయో చూడాలి.

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గతంలో విడుదల ముసాయిదా ఓటర్ల జాబితాలో వెలుగు చూసిన లోపాలే తుది ఓటర్ల జాబితాల్లోనూ కనిపిస్తున్నాయి. మృతులు, వలస దారులు, డబుల్ ఎంట్రీలు, జీవో డోర్ నెంబరు ఇలా అనేక పొరపాట్లు బహిర్గతమయ్యాయి. ముసాయిదా జాబితాలోని తప్పులు, ఫిర్యాదులను సవరించి మార్పులు చేస్తామని చెప్పిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేసినట్లు కన్పించడం లేదు. తుది ఓటర్ల జాబితా విడుదలతో బీఎల్‌వోలు, ఏఈఆర్‌వో, ఈఆర్‌వోల నిర్లక్ష్యం బహిర్గతమైంది. ఎస్ఎస్ఆర్-2024 తుది ఓటర్ల జాబితా ప్రచురించేందుకు ఎన్నికల సంఘం అదనపు రోజులను కేటాయించినా బీఎల్‌వోలు, ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోలు సరిగా దృష్టి పెట్టలేదని తేలింది. ఒకరికే రెండు ఓట్లు, నకిలీ ఫాం 7 దర ఖాస్తులు, మృతుల ఓట్లు తదితరాలపై పెద్దసంఖ్య లో గతంలో ఫిర్యాదులు అందజేశారు. వీటిపై ఎన్ని కల సంఘం ఆదేశాల మేరకు అధికారులు ఇంటింటి సర్వే కూడా చేపట్టారు. అయినా ఆ ఓట్లు అలాగే ఉన్నట్లు తుది ఓటర్ల జాబితాల్లో వెలుగుచూసింది. తుది ఓటరు జాబితాలు చూస్తే వారి నిర్లక్ష్యం అణువణువునా కనిపిస్తుంది. ఎస్ఎస్ఆర్- 2024కు సంబంధించి ఫైనల్ లిస్టులను ఇప్పటికే అధికారులు వివిధ రాజకీయ పార్టీలకు అందజేయగా వారు ఇంకా వాటిపై దృష్టి పెట్టలేదు. మరోవైపు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పీడీఎఫ్ జాబితాలు అందుబాటులోకి రావడంతో చాలా మంది ఓటర్లు వాటిని డౌ న్‌లోడ్ చేసుకుని పరిశీలి స్తున్నారు. ఈక్రమంలో చాలా తప్పులను సరి చేయకుండా పాత జాబితాలను అలానే ఉంచినట్లు తేలింది. అధికారులు సోమవారం విడుదల చేసిన జాబితాలను అంతంత మాత్రంగా పరిశీలిస్తేనే ఇన్ని తప్పులు బహిర్గతమయ్యాయంటే క్షుణ్ణంగా శోధిస్తే భారీ సంఖ్యలోనే వెలుగులోకి రాక తప్పదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఓటర్ల జాబితాలన్నింటిని తనిఖీ చేస్తే తప్పులు వేల సంఖ్యలోనే బయటపడే అవకాశం ఉన్నది. వీటికి బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు ఏమి సమాధానం చెబుతారో చూడాలి. ఎన్నికల సంఘం కూడా వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది.

* ఇల్లు లేని వారికి మాచవరం గ్రామంలో ఓట్లు ఉన్నాయి. వీరికి వేర్వేరు గ్రామాల్లో కూడా ఓట్లు ఉన్నాయి. అయినప్పటికీ కావాలనే అధికారులు తొలగించలేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో 923 ఓట్లు ఉండగా వారిలో ఇతర గ్రామాలకు చెందిన వారికి సుమారు 170 మంది ఉన్నారు. వారికి ఇంటి స్థలం, ఇల్లు లేకపోయినా జాబితాలో ఓట్లు ఉన్నాయి. గొట్టిముక్కలలో ఉండే పాలగుండ్ల కనకమ్మ, మున్నా రమణ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయి. చిన్న గ్రామమైన రేగుల గడ్డలోనే ఇన్ని ఓట్లు అక్రమంగా ఉన్నాయంటే మిగి లిన గ్రామాల్లో అక్రమ ఓట్లు ఎందుకు ఉండవనే అనుమానాలు ప్రజల్లో వస్తున్నాయి.

* నూజెండ్ల మండలం కమ్మవారిపాలెం బూత్ నెంబరు 276లో గతంలో 253 ఓట్లు ఉండగా తుది జాబితాలో 213 ఓట్లు మాత్రమే ఉన్నాయి. జాబి తాలో 25 మంది చనిపోయిన వారు ఉండగా 40 ఓట్లు ఉద్దేశ పూర్వకంగా తొలగించారనే ఆరోపణలు ఉన్నాయి. అల్లిబాయిపాలెంలోని 224 పోలింగ్ బూత్ లో 30 ఓట్లను తొలగింపుల జాబితాలో చేర్చారు. కొండలరాయునిపాలెం, ప్రకాశం జిల్లా కుంట, విను కొండలోని మసీదు మాన్యాల్లో తొలగించిన వారి పేర్లను అల్లిబాయిపాలెంలోని ఓటర్ల జాబితాలో చేర్చారు.

* బల్లికురవ మండలం కొప్పెరపాలెం గ్రామానికి చెందిన 28 మందికి కొప్పెరపాలెంతో పాటు పల్నాడు జిల్లా నరసరావుపేట, చి లకలూరిపేట, తుబాడు, బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం, బల్లికురవ గ్రామాలలో రెండో ఓటు ఉన్నట్లు వెలుగు చూసింది. 53 మందికి రెండేసి ఓట్లపై గత నెలలో టీడీపీ నేతలు ఆధారాలతో ఫిర్యాదులు చేశారు. అధికారులు విచారణ చేపట్టినా ఇంకా 28 మంది ఓట్లు రెండుచోట్ల అలానే ఉన్నాయి. ఒకే వ్యక్తికి కొప్పెరపాలెంతో పాటు బల్లికురవ, కొమ్మినేనివారి పాలెం, పొరుగు జిల్లాలో కూడా ఓట్లు ఉన్నట్లు నిర్ధారణ అయింది.

పెదకూరపాడు ఓట్లు అద్దంకికి..

అద్దంకి: ఓటర్ల మార్పులు, చేర్పుల్లో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని, వారికి ఎన్నికల అధికారులు సహకరించారని తుది ఓటర్ల జాబితాల్లో దొర్లిన తప్పులు చూస్తే అర్థమవుందని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. వైసీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి బంధు వుల ఓట్లను అద్దంకి నియోజకవర్గంలో చేర్చే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు విమ ర్శలు వస్తున్నారు. పల్నాడు జిల్లా పెదకూ రపాడు నియోజకవర్గంలోని క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామం నుంచి అద్దంకి నియోజకవర్గానికి ఓట్లు బదిలీ అయినట్లు తెలిసింది. సుమారు 82 మందికి సంబం ధించి ఆధార్ కార్డుల అడ్రస్‌లను కొద్దిరోజుల క్రితమే అద్దంకికి మార్చారు. వాటి ఆధారం గా ఓట్లు చేర్పులు చేసినట్లు తెలుస్తోంది. సోమవారం ప్రకటించిన ఓటర్ల జాబితాలో అద్దంకి 155, 156 బూత్‌లలో హనిమిరెడ్డి బంధువులకు సంబంధించిన 25 ఓట్లను టీడీపీ నేతలు గుర్తించారు. వేరే నియోజక వర్గం ఓట్లు గుంపగుత్తగా చేర్చడంపై తహసీలార్, నియోజకవర్గ ఎన్నికల అధికారి ఉమాదేవిని టీడీపీ నేతలు ప్రశ్నించారు. ఓట్లు చేర్పులకు 9వ తేదీ చివరి రోజుగా ప్రకటించి అనంతరం ఎలా దర ఖాస్తులు తీసుకున్నారన్నారు. దీనిపై ఆమె స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా ఫాం7 ఇస్తే విచా రణ చేసి తొలగిస్తామని చెప్పడంపై టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు.



అగ్గిరాజుకుంటే.. బూడిదే

కోల్డ్‌స్టోరేజీల్లో రైతుల కష్టం దైవాదీనం

- నిల్వ వసూళ్లు అధికం.. వసతులు మృగ్యం
- శీతల గిడ్డంగుల్లో నిబంధనలకు తిలోదకాలు
- అగ్నిమాపకశాఖ అనుమతులు లేకుండానే నిర్మాణం
- ప్రమాదాల సమయంలో హడావుడి ఆ తర్వాత నిర్లక్ష్యం
- భద్రతా ప్రమాణాలపై చేష్టలుడిగి చూస్తోన్న అధికారులు

గుంటూరు సిటీ, జనవరి 23: దుగ్గిరాల శీతల గిడ్డంగిలో అగ్గిరాజుకుంది. రైతుల కష్టమైన లక్షా 20 వేల పసుపు బస్తాలు బూడిదయ్యాయి. మంచి ధర వస్తే అమ్ముకుందామని ఎదురు చూస్తుండగానే ఘోరం జరిగిపోయింది. గతంలో గుంటూరులో కూడా ఇలానే పలు శీతల గిడ్డంగుల్లో రూ.కోట్ల పంట మాడిమసయ్యింది. శీతల గిడ్డంగుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అటు వాటి యజమానులు, ఇటు అధికారుల్లో చలనం ఉండటంలేదు. ప్రమాదాలు జరిగినప్పుడు తాత్కాలికంగా హడావుడి చేస్తున్నారే కాని రైతుల రెక్కల కష్టానికి సరైన భద్రత కల్పించాలన్న ఆలోచన చేయడంలేదు. దుగ్గిరాల ప్రమాదం తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లాలోని శీతల గిడ్డంగుల భద్రతపై చర్చ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న సుమారు 128 శీతల గిడ్డంగుల్లో ఏ ఒక్క దానికి కూడా అగ్నిమాపక శాఖ అనుమతి లేదని సమాచారం. గుంటూరు నగర పరిధిలోని 80 శీతల గిడ్డంగుల్లో ప్రమాదం జరిగితే చాలావాటిల్లో అగ్నిమాపక శకటం లోపలికి వెళ్లే అవకాశం కూడా తక్కువే. గతంలో జరిగిన అగ్ని ప్రమాదాల్లో కోట్ల విలువ చేసే మిర్చి బూడిదైంది. అయినా మిగిలిన స్టోరేజ్‌ల యజమానులు గుణపాఠం నేర్వలేదు. ఏమీ కాదులే అన్న నిర్లక్ష్యంతో ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీజన్‌కు టిక్కీకి రూ.100 మాత్రమే వసూలు చేయాలి. అయితే కొందరు టిక్కీకి రూ.200 లకు తగ్గకుండా వసూలు చేస్తున్నారు. అయినా రైతుల రెక్కల కష్టానికి మాత్రం సరైన భద్రత కల్పించలేకపోతున్నారు. కోల్డ్ స్టోరేజ్‌ల్లో కోట్ల విలువ చేసే మిర్చిని నిల్వ చేస్తున్నారు. ఒక్కో స్టోరేజ్ సామర్థ్యం 50 వేల టిక్కీల నుంచి లక్షా 50 వేల టిక్కీల వరకు ఉంటుంది. ప్రస్తుతం ఒక్కో మిర్చి టిక్కీ రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు ధర పలుకుతుంది. ఈ లెక్కన కోల్డ్ స్టోరేజ్‌ల్లో రూ.20 కోట్ల నుంచి రూ. 30 కోట్ల విలువైన మిర్చి ఉంటుంది. ఈ పంటకు ముందే ఇన్సూరెన్స్ చేయిస్తున్నామని యజమానులు చెబుతున్నా అది ఎంత వరకు నిజమో తెలియదు. సాధారణంగా కోల్డ్ స్టోరేజ్‌లో అగ్గి రాజుకోవడం అసాధ్యం. అయితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరుగుతుంది. నిరంతరం ఏసీలు రన్నింగ్‌లో ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు నిర్ధారించారు. వేసవిలో ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవిస్తే దానిని గుర్తించే లోపే చెప్పలేనంత నష్టం జరుగుతుంది.

జీవో 119కి వక్రభాష్యం

ఒక పక్క ప్రమాదం పొంచి ఉన్నా కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానులు మాత్రం జీవో 119కి వక్రభాష్యం చెబుతున్నారు. ఈ జీవో మేరకు 18 మీటర్లు దాటిన కట్టడానికి కచ్చితంగా అగ్నిమాపక శాఖ అనుమతులు ఉండాలి. అయా కట్టడాల్లో అగ్ని ప్రమాదాలు నివారించే తాత్కాలిక ఏర్పాట్లు ఉండాలి. అయితే కోల్డ్ స్టోరేజ్‌ల యజమానులు తమ బిల్డింగ్‌లు 18 మీటర్ల కంటే తక్కువ ఎత్తు అని జీవోలోని నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. బిల్డింగ్‌లోని సెల్లార్‌లను వదిలిపెట్టి మిగిలిన కట్టడానికి కొలత చూపిస్తున్నారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించిన అనుమతి తప్పించుకునేందుకు ఇలా చేస్తున్నారని అధికారులు చెబుతున్నారే కాని వారిపై చర్యలు తీసుకోవడంలేదు. ఇదే అవకాశంగా మిగిలిన గిడ్డంగుల యజమానులు కూడా నిబంధనలు పాటించడంలేదు.

చేష్టలుడిగిన యంత్రాంగం

కోల్డ్ స్టోరేజ్‌ల్లోని భద్రతా ప్రమాణాల విషయంలో అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. ఏ ఒక్క స్టోరేజ్‌కి అగ్నిమాపక శాఖ అనుమతి లేదని తెలిసినా ఏమి తెలియనట్లుగా ఉంది. ఒక వేళ ఏదైనా ప్రమాదం సంభవించి అగ్నిమాపక వాహనం లోపలకు వెళ్లాలన్నా అవకాశం లేదు. అయినా అధికారులు కనీస చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో కోల్డ్ స్టోరేజ్‌ల వివరాలు కూడా లేవంటే పరిస్థితి ఎలా ఉందో చెప్పవచ్చు.



● గుంటూరు బైపాస్ పక్కన ఉన్న కోల్డ్ స్టోరేజ్‌లు

ఫ్యాను.. కకావికలం

వైసీపీలో అంతా గందరగోళం

- రేపల్లె ఇన్‌చార్జి గణేశ్‌పై పునరాలోచన
- సీఎంవో బాట పట్టిన ఎంపీ మోపిదేవి
- అద్దంకిలో అధికార పార్టీని వీడుతున్న నేతలు
- రెండు రోజుల్లో కీలక నిర్ణయం దిశగా ముఖ్య నేత అడుగులు
- ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ మంత్రి ద్వారా రాయబారాలు

బాపట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీలో నియోజకవర్గ ఇన్‌చార్జిల మార్పు.. పార్టీని వీడతున్న, వీడనున్న నాయకులతో ఫ్యాను పార్టీలో పరిస్థితి కకావికలంగా మారుతోంది. జిల్లాలో నెలకొంటున్న పరిస్థితులతో వైసీపీ పెద్దలకు తలబొప్పి కడుతోంది. ఇన్‌చార్జిల మార్పు వ్యవహారం ఇంకా గందరగోళం సృష్టిస్తూనే ఉంది. రేపల్లె ఇన్‌చార్జిగా ఈవూరి గణేశ్‌ను నియమించినప్పటి నుంచి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు ఏదో ఒక రూపంలో పరోక్షంగా అసంతృప్తిని వెళ్లగక్కుతూనే ఉన్నారు. సంతమాగులూరు మండల వైసీపీ నేతలు టీడీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అద్దంకి నియోజకవర్గ వైసీపీలోని ఓ నేత రెండుమూడు రోజుల్లో టీడీపీ అధినేత చంద్రబాబును కలవనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

తననే కొనసాగించాలి..

మంగళవారం సీఎంవో బాట పట్టిన ఎంపీ మోపిదేవి రేపల్లెలో తననే ఇన్‌చార్జిగా నియమించాలని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై పార్టీ పెద్దలకు వివరించినట్లు సమాచారం. కానీ అధిష్ఠానం నుంచి సీటు విషయంలో నిర్దిష్టమైన హామీ దక్కలేదని తెలుస్తోంది.



మరో వైపు ఆయన అనుచరులు మాత్రం సీటు తమ నేత మోపిదేవికేనని, మార్పు చేయడానికే ఆయనను సీఎంవోకు పిలిపించారని ప్రచారం చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈవూరు గణేశ్‌ను కూడా తాడేపల్లికి పిలిపించుకుని మరోసారి చర్చించిన తర్వాత తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రంగంలోకి మాజీ మంత్రి...

వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, సంతమాగులూరు నేత అట్లా చినవెంకటరెడ్డి తనతో పాటు తొమ్మిది మంది ఎంపీటీసీలు, 12 మంది సర్పంచ్‌లతో టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం అద్దంకి ఎమ్మెల్యే రవిను జొన్నతాళిలోని క్యాంపు కార్యాలయంలో భేటీ అయిన సంగతి తెలిసిందే. దీంతో ఉలిక్కిపడ్డ వైసీపీ తొలుత సీఎంవోలోని కీలక వ్యక్తుల చేత బుజ్జగింపుల పర్వానికి తెరలేపింది. ఓదశలో చినవెంకట రెడ్డిపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. తొలినుంచి ఈయన ఉమ్మడి ప్రకాశం పరిధి లోని మాజీ మంత్రి అనుచరుడుగా కొనసాగు తూ వస్తున్నారు. పార్టీని వీడొద్దంటూ సీఎం బంధువు సూచన మేరకు సదరు మాజీ మంత్రి ద్వారా రాయబారం నడిపినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆయన మెత్తబడలేదని, రెండు మూడురోజుల్లో తన వర్గంతో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరడం ఖాయమని తెలుస్తోంది.

ఓ కీలక నేత సైతం..

మొన్నటి వరకు అద్దంకి వైసీపీకి పెద్దదిక్కుగా వ్యవహరించిన ఓ కీలక నేత ఆయన తండ్రితో కలిసి త్వరలో టీడీపీ అధినేత చంద్రబాబును కలవడానికి రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే తెరవెనక ఏర్పాట్లు జరిగిపోయాయయని సమాచారం. కాకపోతే ఉమ్మడి ప్రకాశం పరిధిలో తనకు సీటు ఇచ్చే విషయంలో హామీ ఇవ్వాలని ఆ నేతలు పట్టుబడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాన్ని సదరు నేత కూడా ఖండించకపోవడం గమనార్హం. ఆ తండ్రీ కొడుకులు కూడా వైసీపీని వీడితే అద్దంకిలో పాలకపార్టీ పరిస్థితి మరింత దిగజారడం ఖాయమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

అంతా అనిశ్చితే...

ఏ సీటులో ఏ రోజు ఎవరుంటారో తెలియని అనిశ్చితి ఒకవైపు పాలకపార్టీలో ఉంటే మరో వైపు టీడీపీలోకి క్యూ కట్టే నేతలు రోజురోజుకు పెరుగుతుండడంతో పార్టీ పెద్దలకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. దీనిలో భాగంగా పార్టీ మారే నేతలకు అవసరమైతే పెద్దమొత్తంలో తాయిలాల ఎర వేయడానికి కూడా వెనకాడొద్దని స్థానిక నేతలకు ఆదేశాలు ఇస్తున్నారనేది సమాచారం. అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న నేత పార్టీ మారాలనుకున్న నేతలకు పెద్దమొత్తంలో డబ్బు ఆఫర్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.


మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలినేని

ఇవే నా చివరి ఎన్నికలు

- మాగుంట సీటు విషయంలో చర్చలు
- వచ్చేనెల 10 లోపు పేదలకు పట్టాలు
- మాజీ మంత్రి బాలినేని వెల్లడి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గం నుంచే పోటీచేస్తున్నానని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ ఎన్నికలే తనకు చివరివన్నారు. ఈసారి మా అబ్బాయి పోటీ చేస్తారని పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి మంగళవారం సాయంత్రం ఒంగోలు వచ్చిన బాలినేనికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ రాత్రి 8.45కు చర్చి సెంటర్‌కు చేరుకుంది. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ పేదలందరికీ పట్టాలు ఇచ్చాక ఒంగోలు నుంచి పోటీ చేస్తానని లేకపోతే చేయనని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో వెంగముక్కలపాలెం, ఎస్.అగ్రహారం ప్రాంతాల్లో రైతుల నుంచి భూసేకరణ చేస్తున్నామన్నారు. అందుకోసం గతంలో రూ.30కోట్లు ఇవ్వగా ప్రస్తుతం రూ.180 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వచ్చేనెల 10వతేదీలోపు ఒంగోలులోని 25వేల మంది పేదలకు సీఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. గతంలో ఒంగోలు నుంచి ఎంపీగా మాగుంట, ఎమ్మెల్యేగా నేను పోటీచేస్తానని చెప్పినట్లు తెలిపారు. అయితే మాగుంట సీటు విషయంలో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె, నాయకులు పాల్గొన్నారు.

భూములిచ్చిన వారికి చుక్కలు

- ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో ఈసీలు, ఇతర పత్రాల పేరుతో వేధింపులు
- రెవెన్యూ సిబ్బంది ఓవరాక్షన్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు
- పట్టణ ప్రజలకు స్థలాలు ఇచ్చే వ్యవహారం

ఒంగోలు(విద్య), జనవరి 23 : ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో ఇళ్లు లేని పేదలకు స్థల పట్టాలు పంపిణీ చేసేందుకు భూములిచ్చిన రైతులకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది చుక్కలు చూపిస్తున్నారు. తాజాగా ఆ భూములకు సంబంధించి ఈసీలు, ఉమ్మడి కుటుంబాల్లో భూముల పంపిణీకి సంబంధించిన ఆఫిడవిట్లు తెమ్మని ఇబ్బందిపెడుతున్నారు. భర్తలు మరణించిన వితంతువులను సైతం తమకు ఆ ఆస్తి ఏలా వచ్చిందో ఆధారాలు చూపాలంటూ వెనక్కు పంపుతున్నారు. కార్యాలయ సిబ్బంది అతి వ్యవహారంతో కొత్త వివాదాలు వచ్చేటట్లు ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరం చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు చెందిన కొందరు రైతుల భూములను ఇప్పటికే అధికారులు ఇళ్లస్థలాల కోసం ఎంపిక చేసి తీసుకున్నారు. వారికి పరిహారం చెల్లించేందుకు జాబితాలో వారి పేర్లు లేకపోవడంతో పరిహారం అందుతుందో లేదోనన్న ఆందోళనకు బాధితులు గురవుతున్నారు. కొందరు రైతుల పెళ్లు గల్లంతయ్యాయని తెలుస్తోంది. మొత్తం మీద భూముల రికార్డుల పునఃపరిశీలన అంతా గందరగోళంగా మారింది. ఒంగోలు నగరంలోని ఇళ్లులేని పేదలకు పట్టాలు మంజూరుచేసేందుకు ఎస్.అగ్రహారం, మల్లేశ్వరపురం గ్రామాల్లో మొత్తం 209.49ఎకరాలను సేకరించారు. ఈ భూములకు పరిహారంగా రైతులకు రూ.210కోట్లు చెల్లించాల్సి ఉంది. గతేడాది మేలో రూ.30 కోట్లు చెల్లించారు. మిగిలిన రూ.180కోట్లు ప్రస్తుతం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కృషితో విడుదలయ్యాయి. అయితే ఈ నిధులను రైతుల ఖాతాలకు జమచేసేందుకు భూముల ఫైళ్ల పునఃపరిశీలన చేపట్టారు. ఎవరైనా భూములు అమ్ముకోవడం లేదా తాకట్టు పెట్టారా అన్న విషయం పరిశీలించారు. దీనికి ఎస్. అగ్రహారం, మల్లేశ్వరపురం గ్రామాలకు సంబంధించి రెండు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేశారు. మల్లేశ్వరానికి కేటాయించిన బృందం ప్రతి ఫైల్‌లో అడుగడుగునా అభ్యంతరాలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏమైనా ఫిర్యాదులు వచ్చినా, ఎవరైనా అభ్యంతరాలు తెలిపినా వారు రైతులకు ఆ భూములపై హక్కు ఎలా వచ్చిందో ప్రశ్నించవచ్చు. అయితే ఏ అభ్యంతరం లేకపోయినా ఈ బృందం అనుమానాలతో కొత్త వివాదాలు వస్తాయన్న ఆందోళన రైతులు వ్యక్తం చేస్తున్నారు. కాగా భూముల ఫైళ్ల పరిశీలనపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరు అనుమానాస్పదంగా ఉందంటున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పరిహారం వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

పార్టీ విజయానికి పాటుపడాలి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర
- కదులుతున్న వైసీపీ పునాదులు


తలకొండపాడు వాసులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఉగ్ర

కనిగిరి, జనవరి 23 : తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. డాక్టర్ ఉగ్ర క్యాంపు నివాసంలో మంగళవారం రాత్రి కనిగిరి మండలంలోని లింగారెడ్డిపల్లి కొత్తపల్లి గ్రామానికి చెందిన 15కుటుంబాలు కమతం వెంకటేశ్వర్లు, అమ్మిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నాగేంద్ర ఆధ్వర్యంలో వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. డాక్టర్ ఉగ్ర వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి తాను చేపట్టబోయే 5 అభివృద్ధి ప్రణాళికలను ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలన రావడం ఎంత ముఖ్యమో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వైసీపీ పాలనతో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సామాన్యుడు జగన్ రెడ్డి పాలనలో జీవించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. జగన్‌ను ఇంటికి సాగనంపాలన్నారు. పేద, మధ్యతరగతి వారి జీవనాన్ని వైసీపీ పాలకులు దుర్భరంగా మార్చారన్నారు. పేరుకే సంక్షేమ పథకాలని వాటి వల్ల వైసీపీ నాయకుల జేబులే నిండాయన్నారు. ఓ పక్క బటన్ నొక్కుతూ మరో పక్క ధరలు, చార్జీలను పెంచేశారని ఉగ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రజలు విజ్ఞతతో టీడీపీకి ఓటు వేసి చంద్రబాబును సీఎంగా చేసి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చుకోవాలని కోరారు. తనను గెలిపిస్తే కనిగిరి అభివృద్ధితో పాటు వలసన నివారించి ఉపాధి అవకాశాలు తీసుకువస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారపరెడ్డి (యడవల్లి), శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి పాల్గొనగా, భైరెడ్డి వెంకటేశ్వర్లు, పల్లా శ్రీనివాసులు, సంగటి వెంకటసుబ్బయ్య, రామ్మోహన్, కొండా మాలకొండయ్య, లక్ష్మీరెడ్డితో పాటు 15 కుటుంబాలు పార్టీలో చేరాయి.

టీడీపీలో చేరిన లక్ష్మక్కపల్లి, తలకొండపాడు వాసులు

కనిగిరి, జనవరి 23 : వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పీసీపల్లి మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు, తలకొండపాడు గ్రామంలోని దళితకాలనీకి చెందిన మరో 20 కుటుంబాలు మంగళవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఉగ్ర వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత విషయాలు మరచిపోయి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. నూతనంగా చేరిన వారు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు.

ఖరారైనట్లే..!

- టీడీపీలో కొలిక్కి వస్తున్న కసరత్తు
- తొలి జాబితాలో ఏడుగురు అభ్యర్థులకు అవకాశం
- జనసేనకు దర్శి ఖరారు
- ఆచితూచి అడుగులేస్తున్న అధిష్ఠానం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

టీడీపీ అధిష్ఠానం అభ్యర్థుల జాబితాపై కసరత్తును ముమ్మరం చేసింది. మంగళ, బుధవారాల్లో తొలి జాబితాపై స్పష్టతకు వచ్చే అవకాశం ఉంది. ఆ మేరకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. తదనుగుణంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి కొన్ని అంశాలపై తాజా సమాచారాన్ని కూడా మంగళవారం ఆయన సేకరించుకున్నారు. అందిన సమాచారం మేరకు.. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మిత్రపక్షమైన జనసేనకు దర్శి నియోజకవర్గాన్ని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన చోట్ల ఏడు స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకున్నారు. సిటింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న అద్దంకి, పర్చూరు, కొండపి నుంచి తిరిగి రవికుమార్, సాంబశివరావు, స్వామికి అవకాశం ఇవ్వబోతున్నారు. మాజీ ఎమ్మెల్యేల్లో ఒంగోలు నుంచి దామచర్ల జనార్దన్, కనిగిరి నుంచి ఉగ్ర, సంతనూతలపాడు నుంచి విజయ్‌కుమార్, అలాగే వైపాలెం నుంచి ఎరిక్షన్‌బాబు పేర్లను ఖరారు చేసినట్లు తెలిసింది. నాలుగైదు రోజుల్లో వచ్చే తొలి జాబితాల్లో ఈ ఏడు స్థానాల్లో అభ్యర్థుల పేర్లను ప్రకటించే అవకాశం ఉంది.

దర్శి కోసం ప్రముఖుల ప్రయత్నాలు

పొత్తులో భాగంగా దర్శి నుంచి జనసేనకు కేటాయించిన అభ్యర్థి ఎంపికపై ఆ పార్టీ కసరత్తు చేపట్టింది. ఇప్పటికే ఆ నియోజకవర్గంలో పనిచేస్తున్న గరికపాటి వెంకట్‌తోపాటు తాజా రాజకీయ పరిణామాల్లో మరికొన్ని పేర్లు పరిశీలనలోకి వచ్చినట్లు తెలిసింది. ఆ రెండు పార్టీల్లో ఏ పార్టీ నుంచైనా పోటీ చేయించే ఆలోచనతో గతంలోనే మౌమిత ఫౌండేషన్ చైర్మన్ బాదం మాధవరెడ్డి టీడీపీ అధినేతను కలిసి ఉన్నారు. తాజాగా అద్దంకి వైసీపీ మాజీ ఇన్‌చార్జి అయిన బాచిన కృష్ణచైతన్య కూడా ఆ వైపు దృష్టిసారించారు. ఆయన తండ్రి గరటయ్యతో రెండు పార్టీల్లో ఉన్న నేతలు టచ్‌లో ఉన్నట్లు సమాచారం. టీడీపీ అయితేనే పోటీచేసే ఆలోచనలో హర్షిణి రవికుమార్ ఉన్నందున ఆయన పేరు వెనక్కిపోయింది. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు సంబంధించిన కొందరు ఆ రెండు పార్టీల నేతలతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతానికి కృష్ణచైతన్య, వెంకట్, మాధవరెడ్డి పేర్లే ప్రముఖంగా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇంకోవైపు వైసీపీలో ఉన్న ఓ మాజీ మంత్రి వైపు నుంచి కొందరు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. తొలి జాబితాల్లోనే దర్శి జనసేన అభ్యర్థిని ప్రకటించే ఉద్దేశంతో ఉన్నందున బుధ, గురువారాల్లో ఈ ఎంపికపై ఒక నిర్ణయం జరగవచ్చని భావిస్తున్నారు.

రెండో జాబితాలో లోక్‌సభ అభ్యర్థులు

దర్శి జనసేనకు కేటాయించినందున గిద్దలూరు నుంచి మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి పార్టీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. అయితే గిద్దలూరు, మార్కాపురం, కందుకూరు, చీరాల అభ్యర్థులను రెండో జాబితాలో వెల్లడించాలన్న ఆలోచనలో ఉన్నారు. ఒంగోలు, బాపట్ల ఎంపీ అభ్యర్థులపై స్పష్టత రావాల్సి ఉంది. ఒంగోలు ఎంపీ మాగుంట టీడీపీలోకి వస్తే ఆయన కుమారుడు రాఘవరెడ్డికి ఎంపీ టికెట్ కోరుకునే అవకాశం ఉంది. అదే సమయంలో ఒంగోలు ఎంపీగా యాదవ సామాజికవర్గం అభ్యర్థికి అవకాశం ఇవ్వాలన్న ఆలోచనతో టీడీపీ కసరత్తు చేస్తోంది. టీడీపీ ఒంగోలు అధ్యక్షుడు నూకసాని బాలాజీతో పాటు కడప జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ కుమారుడి పేరును టీడీపీ పరిశీలిస్తోంది. బాపట్ల లోక్‌సభ నుంచి ఆరుగురు టీడీపీ టికెట్ ఆశిస్తూ పోటీపడుతున్నారు. అయితే దళితుల్లో ఏ వర్గం వారికి అవకాశం ఇవ్వాలన్న అంశంపై అధినాయకత్వం ఒక నిర్ణయానికి ఇంకా రాలేదని తెలుస్తోంది. తదనుగుణంగా రెండో జాబితాలో ఒంగోలు, బాపట్ల లోక్ సభ అభ్యర్థుల పేర్లు కూడా వెల్లడి కానున్నాయి.

అక్రమార్కులపై వేటుపడేనా..?

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిలో ఆందోళన

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23: వైద్య ఆరోగ్య శాఖలో 2020లో జరిగిన పోస్టుల భర్తీలో అవకతవకలకు పాల్పడిన అక్రమార్కులపై వేటుపడేనా? అన్న సందేహం వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యశాఖలో ఇష్టారీతిన నియామకాలు చేపట్టారనే ఆరోపణలు ఉన్నాయి. 2020లో కరోనాను సాకుగా చూపి నకిలీ సర్టిఫికెట్ల ద్వారా నియామకాలు చేపట్టారని ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ దినేష్‌కుమార్ సమగ్ర విచారణకు ఆదేశించారు. జడ్పీ సీఈఓ జాలిరెడ్డి నేతృత్వంలో ముగ్గురు అధికారుల బృందం 50రోజుల పాటు విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. అయితే ప్రధానంగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల్లోనే అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారనే విమర్శలు బహిర్గతం అవుతున్నాయి. అప్పట్లో పనిచేసిన అధికారులు, సిబ్బంది కలిసి ఇష్టారీతిన పోస్టుల భర్తీ చేపట్టడంతోనే ఈ పరిస్థితి వచ్చినట్లు తెలిసింది. నోటిఫికేషన్ జారీ నుంచి అభ్యర్థుల నియామక పత్రాలు ఇచ్చేవరకు జరిగిన ప్రక్రియలో అనేక అవకతవకలు జరిగినట్లు విచారణాధికారులు గుర్తించినట్లు తెలిసింది. అయితే ఈ విచారణ నివేదిక అనంతరం అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులపై వేటుపడుతుందా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు నకిలీ సర్టిపికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిని ఇప్పుడు తొలగిస్తారా? లేక అదేవిధంగా కొనసాగిస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

ఆసరాతో మహిళలకు ఆర్థిక తోడ్పాటు

మంత్రి ఆదిమూలపు సురేష్


చెక్కును అందజేస్తున్న మంత్రి సురేష్, వెంకాయమ్మ, కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 23: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రాష్ట్రప్రభుత్వం ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. సీఎం మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండలో ఆసరా నాల్గవ విడత నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంతో కూడిన పాలనను అందిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఆసరా నాల్గో విడతలో జిల్లాలో 36,769 స్వయ సహాయక సంఘాల్లోని 3,59,566మంది మహిళలకు రూ.280.10 కోట్లు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్, మంత్రి సురేష్ లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మేయర్ సుజాత, లింగంగుంట్ల రవిబాబు, మహబూబ్, విజయకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

- పలు ప్రాంతాల్లో కేక్ కటింగ్‌లు, ఇతర సేవా కార్యక్రమాలు
- ఉత్సాహంగా పాల్గొన్న టీడీపీ శ్రేణులు
- పలువురు ముఖ్యనేతలు హాజరు


కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పలు పట్టణాలు, మండల కేంద్రాలలో ఆ పార్టీశ్రేణులు ఈ సందర్భంగా భారీగా కేక్ కటింగ్‌లు ఏర్పాటు చేశారు. అలాగే రక్తదాన శిబిరాలు, అన్నదానం ఇతర పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో ఇంచుమించు ముఖ్యనేతలు అంతా పాల్గొన్నారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. కొండపి నియోజకవర్గంలోని కొండపి, టంగుటూరు, పొన్నలూరు, శింగరాయకొండ మండల కేంద్రాల్లో భారీగా కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించగా ఎమ్మెల్యే డాక్టర్ స్వామి, యువనేత దామచర్ల సత్యలు పాల్గొన్నారు. చీమకుర్తిలోని బధిరుల పాఠశాలలో జరిగిన లోకేష్ జన్మదిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నేతృత్వంలో కేక్ కటింగ్‌తో పాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. పెద్దారవీడులో జరిగిన వేడుకలలో అక్కడి ఇన్‌చార్జ్ ఎరిక్షన్ బాబుతో పాటు టీడీపీ లోక్‌సభ స్థానం అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు. పొదిలి మండలం కాటూరివారిపాలెంలో రక్తదాన శిబిరం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పాల్గొన్నారు. దర్శిలో జరిగిన వేడుకలలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ఇతర నేతలు పాల్గొన్నారు. పామూరు, మద్దిపాడు, బీపేట, వైపాలెం, పుల్లలచెరువు, దోర్నాల, దొనకొండ, ముండ్లమూరులతోపాటు మండల కేంద్రాలలోను లోకేష్ జన్మదిన వేడుకలను స్థానిక టీడీపీ నేతలు, శ్రేణులు ఘనంగా నిర్వహించారు.


కనిగిరిలో రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి : నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్, జననీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ శ్రేణులతోపాటు యువత పెద్ద సంఖ్యలో తరలి వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి డాక్టర్ ఎన్టీఆర్ ట్రస్ట్ జారీ చేసిన సర్టిఫికెట్లను, గొడుగులను పంపిణీ చేశారు.

అలుగులు ఆక్రమణ

- వందల కోట్ల విలువైన చెరువు భూములు అన్యాక్రాంతం
- అంతా వైసీపీ నేతల కనుసన్నల్లోనే మామూళ్ల మత్తులో అధికారులు


పెద్దచెరువు చిన్నచెరువు వాగును పూడ్చి నిర్మించిన కాంప్లెక్స్

పొదిలి, జనవరి 23: పొదిలి మండలంలో వందల కోట్ల విలువైన చెరువు భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. చివరకు ఎంతో కీలకమైన అలుగులు సైతం కబ్జాదారుల కోరల్లో ఆవిరవుతున్నాయి. ఇదంతా వైసీపీ నేతల కనుసన్నల్లోనే సాగుతోంది. స్థానికంగా కొందరి నాయకుల అండతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. పొదిలి పెద్దచెరువు, చిన్నచెరువు, తీగదుర్తిపాడు, తల్లమల్ల, రామాపురం గ్రామాల్లో ఐదు పెద్ద చెరువులు ఉన్నాయి. వాటితోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మరో 18 చిన్నచెరువులు ఉన్నాయి. వీటి లోపలి భాగం సామర్థ్యం సుమారు 983.48 ఎకరాలు. అయితే అందులో సగంపైనే అక్రమార్కుల చేతుల్లోకి పోగా 400 ఎకరాలు మాత్రమే మిగిలింది. సాగులోకి కొంత భూమి, అక్రమ నిర్మాణాల్లోకి మరికొంత భూమి వెళ్లిపోయింది. చిన్నచెరువు, పెద్దచెరువు కింద ఒకప్పుడు వందల ఎకరాల్లో పంటలు సాగు చేస్తూ ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండేది. ప్రస్తుతం చెరువుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అంతా అక్రమార్కుల పెత్తనం సాగుతోంది. కబ్జాదారులు దొంగ డాక్యుమెంట్లతో సుమారు 2,800 ఎకరాలకుపైగా అక్రఆక్రమించారు. ఎవరు ఆక్రమించి, అక్రమ కట్టడాలు చేస్తున్నా అడిగే అధికారే లేరు. లక్షల రూపాయల జీతం తీసుకుంటూ ప్రభుత్వ భూములు కాపాడాల్సిన బాధ్యతను అధికారులు మరిచారు. మామూళ్లకు కక్కుర్తిపడి చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో ఇటీవల భూ ఆక్రమణలు మరింత ఎక్కువయ్యాయి. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత చెరువులు, అలుగులు, వాగులు, వంకలు దేనిని వదలకుండా దొరికింది దొరికినట్లుగా ఆక్రమించి, నిర్మాణాలు చేస్తున్నారు. చివరకు పొదిలి పట్టణంలో ఉన్న రెండు ప్రధాన చెరువులతోపాటు, తోళ్ల మడుగువాగు, అలుగులు, సప్లయ్ చానల్స్‌తోపాటు రెండు చెరువులనూ అనుసంధానం చేసే ప్రధాన కాలువపై ఏకంగా కాంప్లెక్స్‌ను నిర్మించారు. చిన్నచెరువు విస్తీర్ణం 101.75 ఎకరాలు కాగా ఇప్పుడు చూడటానికి చెరువు కూడా లేని పరిస్థితి. కబ్జా చేసి కొందరు శాశ్వత నిర్మాణాలు చేపట్టగా, మరికొందరు పంట పొలాలుగా మార్చి సాగు చేసుకుంటున్నారు. పెద్దచెరువు 701.36 ఎకరాలుండగా అందులో 200 ఎకరాలకుపైగా ఆక్రమించి సాగు భూమిగా మార్చేశారు. మరో 100 ఎకరాలకుపైగా గృహ నిర్మాణాలు జరిగాయి. ఇంత విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నా ఇరిగేషన్ అధికారులు మా దృష్టికి రాలేదు.. వస్తే విచారించి చర్యలు తీసుకుంటామని సమాధానం చెప్పడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఆక్రమిత భూములను పరిశీలించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని స్థానికులు విమర్శిస్తున్నారు.

అడ్డూఅదుపు లేకుండా మట్టి తవ్వకాలు

వైసీపీ నాయకుల అండతో కొందరు పెద్దచెరువులో అడ్డూ అదుపు లేకుండా మట్టిని తవ్వుతున్నారు. రాత్రిపగలు తేడా లేకుండా యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. కొత్త వెంచర్ ఏర్పాటు చేసుకునే యజమానులకు పెద్దచెరువు అడ్డాగా మారితే.. అధికారులకు ఆదాయ వనరైంది. కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లను తరలిస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా మాకు అనుమతులు ఇచ్చారని వెంచర్ యజమానులు బహిరంగంగానే చెప్తున్నారు. ఇటీవల చెరువుమధ్యలో దర్శి నుంచి వచ్చిన మతబోధకుడు ఏకంగా ప్రార్థన మందిరాన్ని ఏర్పాటు చేశారు. అధికారులకు సమాచారమిస్తే చర్యలు తీసుకోకుండా తూతూమంత్రంగా పరిశీలించి వెళ్లారని స్థానికులు చెప్తున్నారు.

ఫిర్యాదులపై విచారణ శూన్యం

పట్టణంలో జరుగుతున్న చెరువుల ఆక్రమణలపై నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు విచారణ చేపట్టడం లేదు. ఈ విషయమై ఉన్నతాధికారులు సీరియస్‌గా హెచ్చరించినా స్థానిక అధికారులు నాలుగురోజులు హడావుడి చేసి చేతులు దులుపుకొంటున్నారు. అందినకాడికి ముడుపులు అందుకొని తూతూమంత్రంగా ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నారు. ఏడాదికి రెండుసార్లు చెరువులను సర్వే చేయిస్తున్నామని చెబుతున్న అధికారులు దాని లెక్కను తేల్చడం లేదు. వందలకోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా ఉన్నతాధికారులు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోలేదంటే అధికారుల చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థమవుతోంది. ఇరిగేషన్ అధికారులను అడిగితే రెవెన్యూపై, రెవెన్యూ వారు ఇరిగేషన్ అధికారులపై చెప్పుకుంటున్నారు. దీంతో ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. ఇప్పటికైనా ఆక్రమణకు గురైన చెరువులు, భూములను గుర్తించి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇరిగేషన్ అధికారులకు ఎప్పుడు ఫోన్ చేసినా అందుబాటులో ఉండడం లేదు.


ఆక్రమిత స్థలంలో నిర్మిస్తున్న చర్చి


చిన్నచెరువులో వెలసిన అక్రమ నిర్మాణాలు

సమ్మెకు దిగిన వైకేపీ ఉద్యోగులు

ప్రగతిభవన్ ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న వైకేపీ ఉద్యోగులు

ఒంగోలు నగరం, జనవరి 23: డిమాండ్ల సాధన కోసం వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులు మంగళవారం నుంచి సమ్మెకు దిగారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆందోళనకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సెర్ప్ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఉన్న వైకేపీ ఉద్యోగులు 250 మంది సమ్మెలో పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రగతి భవనం ఎదుట వైకేపీ ఉద్యోగులు మంగళవారం విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వారికి ప్రమోషన్లు కల్పించాలని, పేస్కేలు అమలు చేయాలని, ఈపీఎఫ్‌పై సీలింగ్ తీసేసి మూలవేతనంపై నూరుశాతం ఈపీఎఫ్ ఇవ్వాలనే డిమాండ్‌తో సమ్మెలోకి వెళ్లారు. ధర్నాలో సెర్ప్ ఉద్యోగుల జేఏసీ నాయకులు నరేంద్ర తదితరులు మాట్లాడుతూ నవరత్నాల పథకాలను అమలు చేస్తోంది సెర్ప్ ఉద్యోగులేనన్నారు. హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు వర్తింపజేస్తూ అర్హులకు ప్రమోషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు జరపాలని కోరారు. ధర్నాలో జేఏసీ నాయకులు ఎజ్రా, క్రిష్ణ, గోపీనాథ్, నారాయణ, కత్తి కళ్యాణ్, డేవిడ్, కృపారావు, సుధాకర్. నరసింహారావు, సుబ్బారావు పాల్గొన్నారు.


రాజకీయపార్టీల నేతలతో మాట్లాడుతున్న ఈఆర్‌వో వెంకటనారాయణ

అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తాం

» ఈఆర్‌వో వెంకటనారాయణ

పర్చూరు, జనవరి 23: అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామని పర్చూరు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి(ఈఆర్‌వో) వెంకటనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా మండలాల రాజకీయపార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఆర్‌వో మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితాను ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలోని 295 పోలింగ్ బూత్‌లకు సంబంధించి రాజకీయపార్టీల నేతలకు అందజేసినట్టు చెప్పారు. ఫాం 6, ఫాం 7, ఫాం 8కు సంబంధించి జనవరి 5, 2024 తరువాత వచ్చిన 1074 దరఖాస్తులను విచారణ చేపడతామన్నారు. ఓటర్ల తొలగింపునకు సంబంధించి ఫాం 7 ద్వారా తప్పుడు దరఖాస్తు పెట్టిన 55 మందిపై చార్జీషీట్ దాఖలు చేసినట్టు చెప్పారు. ఈసందర్భంగా టీడీపీ యద్దనపూడి మండల అధ్యక్షుడు రంగయ్య చౌదరి మాట్లాడుతూ 22మంది పేర్లు మాత్రమే చార్జీషీట్ దాఖలు చేసినట్లు వచ్చాయని, మిగిలిన 33 మంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పోలింగ్ బూత్‌ల వారీగా పూర్తిస్థాయి వివరాలు సేకరించి జిల్లా ఎస్పీకి అందజేసి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆయా మండ లాల తహసీల్దార్‌లు సంధ్యశ్రీ, వెంకటరత్నం, సుజాత, బ్రహ్మయ్య, రవికుమార్, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఏలూరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నేతలు


ఎమ్మెల్యే ఏలూరికి శుభాకాంక్షలు తెలుపుతున్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, తదితరులు

మార్టూరు, జనవరి 23: టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పుట్టినరోజు ఈనెల 26వతేదీ కాగా, ముందస్తుగా పలువురు నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఏలూరికి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చేత కేక్ కట్ చేయించారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ క్యాంపు కార్యాలయానికి వచ్చి ఏలూరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు ఉప్పుటూరి రమాదేవి ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఏలూరితో కేక్ కట్ చేయించి శుభా కాంక్షలు తెలిపారు. మంగళవారం రాత్రికి ఏలూరి హైదరాబాదు వెళ్లిపోయారు.

యద్దనపూడి మండలం పోలూరి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పర్యటించారు. పార్టీ నాయకుడు రావిపాటి సీతయ్య ఇంటికి వెళ్లారు. గ్రామంలోని పలువురితో మాట్లాడారు. అనంతరం మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాకానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రవికుమార్


కాకాని హనుమంతరావు మృతదేహనికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, జనవరి 23: వ్యాపారవేత్త, టీడీపీ నాయకుడు కాకాని హనుమంతరావు(74) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలోని కాకానిపాలెంకు చెందిన ఆయన సుమారు 50 సంవత్సరాలుగా వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు అశోక్ టీడీపీ నేతగా, క్లష్టర్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. సోమవారం రాత్రి కూడా కాకానిపాలెం లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న హనుమంతరావు మంగళవారం ఉదయం గుండెనొప్పి రావటంతో హుటాహుటీన ఒంగోలు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హనుమంతరావు మృతదేహం వద్ద ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

పంగులూరు మండలం కొండమంజులూరుకు చెందిన చొప్పరపు మోజేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో ఉంచగా ఎమ్మెల్యే రవికుమార్ మంగళవారం సాయంత్రం నివాళులర్పించారు. పట్టణంలోని శ్రీనగర్‌లో ప్రముఖ మహిళాన్యాయవాది ఫణీంద్రాదేవి ఇటీవల మృతి చెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు.

డిపో అధికారులు మొండివైఖరి విడనాడాలి

అద్దంకిటౌన్, జనవరి 23: ఆర్టీసీ డిపో డీఎం, అసిస్టెంట్ డీఎంలు మొండి వైఖరి మానుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ పి.చిరంజీవి అన్నారు. కార్మికుల పట్ల డిపో అధికారులు నిర్లక్ష్యవైఖరికి నిరసనగా ఎంప్లాయీస్ యూనియన్ అధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి 3వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో సర్వీసులను ఇష్టం వచ్చినట్లు రద్దు చేస్తున్నారన్నారు. కనీసం కార్మికులకు మంచినీటి వసతిని కల్పించలేకపోయరన్నారు. ఆ రోగ్యం బాగాలేని కార్మికులకు సెలవులు ఇవ్వకపోగా వారికి ఆప్‌సెంట్‌లు వేసి అక్రమంగా చార్జీషీట్లు ఇస్తున్నారన్నారు.

ఈ దీక్షలలో కేజీ రావు, ఎస్‌కే ఎండీ రఫీ, ఎం.వెంకటేశ్వర్లు, కె.కొండలు పాల్గొనగా, మహిళా ఉద్యోగులు, గ్యారేజీ కార్మికులు సంఘీభావం తెలిపారు.

ఆగిఉన్న కారును ఢీకొన్న బైక్

మేదరమెట్ల, జనవరి 23: మేదరమెట్ల బైపాస్‌లో ఆగి ఉన్న కారును మోటార్‌సైకిల్ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. మంగళవారం మేదరమెట్ల నుంచి గుంటూరువైపు వెళ్లే మార్గంలో పైలాన్ వద్ద ఆగి ఉన్న కారును అదేమార్గంలో వెళుతున్న బైక్ వేగంగా వచ్చి అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా పామూరు మండలం బోడవాడకు చెందిన రావి వెంకటేశ్వర్లుకు స్వల్పగాయాలయ్యా యి. క్షతగాత్రున్ని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దంకిలో రియల్ ధమాల్

» టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్న సర్వేలతో రాజధాని వైపు వ్యాపారుల పరుగులు

» వైసీపీ సానుభూతిపరులైన వ్యాపారులు సైతం కొనుగోళ్లు

అద్దంకి, జనవరి 23: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందన్న సర్వేలతో అద్దంకి ప్రాంత రియల్ ఎస్టేట్ వ్యాపారులు రాజధాని వైపు పరుగులు తీస్తున్నారు. దీంతో అద్దంకి లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడకేసింది. అద్దంకి ప్రాంత రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెండు తెలుగు రాష్ట్రాలలో అన్ని ప్రాంతాలలో స్థలాల వ్యాపారం చేస్తుంటారు. స్థలాల ధరలు ఎక్కడ పెరిగే అవకాశం ఉంటే అద్దంకి ప్రాంత రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్కడ వాలిపోతుంటారు.

ఈక్రమంలో వచ్చే సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాబోతుందన్న అంచనాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు విజయవాడ-గుంటూరు మధ్య, రాజధాని ప్రాంత గ్రామాలలో తిరిగి స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు లాభాల బాటలోకి వెళ్ళటంతో మరికొంత మంది కూడా వెళ్ళివస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే గుంటూరు, విజయవాడ, రాజధాని ప్రాంతాలు పూర్వవైభవం వైపు అడుగులు పడతాయన్న అంచనాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొండంత ఆశతో ఉన్నారు. వైసీపీ సానుభూతిపరులుగా ఉన్న పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం రాజధాని ప్రాంతంలో కొనుగోళ్లు చేసేందుకు పరుగులు తీయటం అద్దంకి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

రాజధాని ప్రాంతంలో స్థలాల ధరలు సంక్రాంతి నాటికి మరింత ధరలు పెరిగే అవకాశం ఉందన్న అంచనాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇప్పటికే కొనుగోలు చేసి అమ్మకాలకు సిద్ధం అయ్యారు. ఎన్నికలు సమీపించే కొద్ది రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న అంచనాలతో అద్దంకి ప్రాంత రియల్ ఎస్టేట్ వ్యాపారులు సొమ్ము చేసుకునేందుకు పరుగులు తీస్తున్నారు. దీంతో అద్దంకిలో గత ఏడాదిగా అంతంత మాత్రంగా స్థలాల ధరలు ఉండగా రియల్ వ్యాపారులు మొత్తం రాజదానివైపు పరుగులు తీస్తుండటంతో అద్దంకిలో రియల్ వ్యాపారం పూర్తిగా నిలిచిపోయింది.

ఘనంగా లోకేష్ జన్మదినం


చీరాల: భోజనం వడ్డిస్తున్న కొండయ్య తదితరులు

చీరాల, జనవరి 22: టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం బీసీ సెల్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన లోకేష్ జన్మదిన వేడుకల్లో కొండయ్య పాల్గొన్నారు. మధ్యాహ్నం వేటపాలెంలో సీనియర్ నాయకుడు సజ్జా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన లోకేష్ జన్మదిన వేడుకల్లో కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు భోజనాలు ఏర్పాటు చేశారు. దేశాయిపేట, చీరాల మహిళా మండలి వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు భోజన సదుపాయం కల్పించారు. సాయంత్రం మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా సందర్భాల్లో కొండయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, సజ్జా వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఆయా కార్యక్రమాలో నాయకులు ఎం. గౌరీ అమర్‌నాథ్, నాశిక వీరభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ చినగంజాం గ్రామ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నాయకులు బెల్లంకొండ రమేష్‌బాబు, పర్వతరెడ్డి మోహన్‌రావు కేకు కట్ చేశారు.

కార్యక్రమంలో చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు, సందు శ్రీనివాసరావు, అజాద్, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, షేక్ జిలాని, తదితరలు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

» కోరం లేక గంట ఆలస్యంగా ప్రారంభం

» గంటన్నరకే ముగిసిన వైనం


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం

బల్లికురవ, జనవరి 23: మూడు మాసాలకు ఒకసారి గ్రామాలలో నెలకొన్న సమస్యలు వాటి పరిష్కారంపై సమీక్షతో చేపట్టాల్సిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. బల్లికురవ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఉదయం 11 గంటలకు సమావేశమని అజెండాలో పేర్కొన్నారు. మెత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను అయిదుగురే సమావేశానికి రావటంతో కోరం కావటానికి కొంత అలస్యం కావటంతో 12 గంటలకు ప్రారంభించారు. గంటన్నర సమయంలో ఎలాంటి సమీక్షలు చేపట్టకుండానే అధికారులు శాఖల వారీగా ప్రభుత్వ పథకాలు, వాటికి వెచ్చించిన నిధులు వ్యయంపై చదువుకుంటు పోయారు. అర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ జేఈ అయితే మండలంలో అన్ని రక్షిత పథకాలు వినియెగంలో ఉన్నాయని సీపీడబ్ల్యూ స్కీంలు అన్నీ పని చేస్తున్నాయని సమావేశంలో చదవి వెళ్లిపోతుండగా, వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి మా గ్రామానికి నీరు రావటం లేదని ట్యాంకు పనిచేయటం లేదని ఫిర్యాదు చేయటం కొసమెరుపు.

అలాగే, సమావేశానికి పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కూడా గైర్హాజరయ్యారు. ఈసందర్భంగా మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తిచేసేలా అందరూ కృషి చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ శాఖ ఏవో కుమారి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు వెంటనే ఈపంట నమోదు చేయించుకోవాలని కోరారు. ఎంఈవో రమేష్ మాట్లాడుతూ రానున్న పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ చింతల అంజలి, ఎంపీడీవో బ్రహ్మయ్య, తహసీల్దార్ కె.రవిబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ శ్రీనువలి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ఎస్సీల అభ్యున్నతి

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

» 40 కుటుంబాలు పార్టీలో చేరిక


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన పర్చూరు ఎస్టీ కాలనీ వాసులు

పర్చూరు, జనవరి 23: తెలుగుదేశం పార్టీతోనే ఎస్టీల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఎస్టీల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో పర్చూరు ఇందిరా కాలనీకి చెందిన 40 ఎస్టీ కుటుంబాలు ఏలూరి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలుకప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఎస్టీలు పార్టీకి వెన్నుముఖగా ఉన్నారన్నారు. ఎస్టీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. ఎస్టీల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌కు సంబంధించిన మేనిఫెస్టోను రూపొందిస్తుందన్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో అర్హులైన ఎస్టీ లందరికీ పక్కా ఇళ్ళు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడతానన్నారు. ఎస్టీల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రానున్న తెలుగు దేశం ప్రభుత్వం పని చేస్తుందని భరోసా వ్యక్తం చేశారు.

వలంటీర్లు చేరిక..


ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో పర్చూరుకు చెందిన ముగ్గురు వలంటీర్లు దామచర్ల నాగరాజు, మూకిరి కోటేశ్వరరావు, కంభం రాజు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మరో 35 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. దామచర్ల లింగేశ్వరరావు, రావూరి నాగరాజు, రావూరి రామాంజనేయులు, ఏకశిరి కలగయ్య, రావూరి ఏడుకొండలు, పాలపర్తి కోటేశ్వరరావులతోపాటు పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, మామిడిపాక హరిప్రసాద్, టి.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, జనవరి 23: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యాభివృద్ధి చెందాలని కడవకుదురు సర్పంచ్ గొల్లమూరి శివకుమారి అన్నారు. కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను ఆమె మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కుర్రా రామారావు అధ్యక్షతన జరిగిన సభలో శివకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు డిజిటల్ చదువులు అందించాలన్న సంకల్పంతో విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జీవీ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు కె.రామారావు, శ్రీనివాస్, ప్రసాద్, శివయ్య, త్రిపురాంతకరావు, హెలన్ రూత్, జరీనాతాజ్, కవిత, సంపతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నైతిక విలువలు లేని రాజకీయాలు చేయొద్దు!

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ


కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సన్మానించిన రామకృష్ణ, ఏలూరి సాంబశివరావు, మంతెన అనంతవర్మ తదితరులు

పిట్టలవానిపాలెం, జనవరి 23: రాజకీయాలలో నైతిక విలువలు లేని ప్రజలకు ఉపయోగపడని రాజకీయాలు చేయకూడదనేది సీపీఐ లక్ష్యమని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మండలపరిధిలోని సంగుపాలెం, కోడూరు గ్రామపంచాయతీలలో మంగళవారం జరిగిన గ్రామ వాసి, తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సన్మాన సభ ఏర్పాటుచేశారు. సభలో సంగుపాలెం, కోడూరు గ్రామాల ప్రజలు, కుటుంబ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారిగా ఉండే రాజకీయాలను చేయాలే తప్ప ప్రజలను ఇబ్బందిపెట్టే రాజకీయాలు చేయరాదన్నారు. ప్రస్తుత రాజకీయాలు రాష్ట్రంలో భ్రష్టుపట్టిపోయాయని విమర్శించారు. సంగుపాలెం కోడూరు గ్రామం నుంచి వెళ్ళిన తనను తెలంగాణ రాష్ట్రంలో కొత్తగూడెం ఎమ్మెల్యేగా ప్రజలు రెండు పర్యాయాలు ఆదరించి గెలిపించారని సన్మానగ్రహీత కూనంనేని సాంబశివరావు తెలిపారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను రాజకీయభిక్ష పెట్టిన పార్టీని గ్రామ ప్రజలను ఎప్పుడూ మరిచిపోకూడదని అన్నారు. టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ రాజకీయనాయకులు వస్తూ పోతుంటారు కాని నిజాయితీ, నిబద్ధతతో కూడిన రాజకీయాలలో కూనంనేని సాంబశివరావు ఒకరని కొనియాడారు.సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ కుగ్రామమైన సంగుపాలెం కోడూరు నుంచి 40ఏళ్ళ క్రితం వెళ్లి తెలం గాణ రాష్ట్రంలోని కొత్తగూడెంలో స్థిరపడి సీపీఐలో కీలక పదవులు అలంకరించి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలవటం నిబద్ధతతో కూడిన విజయమని ఆకాంక్షించారు. టీడీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలు ప్రలోభాలకు ఆకర్షితులై నీతి నిజాయితీ కలిగిన నాయకులను ప్రజలు దూరం చేసుకుంటున్నారని అలాంటి సంస్కృతి మారాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు మాట్లాడుతూ ఈ గ్రామంతో కూనంనేని సాంబశివరావుతో, తనకు అనేక సత్సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. సీపీఐ నాయకుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ లాభాపేక్ష ఆశించని పార్టీ ఏదైన ఉందంటే సీపీఐ ఒక్కటేనని తెలిపారు. ఈ సందర్భంగా సినీగాయకులు వందేమాతరం శ్రీనివాస రావు గీతాలాపన గావించారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు ముప్పా రమేష్, సంగుపాలెంకోడూరు గ్రామపంచాయతీల సర్పంచ్‌లు ఎనికేపల్లి శివకుమారి, ఐనంపూడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంపూర్ణ వైద్యం అందించడమే లక్ష్యం

చినగంజాం, జనవరి 23: ప్రతి కుటుంబానికి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం అందించటమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి సీహెచ్ హనుమంతరావు అన్నారు. మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామ సచివాలయ ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పి.సాయిశ్రీ చరణ్, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ షేక్ హసీనాబేగం, డాక్టర్ లక్ష్మీనారాయణ 417 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరకొండ భూలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి, ఇన్‌చార్జ్ గ్రామ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్య శాల రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం పూర్తిచేసేందుకు సహకరిస్తాం


భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల, జనవరి 22: స్థానిక కోర్టు భవనాల ప్రాంగణంలో అసంపూర్తిగా నిలిచిన బార్ అసోసియేషన్ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి బార్ అసోసియేషన్ ప్రతినిధులు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. భవన నిర్మాణం పూర్తిచేసేందుకు తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. భవన నిర్మాణం పూర్తిచేసేందుకు చేపట్టాల్సిన చర్యలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఏసయ్య, ఏఈ రవి, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చినగంజాంలో షటిల్ టోర్నమెంట్

చినగంజాం, జనవరి 23: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రిపబ్లిక్ డే సందర్భంగా చినగంజాం బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25, 26 తేదీల్లో చినగంజాం, ఇంకొల్లు, మార్టూరు, వేటపాలెం, నాగులుప్పలపాడు మండలాల స్థాయిలో షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 7659896941, 8519944336 సెల్ నెంబర్లను సంప్రదించాలని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఏలూరి

మార్టూరు, జనవరి 23: రజక వృత్తిదారులకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారికి అండగా నిలిచింది తెలుగుదేశం ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో మంగళవారం రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పోలూరి సింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైలు కిందపడి వ్యక్తి మృతి

ఉప్పుటూరు(పర్చూరు), జనవరి 23: ప్రమాదవశాత్తు రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చీరాల రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామానికి చెందిన బోయిన శివరామకృష్ణ(40) మరో వ్యక్తితో కలసి నెల్లూరు వెళ్ళేందుకు చీరాల రైల్వేస్టేషన్ చేరుకున్నారు. ఈక్రమంలో మూత్ర విసర్జనకు వెళ్ళి ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రూ.10 లక్షల నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదుతో జీఆర్‌పీ పోలీసులు

చీరాల, టౌన్ 23: అక్రమంగా తరలిస్తున్న రూ.10 లక్షల నగదును చీరాల జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీలో శబరి ఎక్స్‌ప్రెస్‌లో ఓ వ్యక్తి బ్యాగ్‌తో రైలు నుంచి దిగగా అనుమానంతో తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకపోవటంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని నగదును స్వాధీనం చేసుకున్నట్టు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు, పత్రాలు లేకపోవటంతో ఆదాయశాఖ అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

నెరవేరని నేతబజారు లక్ష్యం

చీరాల, జనవరి 23: స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా నిర్మించిన నేతబజారు లక్ష్యానికి ఆమడదూరంలో ఉంది. చేనేత సహకార సంఘాలలో తయారైన వస్త్రాలను విక్రయించేందుకు వీలుగా నేతబజారు దుకాణ సముదాయాన్ని నిర్మించారు. అందులో సగానికి పైగా దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో లక్ష్యం నెరవేరటం లేదు.


చీరాల ప్రాంతంలో చేనేత సహకారసంఘాలు ఎక్కువ. క్షేత్రస్థాయిలో పనిచేసేవి, కాగితాల మీద మాత్రమే కనిపించేవి సుమారు 30 సంఘాలకు పైగా ఉంటాయి. అందులోని మగ్గాలపై నేసిన వస్త్రాలు ఆప్కోతో పాటు నేరుగా విక్రయాలు జరుపుకునేందుకు నేతబజారులో దుకాణాల నిర్మాణం జరిగింది. 16 గదులతో నిర్మాణం చేశారు. ఒక్కో సంఘానికి ఒక్కో దుకాణం కేటాయించి నేరుగా కొనుగోలుదారులతో మమేకం అయ్యేందుకు ఈ దుకాణాలు దోహదపడతాయనేది అప్పటి పాలకుల ఆలోచన. అయితే దుకాణాల కేటాయింపులో ఆదిలోనే హంసపాదు అన్నట్లు అనర్హులకు కేటాయించారని ఆరోపణలు వచ్చాయి. అది నిజమని తేలటంతో అలా కేటాయించిన ఓ దుకాణాన్ని తరువాత లీజు రద్దుచేశారు. ఆ తరువాత దుకాణాలు కొంతకాలం నిర్వాహకులు సక్రమంగానే నిర్వహించారు. అయితే, నేతబజారుకు కూతవేటు దూరంలో ఎంజీసీ మార్కెట్, ఆర్‌ఆర్ రోడ్డు, కామధేను కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లోని వస్త్ర దుకాణాల పోటీకీ నేత బజారులో వ్యాపారాలు పోటీపడలేపోయాయి. దీంతో దుకాణాల్లో కొన్ని ఖాళీగా ఉంటున్నాయి. నేతబజారు పైఅంతస్థులో ఉన్న పలు గదులను ఏడీ కార్యాలయం కింద ఉపయోగిస్తున్నారు. పవర్‌లూమ్ వస్త్రాలు చేనేత వస్త్రాలుగా చెలామణి అవుతున్నాయి. దీంతో చేనేత వస్త్రాలకు గిరాకీ తగ్గుతోంది. ఈనేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి నేతబజారు లక్ష్యం నెరవేరేలా తగిన చర్యలు చేపట్టాలని చేనేతరంగ ప్రతినిధులు కోరుతున్నారు.

ఏఐసీటీఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఒంగోలు(విద్య), జనవరి 23: ఇంజనీరింగ్ కళాశాలల్లో బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులను విలీనం చేస్తూ అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.గుండారెడ్డి డిమాండ్ చేశారు. అసోసియేషన్ పిలుపు మేరకు ప్రైవేటు కళాశాలల యాజామాన్యాలు మంగళవారం ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి తేవడం చారిత్రక తప్పిదమన్నారు. అనంతరం వైస్‌చాన్స్‌లర్ అంజిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

27న జాబ్‌మేళా

ఒంగోలు నగరం, జనవరి 23: ఒంగోలులోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 27న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి టి.భరద్వాజ్ తెలి పారు. జియో టెలికామ్ సంస్థలోని ఉద్యోగ ఖాళీల భర్తీకి ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సేల్స్ ఆఫీసర్, జియో ఫైబర్ ఇంజనీర్, ఫైబర్ అసోసియేట్, జియో పాయింట్ మేనేజర్, జియో పాయింట్ అసిస్టెంట్ మేనేజర్, ఫీల్డు ఇంజనీర్ తదితర ఖాళీల భర్తీకి ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్, డిగ్రీ, గ్రాడ్యుయేషన్, ఐటీఐ, డిప్లమా పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు.



ముగ్గురు ఎస్‌ఐలకు ఉద్యోగోన్నతి

నెల్లూరు(క్రైం): గుంటూరు రేంజ్ పరిధిలో పలువురు ఎస్‌ఐలకు సీఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఐజీ పాలరాజు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ షేక్ సుభానీ, ఇటీవల బాపట్ల జిల్లాకు బదిలీపై వెళ్లిన సీహెచ్ కృష్ణానందం, ట్రాన్స్‌కోలో విధులు నిర్వహిస్తున్న కే సాంబశివరావు ప్రమోషన్ పొందారు.


సెబ్ ఏఈఎస్ బదిలీ


రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరోలో పలువురు ఏఈఎస్‌లను బదిలీ చేస్తూ కమిషనర్ రవిప్రకాష్ ఉత్తర్వులు జారీచేశారు. నెల్లూరు ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి గుంటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

యువతే కీలకం!

నే'తల'రాతను మార్చేది వారే..

త్వరలో జరగనున్న ఎన్నికల కురుక్షేత్రంలో విజేతలెవరో, పరాజితులెవరో ఈసారి యువతే నిర్ణయించనుంది. జిల్లా మొత్తం ఓటర్లలో యువకుల ఓట్లే అత్యధికంగా ఉండటంతో నాయకుల తలరాతలు యువ ఓటర్ల అభిప్రాయంపైనే ఆధారపడి ఉంది. తుది ఓటర్ల జాబితా గణాంకాల ప్రకారం జిల్లా మొత్తం ఓటర్లలో 18 నుంచి 39 ఏళ్లలోపు ఉన్న ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. 44.11 శాతం ఓటర్లతో ఎన్నికల ఫలితాలను దిశానిర్దేశం చేసే స్థాయిలో యువతరం ఉండటం విశేషం. ఓటర్ల బలంలో మధ్య వయస్కులు తరువాత స్థానంలో ఉన్నారు. 50 నుంచి 69 సంవత్సరాల మధ్య వయస్కులు 38.93 శాతం ఉన్నారు. వృద్ధుల భాగస్వామ్యం 16.96 శాతం. జిల్లా ఓటర్లను యువతరం, నడివయస్కులు, వృద్ధులు అనే మూడు కేటగిరీలుగా విభజిస్తే సార్వత్రిక ఎన్నికల్లో యువతరం పాత్రే కీలకంగా కనిపిస్తోంది. వీరి మద్దతును ఏ పార్టీ కూడగట్టుకుంటుందో ఆ పార్టీ అభ్యర్థులకే విజయావకాశాలు ఎక్కువగా ఉండే అవకాశం కనిపిస్తోంది.





ఎన్నికల్లో జయాపజయాలను నిర్ణయించడంలో యువతరం పాత్రేకీలకం. 18 నుంచి 39 ఏళ్ల మధ్య వయస్కుల్లో ఆవేశం, ఉత్సాహం ఎక్కువ పాళ్లలోనే ఉంటాయి. వీరిలో సమాజ పరిస్థితుల పట్ల స్పందించే గుణం ఎక్కువగా ఉంటుంది. పోలింగ్ రోజు వీరి ఓటింగ్ శాతం అత్యధికంగా ఉంటుంది. ఓటర్లను చైతన్యం చేయడంలోనూ వీరి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా అధికార పార్టీ పరిపాలన తీరుతెన్నుల ఆధారంగానే ఓటు ఎవరికి వేయాలి అనే విషయాన్ని వీరు నిర్ణయించుకుంటారు. ఐదేళ్లు పాలించిన అధికార పార్టీ యువతకు చూపిన ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చేసిన కృషి, సమాజంలోని సగటు మనిషికి లభిస్తున్న శాంతి భద్రతలు.. ఇవన్నీ యువతరం ఓటుపై ప్రభావం చూపుతాయి. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంలోనూ యువత ప్రధానంగా ఈ అంశాలకే ప్రాధాన్యం ఇచ్చింది. యువతరం ఆలోచన తీరు ఎలా ఉంటుంది, ఏ అంశాలను ప్రామాణికంగా తీసుకొని ఓటు వేయబోతున్నారన్న విషయమే రానున్న ఎన్నికల ఫలితాల్లో అత్యంత కీలకంగా మారనుంది.

● ఓటర్లలో యువ రక్తమే అధికం

తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లా మొత్తం ఓటర్ల సంఖ్య 19,08,794. పురుష ఓటర్లు 9,35,195, మహిళా ఓటర్లు 9,73,089 మంది, ఇతరులు 214 మంది ఉన్నారు. ఇందులో యువ ఓటర్ల శాతం 44.11 మంది ఉన్నారు. 18 నుంచి 39 సంవత్సరాల మధ్య 8,42,066 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 18-19 సంవత్సరాల వయసు కలిగిన వారు 36,175 మంది ఉన్నారు. మొత్తం జనాభాలో వీరి శాతం 1.89. వీరంతా దాదాపుగా కొత్త ఓటర్లు. తొలిసారిగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ఓటు వేయబోతున్నారు. ఇక 20-29 ఏళ్ల వయసులో 3,12,440 మంది ఓటర్లు (16.37 శాతం) ఉన్నారు. 30-39 ఏళ్ల వయసు కలిగిన వారు 4,93,451 మంది (25.85 శాతం) ఉన్నారు.

● వృద్ధుల శాతం 16.96

మొత్తం ఓటర్లలో వృద్ధుల ఓట్ల సంఖ్య కీలకంగానే కనిపిస్తోంది. 60 నుంచి 89 ఏళ్ల కేటగిరీలో మొత్తం 3,22,680 ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో వీరు 16.93 శాతం మంది ఉన్నారు. 60-69 ఏళ్ల మధ్య 1,96,829 మంది (10.31 శాతం), 70-79 మధ్య 97,004 (5.08 శా తం), 80-89 మధ్య 28,849 (1.57) శాతం మంది ఓటర్లు ఉన్నారు. కుటుంబ బాధ్యత నిర్వర్తించే ఇంటి పెద్దల ఆదేశాలు, ప్రభుత్వాలు అందించే సామాజిక పింఛన్లు, విశ్రాంత ఉద్యోగుల విషయంలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఈ వర్గం ఓటర్లపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది.

నడివయస్కుల ఓట్లు 38.93 శాతం

40 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్కులు మొత్తం ఓటర్లలో 38.93 శాతం మంది ఉన్నారు. మొత్తం ఓటర్లు 19,08 లక్షల పైచిలుకు ఉండగా అందులో నడివయస్కులు 7,43,160 మంది ఉన్నారు. మొత్తం జనాభాలో వీరి శాతం 38.93. 40-49 సంవత్సరాల గ్రూపులో 4,29,668 మంది ఓటర్లు (22.51 శాతం) ఉన్నారు. 50-59 ఏళ్ల గ్రూపులో 3,13,492 మంది ఓటర్లు (16.42 శాతం) ఉన్నారు. ఎన్నికల ఫలితాల నిర్ధారణలో నడివయస్కుల మనోభావాలు చాలా కీలకంగా కనిపిస్తున్నాయి. సాధారణంగా ఈ వయసులో ఉన్నవారు కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. పార్టీలు, వారి సిద్ధాంతాలు, కులాలు.. ఇలాంటి అంశాలు ఈ వర్గంపై పెద్దగా ప్రభావం చూపవు. తన కుటుంబం ఆర్థిక పరిస్థితికి ఏ అంశాలు అనుకూలిస్తున్నాయి, ప్రతిబంధకాలుగా ఏవి అన్న విషయాలే ఈ వర్గాల ఓటు మార్గమేటో నిర్ణయిస్తాయని నిపుణులు అభిప్రాయం. ఆ కోణంలో చూస్తే, నిత్యావసర సరుకుల ధరలు, ఆరోగ్యపరంగా అందుతున్న సేవలు, పిల్లల చదువులు, ఉద్యోగాల విషయంలో జరుగుతున్న మేళ్లు, సంక్షేమ పథకాల అమలు తీరు ఈ ఓటర్లపై ప్రభావం చూపుతా యి. గమనించాల్సిన విషయం ఏమంటే ఈ గ్రూప్‌లో 40-49 ఏళ్ళ మధ్య 22.51 శాతం ఉంది ఉన్నారు. ఒకవిధంగా వీరిని కూడా యువకులుగానే భావించాల్సి ఉంటుంది. వీరిలోనూ ఉడుకు రక్తం, కుటుంబంతోపాటు సమాజం పట్ల బాధ్యత పాళ్లు ఎక్కువగా ఉంటాయి. అధికారంలో ఉన్న నాయకుల నైతిక ప్రవర్తన, తన తోటి మనిషి ధన, మాన, ప్రాణాలకు లభిస్తున్న రక్షణ, కుటుంబా లను పతనం చేస్తున్న అనైతిక బలహీనతలు.. వాటికి కారణమైన పార్టీలు.. ఇవన్నీ ఈ ఏజ్ గ్రూప్ ఓట ర్లపై ప్రభావితం చూపిస్తాయి. ఈ కోణంలో చూస్తే నడివయస్కుల గ్రూపు ఓటర్లు అధికార పార్టీ గడిచిన ఐదేళ్లు సాగిం చిన పరిపాలన తీరుతెన్నులే ఈ ఓటర్ల మనోభా వాలపై ఎక్కు వ ప్రభావం చూపుతాయి.

- నెల్లూరు ఆంధ్రజ్యోతి



ఎన్నికలకు సిద్ధంగా ఉండండి : ఎస్పీ

నెల్లూరు (క్రైం) : రాబోయే ఎన్నికలను శాంతి యుతంగా జరిపించేలా ప్రణాళికలు సిద్ధం చేసు కొని అంతా సన్నద్ధం కావాలని ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జరిగిన నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. స్టేషన్ల పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ గ్రామ సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు, పోలీసుల మధ్య ఒక అవినాభావ సంబంధాన్ని మెరుగు పరుచుకోవాలని ఆదేశిం చారు. ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లను వెంటనే బైండోవర్ చేసి వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉం చాలని, లైసెన్సులు కలిగిన ఆయుధాలను డిపాజిట్ చేయించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు, టోల్‌ప్లాజాల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు బీట్ వ్యవస్థను మరింతగా బలోపేతం చేయాలని, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగా లన్నారు. అనంతరం పెండింగ్‌లో వివిధ కేసులపై అధికారులతో సమీక్షించారు. పెండింగ్ కేసులను తగ్గించడంలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో రెడీ కండి!

● అధికారులతో కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం): ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పక్కా ప్రణాళికతో సిద్ధమవ్వాలని కలెక్టర్ హరినారాయణన్ జిల్లా యంత్రాంగాన్ని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల ప్రక్రియకు ముందస్తు ఏర్పాట్లపై రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రతి ఎన్నిక కొత్తగానే ఉంటుందని భావించి ఏ చిన్న పొరపాటు జరిగినా, నిబంధనలు అతిక్రమించినా ఎవరూ కాపాడలేరని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ఒకేసారి జరగనున్న దృష్ట్యా ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, అధికారులంతా బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులంతా రిటర్నింగ్, నోడల్ అధికారులు తమకు అవసరమైన సిబ్బందిని ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో లవన్న, ట్రైనీ కలెక్టర్ సంజనాసింహ, ఏఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

● రామాయపట్నం నిర్వాసితులకు..

రామాయపట్నం పోర్టు నిర్వాసితుల కోసం ఇంకా చేపట్టాల్సిన పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం ఆ పోర్టుకు సంబంధించిన అంశాలపై అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పునరావాస కార్యక్రమాలపై పోర్టు ఎండీతో చర్చించారు. కర్లపాలెం, సాలిపేట, ఆర్అండ్ఆర్ కాలనీల నిర్మాణ ప్రగతిని, ఇండస్ట్రియల్ హబ్ ప్రగతిపై చర్చించారు. ఈ సమావేశంలో పోర్టు ఎండీ ప్రతాప్‌రెడ్డి, కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో 28న 'రా.. కదలిరా!'

- బహిరంగ సభలో పాల్గొననున్న చంద్రబాబు
- కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
- టీడీపీ శ్రేణులకు నేతల పిలుపు

నెల్లూరు (వైద్యం), జనవరి 23 : 'రా కదలి రా' పేరిట తెలుగు దేశం పార్టీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న బహిరంగ సభ ఈ నెల 28వ తేదీన నెల్లూరులో జరగనుంది. ఈ కార్యక్రమ విజయవంతం కోసం మంగళవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, జోన్ ఇన్‌చార్జ్ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పాల్గొని సభ ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ చంద్రబాబు పాల్గొనే సభను విజయవంతం చేసేందుకు అని నియోజకవర్గాల ఇన్‌చార్జులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కుటుంబ సాధికార సారథులు నియామకం, ఓటరు వెరిఫికేషన్‌లపై దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాళ్లపాక రమేష్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీదాటి రాధయ్య, కావలి, కోవూరు నియోజన వర్గాల ఇన్‌చార్జులు మాలేపాటి సుబ్బానాయుడు, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, నేతలు బొమ్మి సురేంద్ర యాదవ్, బుల్లెట్ రమణ, రాచమల్లు శ్రీనివాసులరెడ్డి, తాళ్లపాక అనూరాధ, కొండూరు పాల్ శెట్టి, వేమిరెడ్డి పట్టాభిరామి రెడ్డి, జెన్ని రమణయ్య, దావా పెంచలరావు, పమిడి రవి కుమార్ చౌదరి, రాజానాయుడు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సోమిరెడ్డి

అమ్మ.. ప్రతిమా!

- ఇసుక అమ్మకాల్లో దోపిడీకి తెరలేపిన అధికార పార్టీ నేత!?
- బాట పేరుతో బాదేస్తున్న వైనం
- ఒక్కో లోడుకు సగటున రూ.750 వసూలు
- పది రోజుల్లోనే రూ.3 కోట్లకుపైగా దందా
- తిరగబడ్డ ట్రాక్టర్, టిప్పర్ల యజమానులు
- ఇసుక కొనుగోలు ఆపేసి నిరసన
- ఈ భారం తమపై పడటంతో వైసీపీపై దుమ్మెత్తిపోస్తున్న ప్రజలు

ఇసుక విక్రయాల్లో ఇదోరకం దోపిడీ. ఉచితంగా దొరికే ఇసుకకు ధర నిర్ణయించిన వైసీపీ ప్రభుత్వం ఓ సంస్థకు విక్రయించుకునే బాధ్యత అప్పగించింది. అయితే, సదరు సంస్థ నుంచి జిల్లా బాధ్యతలు తీసుకున్న వైసీపీకి చెందిన ఓ ప్రజప్రతినిధి 'బాట' పేరుతో బాదడం మొదటుపెట్టాడు. ప్రభుత్వ ధరతోపాటు అదనంగా రూ.750 వరకు వసూలు చేస్తున్నారు. పది రోజుల నుంచి ఈ దందా సాగుతున్నా అధికారులెవరూ నోరు మెదపడం లేదు. భవన నిర్మాణదారులపై ఆ భారం మోపలేని ట్రాక్టర్, టిప్పర్ల యజమానులు కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులపై తిరగడబడ్డారు. రెండురోజులుగా ఇసుక కొనుగోలు ఆపేశారు.

నెల్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇసుక కష్టాలు తప్పడం లేదు. రోజుకో కొత్త విధానంతో వినియోగదారులు దోపిడీకి గురవుతునే ఉన్నారు. నిర్మాణ రంగంపై ఆధారపడిన వేలాది తాపీమేస్త్రీ కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయి. ట్రాన్స్‌పోర్టర్లు అప్పుల కంతులు చెల్లించలేక దివాలా తీస్తున్నారు. ఇది చాలదన్నట్లు కొత్తగా రీచ్‌లను కైవసం చేసుకున్న ప్రతిమ సంస్థ డైరెక్టుగా ప్రజలను బాదడం మొదలు పెట్టింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరతోపాటు 'బాట' పేరుతో మామూళ్లు వసూలు చేస్తున్నారు. ఒక టన్ను ఇసుకపై ప్రభుత్వం రూ.350 వసూళ్లు చేస్తుంటే, కాంట్రాక్ట సంస్థ దానికి అదనంగా ఒక లోడు ఇసుకకు సగటున రూ.750 చొప్పున వసూలు చేస్తోంది. రీచ్‌ల వద్ద రోడ్ల మరమ్మతుల పేరుతో పది రోజులుగా ఈ దోపిడీ జరుగుతోంది.

● లోడుకు సగటున రూ.750

ప్రభుత్వం ఇసుక ధరను నిర్ణయించింది. ఆ ధరకే విక్రయించాలనే నిబంధనతో ప్రతిమ అనే సంస్థకు ఇసుక రీచ్‌లను లీజుకు ఇచ్చింది. ఆ సంస్థ తరఫున జిల్లా పరిధిలోని రీచ్‌ల నిర్వహణ బాధ్యతను జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే తీసుకున్నారు. రీచ్‌లో ఇసుక విక్రయాలు జరపడానికి అవసరమైన సిబ్బందిని ఆయనే నియమించారు. అన్ని సెట్ చేసుకున్న తరువాత ఇటీవల ఇసుక అమ్మకాలు మొదలుపెట్టారు. తొలిరోజు ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకే డబ్బులు వసూళ్లు చేశారు. మరుసటి రోజు నుంచి కొత్త వసూళ్లు మొదలు పెట్టారు. ప్రధాన రహదారుల నుంచి రీచ్‌ల వద్దకు రోడ్లు నిర్మించాలనే సాకుతో ప్రతి ఇసుక రవాణా వాహనంపై ట్రిప్పునకు అదనంగా 500 నుంచి 1500 రూపాయల వరకు వసూళ్లు చేయడం మొదలు పెట్టారు. అంటే ట్రాక్టరుకు రూ.500, టిప్పరుకు 1500, పెద్ద లారీలకు 2వేలు చొప్పున వసూళ్లు మొదలు పెట్టారు. సరాసరిని లోడు ఇసుకకు రూ.750 వసూలు చేస్తున్నారు.

● కొనుగోళ్లు బంద్


రీచ్‌ల వద్ద రోడ్ల మరమ్మతుల పేరుతో మొదలైన ఈ దోపిడీ పది రోజులైనా ఆగకపోవడంతో ట్రాన్స్‌పోర్టర్లు తిరుగుబాటు ప్రకటించారు. రోడ్ల మరమ్మతుల కోసం ఒక రోజు వసూళ్లు చేసి వదిలేస్తారని అనుకుంటే పది రోజులైనా దందా ఆగకపోవడంతో వారంతా తిరగబడ్డారు. జిల్లా పరిధిలోని పల్లెపాడు సహా అన్ని రీచ్‌లలో సోమ, మంగళవారాల్లో ఇసుక కొనుగోళ్ల బంద్ చేశారు.

● పట్టించుకోని యంత్రాంగం

రీచ్‌ల వద్ద అదనపు వసూళ్లపై ట్రాన్స్‌పోర్టర్లు, వినియోగదారులు మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా మైనింగ్ శాఖ అధికారులు రాష్ట్ర మైనింగ్‌శాఖ అధికారులకు ఈ విషయం తెలియజేశారు. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. ఇక్కడ అధికారుల్లోనూ చలనం లేదు. అంతా తేలుకుట్టిన దొంగల్లా మౌనంగా దోపిడీకి పరోక్ష సహకారం అందిస్తున్నారని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

10 రోజులు.. రూ.3 కోట్లు?

జిల్లాలో మొత్తం ఆరు ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఒక్కో రీచ్ నుంచి ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్లు అన్నీ కలిపి రోజుకు సుమారుగా 700 నుంచి 800 లోడ్ల ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. ట్రాక్టరు, లారీ, టిప్పర్లకు అన్నింటికి కలిపి సగటున ఒక్కో లోడుపై అదనంగా 750 రూపాయలు చొప్పన వసూళ్లు చేస్తున్నట్లు అంచనా. ఈ లెక్కన రీచ్‌లు పునఃప్రారంభమైన పది రోజుల కాలంలో ట్రాన్స్‌పోర్టర్ల నుంచి సుమారుగా రూ.3 కోట్లు అదనంగా దండుకున్నారు. పరోక్షంగా ఈ భారం ఇసుక కొనుగోలు చేస్తున్న భవన నిర్మాణదారులపై పడుతోంది. రీచ్‌ల వద్ద వసూళ్లు చేస్తున్న అదనపు ధరను ట్రాన్స్‌పోర్టర్లు వినియోగదారుల నుంచి వసూళ్లు చేస్తున్నారు.



ఊరూరా లోకేష్ జన్మదిన వేడుకలు


కావలి : కేక్ కట్ చేసి మాలేపాటికి తినిపిస్తున్న టీడీపీ నేతలు


కందుకూరు : పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న నళినీదేవి


ఆత్మకూరు : కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు


వింజమూరు : బహుమతులు అందజేస్తున్న కాకర్ల సురేష్


ఉదయగిరిలో కేక్ కట్ చేస్తున్న చెంచలబాబు యాదవ్


జలదంకిలో..


అల్లూరు : కేక్ కటింగ్‌లో బీద గిరిధర్, తెలుగు యువత నేతలు


బిట్రగుంటలో కేక్ కట్ చేస్తూ..


అనంతసాగరంలో..


సీతారామపురంలో కేక్ తినిపిస్తూ..


కొండాపురంలో..


సంగంలో..

కావలి, జనవరి 23: యువనేత నారా లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం కావలి టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాయంలో పట్టణ, రూరల్ మండల నేతల నడుమ భారీ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. అనంతరం ఏరియా వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంచి పెట్టారు. కార్యక్రమం లో టీడీపీ నేతలు మన్నవ రవిచంద్ర, గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, పోట్లూరు శ్రీనివాసులు, బొట్లగుంట శ్రీహరినాయుడు, కాకి ప్రసాద్, ఆవుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : స్థానిక కావలి రోడ్డు వద్ద నారా లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీడీపీ నేత బీద గిరిధర్ తెలుగు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి అభిమానులు, నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, తోట శ్రీహరి, పెనుమల్లి శ్రీనివాసులు రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బుల్లా కృష్ణారెడ్డి, అరగల రమణయ్య, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : నారా లోకేష్ జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఆధ్వర్యంలో కేకును కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు యారవ క్రిష్ణయ్య, పోలినేని రమేష్, కుంకు మోహనరావు, నర్రా చెంచునాయుడు, వల్లూరు వెంకటేశ్వర్లు, నర్రా నారాయణ, బద్దిపూడి మాచర్ల పాల్గొన్నారు.

జలదంకి : నారా లోకేష్ జన్మదిన వేడుకలు స్థానిక టీడీపీ కార్యాలయం లో ఘనంగా జరిగాయి. భారీ కేక్ కట్‌చేసి కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు పీ.మధుమోహన్‌రెడ్డి, వంటేరు జయచంద్రారెడ్డి, పీ.భాస్కర్‌రెడ్డి, పీవీ.రమణయ్య, పీ.పెంచలయ్య నాయుడు, కె.వినోద్‌నాయుడు, మాదిరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : స్థానిక టీడీపీ కార్యాలయంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, కాకు మహేష్, ఊసా మాల్యాద్రి, కల్లూరు చంద్రమౌళి, కట్టా వెంకటేశ్వర్లు, కర్నాటి ప్రభాకర్, స్వర్ణ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో నారాలోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నేతలు కోటా వెంకారెడ్డి, సుధీర్‌బాబు, కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, కాంద్ర రఘురామ్‌నాయుడు, ఎర్రం వేంకటేశ్వర్లురెడ్డి, దొడ్ల అంజయ్యయాదవ్, అన్నంగి ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : లోకేష్ జన్మదిన వేడుకలను ఆపార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నాగేశ్వరరావు ఆర్థిక సహాయంలో పలువురు చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నా యకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, ముచ్చు శ్రీను, గోచిపాతల మోషే, చిలకపాటి మధు, షేక్ రఫి, బెజవాడ ప్రసాదు పాల్గొన్నారు.

● టీడీపీ మహిళా నాయకురాలు ఉన్నం నళినీదేవి ఆధ్వర్యంలో లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పొడపాటి నరసింహం, పొడపాటి రాములు తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ కార్యాలయంలో లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాజేష్ అభిమానులు కేకు కట్ చేసి పంచిపెట్టారు.

సంగం : నారా లోకేష్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, కే కరుణాకర్‌రెడ్డి, షేక్ బాబు, వెంకటేశ్వర్లు యాదవ్, శ్రీని వాసచౌదరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే వెంకటేశ్వరపురంలోని లాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో టీడీపీ వైద్య విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ సిరాజ్ కేక్ కట్ చేశారు. అనంతరం పండ్లు, రొట్టెలు, భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వీఎల్ నారాయణరావు, శ్రీహరి, ఖాజామొహిద్దీన్, రామ్మూర్తి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా సీతారామపురం బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం టీడీపీ నాయకులు,కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచి భాగ్యకుమారి, నాయకులు వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, పిడుగు రమేష్, జాషువా, చంద్రారెడ్డి, పెద్దగౌసు, జయరాములు పాల్గొన్నారు.

అనంతసాగరం : నారా లోకేష్ జన్మదినం సందర్భంగా టీడీపీ శ్రేణులు మంగళవారం మండలంలోని శంకరనగరంలో కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శాఖమూరి వెంకటేశ్వర్లునాయుడు, కమ్మ ప్రభాకర్‌నాయుడు, కార్తీక్ చౌదరి, మాజీ సర్పంచి వెంకటసుబ్బమ్మ, మహేష్ నాయుడు పాల్గొన్నారు.

ఆత్మకూరు : యువనేత నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళ వారం టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బీఎస్ఆర్ సెంటర్ నిర్వహించిన వేడుకల్లో టీడీపీ నేతలు కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. భారీగా బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు. పులిమి శైలజారెడ్డి, కౌన్సిలర్ షేక్ గౌస్‌బాషా, శ్రీకాంత్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో నాయకులు బయన్న, కలివెల జ్యోతి, మాబాషా, ఖాన్‌సా, సురేష్, అబిద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేట : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం యువనేత నారా లోకేష్ జన్మదిన వేడుకలను మండల టీడీపీ అధ్యక్షుడు అబ్బూరి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.లోకేష్ ఆరోగ్యంగా ఉండాలని,భవిష్యత్‌లో ఉన్నత పదవులు చేపట్టాలని ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ షేక్ ఖాజామియా, మాజీ వైస్ ఎంపీపీ దేవరాల హజరత్తయ్య,వాకిచర్ల వీర ప్రతాప్,యస్థాని, కలాం, సుధాకర్‌రెడ్డి, నజీర్, షఫీ,జనసేన నేత అక్బర్ తదితరులు పాల్గొన్నారు.


ఏఎస్ పేట దర్గాలో ప్రార్థనలు చేస్తున్న టీడీపీ నాయకులు

వింజమూరు : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం నారా లోకేష్ జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దంతులూరి వెంకటేశ్వరరావు, గూడా నరసారెడ్డి, కొండపల్లి వెంకటేశ్వరనాయుడు, చావా మహేంద్ర, మహబూబ్‌బాషా, తిరుపతాచారి, వేములపాటి మాల్యాద్రి, వాసు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని బొమ్మరాజుచెరువులో ఉన్న కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం ప్రాంగణంలో లోకేష్ జన్మదిన వేడుకలను నియోజకవర్గ టీడీపీ నాయకులు, కాకర్ల ట్రస్టు అధినేత కాకర్ల సురేష్ ఆధ్వర్యలో ఘనంగా నిర్వహించారు. యువత సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం సంక్రాంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన క్రీడల పోటీల విజేతలకు సురేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ కార్యకర్తలు, క్రీడాకారులు, ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కలువాయి : యువనేత నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కలువాయిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం కిషోర్‌రెడ్డి, సోమయ్య యాదవ్, తిప్పిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రామనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కలువాయిలో..

రేపు గ్రామసభలు నిర్వహించాలి

ఉదయగిరిరూరల్, జనవరి 23: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారం గ్రామసభలు నిర్వహించాలని ఈవోపీఆర్డీ మల్లికార్జున తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ప్రణాళికలు తయారుచేసి ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. మార్చిలోపు నూరుశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని కోరారు.

నూరుశాతం లక్ష్యాలు సాధించాలి

ఉదయగిరిరూరల్, జనవరి 23: మండలంలో జరుగుతున్న కులగణన సర్వేకు సంబంధించి నూరుశాతం లక్ష్యాలు సాధించాలని ప్రత్యేకాధికారి తోట శ్రీనివాసులు అన్నారు. మంగళవారం వెంగళరావునగర్, తిరుమలాపురం సచివాలయాల పరిధిలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు కేవలం 40శాతం మాత్రమే సర్వే చేపట్టామన్నారు. ఈనెలాఖరులోపు లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. అలాగే నేలటూరులోనూ ప్రత్యేకాధికారి బీ శ్రీనివాసులు సర్వేను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

నేడు జాతీయ సెమినార్

ఉదయగిరిరూరల్, జనవరి 23: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జంతుశాస్త్ర విభాగంలో జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బలక్షమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ నాగేంద్రప్రాద్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ బయోటెక్నాలజీ ఇన్‌హెల్త్‌కేర్, అగ్రికల్చర్, ఇన్సైట్స్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై సెమినార్ జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత ఆచార్యులు కృష్ణకుమార్, వీఎస్‌యూ సహాయ ప్రొఫెసర్ సాయినాథ్, మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల ఆచార్యులు గోపీనాథ్, అనిల్‌కుమార్ పాల్గొంటారన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

వరికుంటపాడు : మండలంలో బుధవారం నుంచి జరిగే సామాజిక తనిఖీ బృందాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఆర్‌పీ బుజ్జి కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 పంచాయతీల్లో ఉపాధి పనులను సమగ్రంగా తనిఖీ చేయడంతోపాటు కూలీలను విచారిస్తారని తెలిపారు. ఏడుగురు డీఆర్‌పీలతో అన్ని పంచాయతీల్లో తనిఖీలు చేపట్టి గ్రామసభలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, ఎఫ్ఏలు, టీఏలు, సీవోలు పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

తుమ్మలపెంటలో రోడ్డు ఆక్రమణ!
● గోడ నిర్మాణాన్ని అడ్డుకున్న స్థానికులు


రోడ్డుకు అడ్డుగా గేటు ఏర్పాటుకు నిర్మించిన గోడ

కావలి రూరల్, జనవరి 23: ఆక్రమణలకు కాదేది అనర్హం అన్నట్లుగా పేదలకు ప్రభుత్వం ఇచ్చిన లేఅవుట్‌లోని 30 అడుగుల రోడ్డు ఆక్రమించి అడ్డంగా గోడ నిర్మాణం చేపట్టిన ఘటన కావలి మండలం తుమ్మలపెంటలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. తుమ్మలపెంట గ్రామ సచివాలయం ఎదురుగా 2007వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న మాగుంట పార్వతమ్మ సర్వే నెంబరు 1700లో 72 ప్లాట్లతో లేఅవుట్ వేయించి స్థలాలు లేని పేదలకు కేటాయించారు. సచివాలయం ఎదురుగా ఉన్న ఆ లేఅవుట్‌లోని 18 అంకణాల స్థలం ఇటీవల కొనుగోలు చేసిన ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి ఇతరులకు ప్రవేశం లేకుండా రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాంచి గేటు ఏర్పాటుకు ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. అయితే గ్రామ సచివాలయం ఎదురుగా 30 అడుగుల రోడ్డు ఆక్రమించి గోడ కడుతున్నా ఎదురుగా ఉన్న సచివాలయ అధికారులకు పట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారుల పరిశీలన

వరికుంటపాడు, జనవరి 23: మండలంలోని విరువూరు, నార్త్‌కొండాయపాళెం, తూర్పుబోయమడగల గ్రామాల్లో ఇటీవల నిర్మించిన సిమెంట్ రోడ్లను మంగళవారం పంచాయతీ రాజ్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగబాలుడు, సిబ్బంది రమణయ్య, కాంట్రాక్టర్లు పాలకొల్లు భాస్కర్‌రెడ్డి, మాగంటి సిద్ధయ్య, ఒంటేరు నారాయణ తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

సంగం, జనవరి 23: మండలంలోని జంగాలకండ్రికలో ఉన్న కోదండ రామస్వామి ఆలయంలో మంగళవారం ఆంజనేయస్వామి విగ్రహాన్ని వైభవంగా ప్రతిష్ఠించారు. ముందుగా వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం యంత్ర ప్రతిష్ఠ, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చేతిపంపు ఆక్రమణపై ఫిర్యాదు

వరికుంటపాడు, జనవరి 23: మండలంలోని గణేశ్వరపురం శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన చేతిపంపును గ్రామానికి చెందిన రైతు ఆక్రమించాడని మంగళవారం అదే గ్రామానికి చెందిన పేరం సుధాకర్‌రెడ్డి ఎంపీడీవో శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. చేతిపంపు భాగాలను ఊడదీసి మోటారును అమర్చి, వ్యవసాయ భూములకు నీటిని మళ్లించుకుంటున్నాడని పేర్కొన్నాడు. అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరాడు. స్పందించిన ఆమె పరిశీలించి పనులు నిలుపుదల చేయాలని పంచాయతీ కార్యదర్శి సమీర్‌ను ఆదేశించారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ గ్రామసభలు

సీతారామపురం, జనవరి 23 : మండలంలోని మారంరెడ్డిపల్లి, గుండుపల్లి గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుధాకర్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి, డాక్టర్ స్వప్న, హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ చెన్నరాయుడు, ఈసీ సువర్తయ్య, ఏపీఎం సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


లింగసముద్రం: తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

లింగసముద్రం, జనవరి 23 : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక ఆర్థికపరమైన, సర్వీస్ సంబంధ సమస్యలను పరిష్కరించాలని బీటీఏ మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీటీఏ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పి.మాధవరావు, వెంకట్రావు, కార్యవర్గసభ్యులు మంగళవారం తహసీల్దారు టీ.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నల్లరిబ్బన్లు ధరించి స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, కె.మోహన్‌రావు, నాయకులు కోటేశ్వరరావు, మధుసూదనరావు, కాలే మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆర్థిక బకాయిలను తక్షణం చెల్లించాలని కోరుతూ ప్రభుత్వంపై పోరాటం ఉధృతం చేస్తామని బీటీఏ ఉపాధ్యాయసంఘం నేతలు తెలిపారు. ఈ మేరకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సంఘం నేతలు డిప్యూటీ తహసీల్దారు కోటేశ్వరరావుకు అందచేశారు. ఆసంఘం జిల్లా అధ్యక్షుడు మధు మాట్లాడుతూ ఈనెల 28న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన, ఫిబ్రవరి 5న విజయవాడలో మహాధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాఖ మండల అధ్యక్షుడు జీ.మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి మధు, గౌరవ అధ్యక్షుడు ఓపీ.నరసయ్య, మనోహర్, పీ.శ్రీనివాసులు, కే.వెంకటేశ్వర్లు, షేక్.చాంద్‌బాషా పాల్గొన్నారు.

బిట్రగుంట : ఉపాధ్యాయులు దీర్ఘకాలికంగా పరిష్కారం కాని ఆర్థిక ఇతర సమస్యలను రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవాలని మండల బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.కిశోర్ కోరారు. బోగోలు మండల ఎంపీడీవో వెంకటసుబ్బారావు, విద్యాశాఖ అధికారి జయమ్మలకు మంగళవారం వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, సభ్యులు రవి, తదితరులు పాల్గొన్నారు.

దోమలను నివారించండి సారూ..

అల్లూరు, జనవరి 23 : అల్లూరు పట్టణ పరిధిలో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న దోమలను నివారించాలని జనసేన మండల నాయకుడు కారుమంచి కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్‌కు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ప్రధాన రహదారుల్లో చెత్త పేరుకుపోవడం, మురికి కాలువల్లో నీరు నిల్వ చేరడంతో దోమలు ప్రబలుతున్నాయన్నారు. స్పందించి ఆయన తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాఘవయ్య, బెజవాడ రవికుమార్, కడప కేశవాచారి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

కలిగిరి, జనవరి 23: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై తహసీల్దారు శ్రీరామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి స్థానికులకు అవగాహన కల్పించారు. ఓటు వేసే విధానం, వేసిన ఓటును సరిచూసుకునే విధానాలపై ప్రదర్శన నిర్వహించారు. అదేవిధంగా రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ మురళీధర్ రాజు, పాల్గొన్నారు.

పోలేరమ్మకు భక్తిశ్రద్ధలతో గ్రామ పొంగళ్లు

బిట్రగుంట, జనవరి 23: బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల దళితవాడలో పోలేరమ్మ గ్రామ పొంగళ్లు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. పోలేరమ్మ వేషధారణలో పాతబిట్రగుంటకు చెందిన కొప్పోలు రాజా నృత్య ప్రదర్శన స్థానికులను ఆకట్టుకుంది. తప్పెట్లు తాళాలు మంగళవాయిద్యాలతో స్థానికులు పోలేరమ్మ వేపచెట్టు వద్దకు చేరుకున్నారు. కోవూరుపల్లి గ్రామ గెవిటిలో వెలసిన ఇరుగ్రామాల దేవత పోలేరమ్మ ఆలయానికి భారీ సంఖ్యలో తరలివెళ్లిన భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

బీసీల నమ్మక ద్రోహి జగన్ : ఇంటూరి


'జయహో బీసీ' గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఇంటూరి

కందుకూరు, జనవరి 23: బీసీల నమ్మక ద్రోహి జగన్ అని, బీసీలకు ఒక్క పథకం కానీ కార్పొరేషన్ రుణాలు కానీ లేకుండా చేసి తీరని ద్రోహం చేశాడని టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావుతో పాటు జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, బీసీ నాయకులు చిలకపాటి మధుబాబు, కొండూరు పాలిశెట్టి, పీఎల్ రావు, గంజాం రాఘవేంద్ర, కప్పిర శీనయ్య, ఉప్పు భాస్కర్, షేక్ సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె విరమణ


కావలిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కావలిటౌన్, జనవరి 23: సమస్యల పరిష్కారం కోసం 43 రోజులుగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారం విరమించారు. ఈ సందర్భంగా పట్టణంలో సీఐటీయూ నేతలతో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నేత పెంచలయ్య, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు రఘురావవమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం జరిపిన చర్చల్లో 11 డిమాండ్లలో 10 డిమాండ్లు నెరవేర్చేందుకు అంగీకరించడంతో సమ్మె విరమించినట్లు తెలిపారు. జూలై 1నుంచి జీతాలు పెంచేంటట్లు, సమ్మె కాలానికి జీతాలు చెల్లించడం, కేసులు ఎత్తివేయడం తదితర ప్రధాన డిమాండ్లు నెరవేర్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు విజయలత, సుభాషిణి, వజ్రమ్మ, సీఐటీయూ నేతలు తాళ్లూరు మాల్యాద్రి, రావి మాల్యాద్రి, మధుసూదన్‌రావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఉదయగిరిరూరల్ : సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అంగన్‌వాడీలు సంబరాలు నిర్వహించారు. నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ కార్యకర్తలు ఎంతో పట్టుదలతో సమ్మెను విజయవంతంగా కొనసాగించారని కొనియాడారు. కాగా కృష్ణారెడ్డిపల్లికి చెందిన కార్యకర్త 8 నెలల గర్భిణీ అయినప్పటికీ చివరి రోజు వరకు సమ్మెలో పాల్గొనడంతో ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయమ్మ, సీపీఎం నాయకులు షేక్ ఫరుద్దీన్‌బాషా, కోడె రమణయ్య, ప్రమీల, కార్యకర్తలు పాల్గొన్నారు.


సంబరాలు జరుపుకుంటున్న అంగన్‌వాడీలు

ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చూడాలి


ఇసుక బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

బిట్రగుంట, జనవరి 23: చెరువు ఆయకట్టు రైతులకు సాగునీరు అందకుండా అడ్డుకోవడం సరికాదని, రైతుల సమన్వయంతో వ్యవసాయం చేసుకునేలా చూడాలని వ్యవసాయ ఏడీఈ నాగరాజు అన్నారు. బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల చెరువు ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం లేదని ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆయన పరిశీలించి తొలగించారు. ప్రధాన కాలువకు కాస్త దూరంలో ముంగమూరుకు సంబంధించిన రైతులు అనాధికారకంగా కాలువకు ఇసుక బస్తాలు వేసి ఉంచడం గమనించి మండిపడ్డారు. చెరువులోని నీరు విడుదల చేయాలని సీపీఎం నాయకులు తుమ్మల వెంకయ్య, గడ్డంవెంకయ్య అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ జితేంద్రరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు హిమజ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సాగునీరు అడ్డుకుంటే.. తాగునీరు అడ్డుకుంటాం!

జలదంకి, జనవరి 23 : ఐఏబీలో కావలి కాలువకు 3 టీఎంసీలు చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు వరకు పంపిణీ చేయాలని నిర్ణయించగా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎస్వీపాలెం మేజర్ వరకు నీటిని నిలిపివేసి కింది ప్రాంతమైన జలదంకి మండలానికి అరకొర నీరు వచ్చేలా అధికారులపై ఒత్తిడి చేయడం సమంజసం కాదని సోమశిల ప్రాజెక్టు మాజీ వైస్ చైర్మన్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి సాగునీరు అడ్డగిస్తే కావలి పట్టణానికి చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి కావలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌కు వెళ్లే తాగునీటిని అడ్డగిస్తామని హెచ్చరించారు. ఉదయగిరి వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మండల నాయకులు మండలానికి సాగునీరు రాకుండా అడ్డగిస్తున్నా కావలి ఎమ్మెల్యేని ఎందుకు ప్రశ్నించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ సాగునీటి సంఘాల అధ్యక్షుడు పి.మధుమోహన్‌రెడ్డి, బి.భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కరియావుల అప్పలయ్య నాయుడు, పచ్చా పెంచలయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరును అభివృద్ధి చేస్తా : విక్రమ్‌రెడ్డి


ప్రజలతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 23 : ఆత్మకూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తనకు రాజకీయంగా జన్మనిచ్చిన ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. వెంకట్రావుపల్లిలో మంగళవారం ఆయన విజయీభవ యాత్రను కొనసాగించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ చేసిన అభివృద్ధి పనులను, చేయబోయే అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, జేఏసీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, వైసీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, స్థానిక కౌన్సిలర్ దగుమాటి శివకోటారెడ్డి, వైసీపీ నాయకులు ఆంద్రా సుబ్బారెడ్డి, ఆంద్రా రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల బహిరంగ వేలం

కావలి రూరల్, జనవరి 23: కావలి ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో తనిఖీల్లో పట్టుబడిన యజమానులు విడిపించుకోని వాహనాలకు బుధవారం ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఆర్టీవో వై.సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపరవాణా శాఖ కమిషనర్ బీ.చందర్ ఆదేశాల మేరకు తనిఖీల్లో పట్టుబడిన 33 వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వాహనాలను ఉన్న స్థలంలోనే ఉంచి కావలి ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు తెలిపారు. వాహనాల వివరాలను కార్యాలయంలోని నోటీస్ బోర్డులో పొందుపర్చామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.5000 డిపాజిట్‌ను డీడీ రూపంలో చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారికి జీఎస్టీ నెంబరు ఉండాలని పేర్కొన్నారు.

ఆత్మకూరు సెబ్ సీఐగా రవీంద్ర



ఆత్మకూరు, జనవరి 23 : స్థానిక సెబ్ సీఐగా కలువ రవీంద్ర మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా వేమూరులో పనిచేస్తూ ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ త్వరలో సర్కిల్ పరిధిలోని అన్ని మండలాలను పరిశీలిస్తానన్నారు. కాగా ఆత్మకూరు సెబ్ సీఐగా పనిచేస్తున్న బి నయనతార నరసారావుపేటకు బదిలీపై వెళ్లారు.